మంగళవారం
8•10•2019
కరీంనగర్
• వెల. రూ. 6.50
• సంపుటి 9 • సంచిక 104
• పేజీలు : 14 + 16

మన రాష్ట్రం • మన పత్రిక

# నమస్తే తెలంగాణ

నేడు విజయదశమి

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM KARIMNAGAR | HYDERABAD | WARANGAL | KHAMMAM | NALGONDA | MAHABUBNAGAR | NIZAMABAD








## చెడుపై విజయానికి ప్రతీక దసరా

■ గవర్నర్ తమిళిసై దసరా శుభాకాంక్షలు



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** దసరా పర్వదినం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా పండుగను జరుపుకోవాలని గవర్నర్ పేర్కొన్నారు. సమాజంలో దుష్టశక్తులను ఎదుర్కోవడానికి సమిష్టిగా పోరాడాలన్నారు. పర్యావరణ పరిరక్షణ, పచ్చని తెలంగాణ కోసం అందరు కృషిచేయాలని గవర్నర్ తమిళిసై పిలుపునిచ్చారు.

## దసరా ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలి: సీఎం కేసీఆర్



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర ప్రజలకు సీఎం కేసీఆర్ శుభాకాంక్షలు తెలియజేస్తూ.. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా జరుపుకునే ఈ పండుగ మానవాళికి ఓ సందేశమని తెలిపారు. ఈ పండుగ ప్రజల జీవితాల్లో కొత్త వెలుగులను నింపాలని ఆకాంక్షించారు. మనిషిని మంచి మార్గంలో నడిపించడానికి విజయదశమి స్ఫూర్తిగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రతి ఇంటా సుఖసంతోషాలు వెల్లివిరియాలని, ప్రతి ఒక్కరూ ఆనందంతో పండుగ జరుపుకోవాలని సీఎం ఆకాంక్షించారు.

## సంతోషంగా పండుగ జరుపుకోవాలి

■ దసరా శుభాకాంక్షలు తెలిపిన స్పీకర్, మంత్రులు



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక విజయదశమి అని, ప్రజలందరూ సంతోషంగా పండుగ జరుపుకోవాలని శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఆకాంక్షించారు. దసరా సందర్భంగా ఆయన ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. మంత్రులు టీ హరీశ్‌రావు, జీ జగదీశ్‌రెడ్డి, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, వీ శ్రీనివాస్‌గౌడ్, సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ కేసీఆర్ నేతృత్వంలో ప్రభుత్వం అన్ని రంగాల్లో విజయాలు సాధించాలని దుర్గామాతను వేడుకుంటున్నట్టు తెలిపారు. విజయ దశమి ప్రజల జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని ఆకాంక్షించారు.



కాళేశ్వరం ప్రాజెక్టు శరవేగంగా పూర్తయ్యేందుకు దోహదపడిన నీటిపారుదలశాఖ అసిస్టెంట్ సెక్రటరీ కే సత్యనారాయణకు సోమవారం ప్రశంసాపత్రం అందజేస్తున్న సీఎస్ ఎస్కే జోషి





సోమవారం ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలియజేస్తున్న టీఎస్‌ఐఐసీ చైర్మన్ గ్యాదరి బాలమల్లు

## బాలమల్లు పదవీకాలం పొడిగింపు

■ టీఎస్‌ఐఐసీ చైర్మన్‌గా మరో మూడేండ్లు.. ఉత్తర్వులు జారీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (టీఎస్‌ఐఐసీ) చైర్మన్‌గా గ్యాదరి బాలమల్లు పదవీకాలన్ని మరో మూడేండ్లపాటు పొడిగిస్తూ సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారు. సీఎం ఆదేశాలతో పరిశ్రమలశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుతం టీఎస్‌ఐఐసీ చైర్మన్‌గా ఉన్న బాలమల్లు పదవీకాలం ఈనెల 10తో ముగియనుండగా, పదవీకాలం పొడిగింపుతో ఆయన మరో మూడేండ్లపాటు చైర్మన్‌గా కొనసాగనున్నారు. తనకు మరో సారి చైర్మన్‌గా అవకాశం కల్పించిన సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌కు బాలమల్లు కృతజ్ఞతలు తెలిపారు.

## ఈ-దంతసేవ వెబ్‌సైట్ ప్రారంభం

■ దంత సమస్యలపై పౌరులకు అవగాహన కల్పించడమే లక్ష్యం

■ ఏర్పాటు చేసిన ఎయిమ్స్, కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ

**న్యూఢిల్లీ, అక్టోబర్ 7:** దంత సంరక్షణపై పౌరులకు అవగాహన కల్పించడం కోసం కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ, ఎయిమ్స్ సంస్థ సంయుక్తంగా 'ఈ-దంతసేవ' పేరుతో ఓ వెబ్‌సైట్, మొబైల్ అప్లికేషన్‌ను సోమవారం ఆవిష్కరించాయి. దేశంలో ఉన్న దంత వైద్యశాలలు, కళాశాలలు, చికిత్స కేంద్రాలు తదితర వివరాలను ఈ అప్లికేషన్‌లో పొందుపరిచారు. దంత చికిత్సాలయాలకు ప్రజలు సులభంగా చేరుకోవడానికి వెబ్‌సైట్‌లో జీపీఆర్‌ఎస్ సర్వీసును ఏర్పాటు చేసినట్టు అధికారులు తెలిపారు. నోరు, దంత సమస్యలకు సంబంధించి ప్రజలకు చక్కని సలహాలు అందించడానికి ఈ అప్లికేషన్ సాయపడుతుందని కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి హర్షవర్ధన్ పేర్కొన్నారు.

### ముహూర్తం



సూర్యోదయం: 6.08 గంటలకు



సూర్యాస్తమయం: 5.55 గంటలకు

వికారినామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, శుక్లపక్షం, దశమి మధ్యాహ్నం 2.49 వరకు, తదుపరి ఏకాదశి, నక్షత్రం: శ్రవణం రాత్రి 8.11 వరకు, తదుపరి ధనిష్ఠ, అమృతఘడియలు: ఉదయం 8.35 నుంచి 10.22 వరకు, రాహుకాలం: మధ్యాహ్నం 2.59 నుంచి సాయంత్రం 4.27 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 8.29 నుంచి 9.17 వరకు, తిరిగి రాత్రి 11.02 నుంచి 11.49 వరకు, వర్జ్యం: రాత్రి 12.41 నుంచి 2.29 వరకు.

### లోకం పోకడ




పాలపిట్ట ఎక్కడా తాతా..? అన్నీ డ్రోన్లే కనిపిస్తున్నాయి!

# ముగ్గురికి 'వైద్యం' నోబెల్

- అమెరికా పరిశోధకులు కెయిలిగ్, సెమెన్జా, బ్రిటన్‌కు చెందిన రాట్‌క్లిఫ్‌కు ప్రకటించిన అకాడమీ
- ఆక్సిజన్ స్థాయి-కణాల పనితీరు మధ్య సంబంధాన్ని గుర్తించిన శాస్త్రవేత్తలు
- రక్తహీనత, క్యాన్సర్ వంటి వ్యాధుల చికిత్సలో నూతన అధ్యాయానికి శ్రీకారం చుట్టారని ప్రశంస

**స్టాక్‌హోమ్:** వైద్యరంగంలో నోబెల్ బహుమతిని ఈ ఏడాది ముగ్గురు శాస్త్రవేత్తలకు సంయుక్తంగా ప్రకటించారు. 'కణాలు ఆక్సిజన్ స్థాయిలను ఎలా గుర్తిస్తాయి?, దానికి అనుగుణంగా తమ పనితీరును ఎలా మార్చుకుంటాయి?' అనే అంశాలపై పరిశోధనలు చేసిన అమెరికాకు చెందిన విలియం జీ కెయిలిన్ జూనియర్, గ్రెగ్ ఎల్ సెమెన్జా, బ్రిటన్ శాస్త్రవేత్త సర్ పీటర్ జే రాట్‌క్లిఫ్‌కు నోబెల్ కమిటీ పురస్కారాలను ప్రకటించింది. వారి పరిశోధన ఫలితాలు రక్తహీనత, క్యాన్సర్ తదితర వ్యాధులపై పోరాడటంలో సరికొత్త వ్యూహాలకు ఊపిరిపోశాయని కమిటీ ప్రశంసించింది. కెల్విన్ ప్రస్తుతం హార్వర్డ్ హ్యూస్ మెడికల్ ఇన్‌స్టిట్యూట్‌లో, సెమెన్జా.. జాన్ హాప్కిన్స్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ సెల్ ఇంజినీరింగ్‌లో వాస్క్యులార్ రీసెర్చ్ ప్రోగ్రామ్ డైరెక్టర్‌గా, రాట్‌క్లిఫ్ లండన్‌లోని ఫ్రాన్సిస్ క్రిక్ ఇన్‌స్టిట్యూట్‌లో క్లినికల్ రీసెర్చ్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. వీరికి




విలియం జీ కెయిలిన్, గ్రెగ్ ఎల్ సెమెన్జా, పీటర్ జే రాట్‌క్లిఫ్

రూ.6,48,72,978 (914,000 డాలర్లు) నగదు బహుమతి ఇవ్వనున్నారు. ఆల్‌ఫ్రెడ్ నోబెల్ వర్ధంతి సందర్భంగా డిసెంబర్ 10న స్టాక్‌హోమ్‌లో అందుకోనున్నారు.

### ఏం గుర్తించారు?

సాధారణంగా కణాలు ఆక్సిజన్ సాయంతో ఆహారాన్ని మండించి శక్తిని ఉత్పత్తి చేస్తుంటాయని తెలిసిందే. మనం చేసే పనులను బట్టి అవయవాలకు చేరే ఆక్సిజన్ స్థాయి భిన్నంగా ఉంటుంది. ఉదాహరణకు వ్యాయామం చేసినప్పుడు, వేగంగా నడిచినప్పుడు, గాయపడినప్పుడు.. ఇలా సమయాన్ని, పనిని బట్టి అవయవాలకు చేరే ఆక్సిజన్‌స్థాయి మారుతూ ఉంటుంది. ఆక్సిజన్ తగ్గినప్పుడు కణాలు గుర్తించి దానికి అనుగుణంగా జీవక్రియల వేగాన్ని మార్చుకుంటున్నాయి. ఇలా ఎందుకు జరుగుతున్నదనే అంశంపై ముగ్గురు నోబెల్ పురస్కార గ్రహీతలు పరిశోధనలు చేశారు. 'కణాలకు లభ్యమయ్యే ఆక్సిజన్ స్థాయి తగ్గిపోయినప్పుడు 'హైపోక్సియా-ఇండ్యూసబుల్ ఫ్యాక్టర్స్' (హెచ్‌ఐఎఫ్) అనే ప్రొటీన్ సముదాయం ఉత్పత్తి పెరుగుతుంది. ఇది ఎరిత్రోపాయెంటిన్ (ఈపీవో) అనే హార్మోన్‌ను ఉత్పత్తి చేసే జన్యువును ఉత్తేజపరుస్తుంది. ఈపీవో హార్మోన్ ఎర్రరక్త కణాల ఉత్పత్తిని పెంచుతుంది' అని శాస్త్రవేత్తలు గుర్తించారు. ఈ చర్య వల్లే ఎర్రరక్తకణాల ఉత్పత్తి పెరుగడం, గాయపడిన ప్రాంతాల్లో రక్తనాళాల పునరుత్పత్తి వంటి చర్యలు జరుగుతున్నాయి.

### ఎందుకంత ప్రాముఖ్యం

నివాసయోగ్యం కాని ప్రదేశాల్లో సైతం కొన్ని జీవులు ఎలా మనుగడ సాగించగలుగుతున్నాయో ఈ పరిశోధనలతో గుర్తించవచ్చని శాస్త్రవేత్తలు చెప్తున్నారు. 'క్యాన్సర్ కణతులు ఎర్రరక్తకణాల ఉత్పత్తిని అడ్డుకుంటున్నాయి. ఫలితంగా రక్తనాళాల ద్వారా వ్యాధి వేగంగా వ్యాప్తి చెందుతున్నది. తాజా పరిశోధనతో దీనిని అడ్డుకోవచ్చు. ఎర్రరక్త కణాల ఉత్పత్తిని కృత్రిమంగా ప్రోత్సహించగలిగితే రక్తహీనతను ఎదుర్కోవచ్చు' అని వివరించారు.

### మంచి పనికోసమే వెచ్చిస్తా

'సోమవారం ఉదయం 5 గంటలకే స్టాక్‌హోం నుంచి ఫోన్ వచ్చింది. పొద్దున్నే అక్కడి నుంచి ఫోన్ వచ్చిందంటే కొన్నిసార్లు చాలా మంచి విషయమే అయ్యుంటుందని నాకు తెలుసు. వెంటనే నా గుండె వేగంగా కొట్టుకోవడం మొదలుపెట్టింది. మొత్తంగా శుభవార్త విన్నాను. నగదు బహుమతిని కచ్చితంగా మంచి పనికోసమే వెచ్చిస్తా'

– విలియం జీ కెయిలిన్ జూనియర్

### ఈ ఫలితాన్ని ఊహించలేదు

'నేను నా పరిశోధన ప్రారంభించినప్పుడు ఈ ఫలితాన్ని ఊహించలేదు. కణాలపై ఆక్సిజన్ ప్రభావం అనే అంశం అన్నిసార్లూ పరిశోధనలకు తగినది కాదు. మా ప్రయాణంలో అనేకమంది మా పరిశోధన ఫలితంపై అనుమానాలను వ్యక్తంచేశారు. అయినా వెనక్కి తగ్గలేదు'

– పీటర్ జే రాట్‌క్లిఫ్

# కొత్త మున్సిపల్ చట్టంపై కాల్‌సెంటర్

- ఎలాంటి సందేహాలు వచ్చినా నివృత్తికి ఏర్పాటు
- కొత్త చట్టానికి అనుగుణంగా టౌన్‌ప్లానింగ్ నిబంధనలు
- పురపాలక శాఖ మంత్రి కే తారకరామారావు



టౌన్‌ప్లానింగ్ నిబంధనలపై అధికారులతో చర్చిస్తున్న మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కొత్త మున్సిపల్ చట్టంపై ప్రజలకు ఎలాంటి సందేహాలున్నా నివృత్తిచేసేందుకు కాల్‌సెంటర్ ఏర్పాటుచేయాలని పురపాలకశాఖ మంత్రి కే తారకరామారావు ఆదేశించారు. ప్రస్తుత టౌన్‌ప్లానింగ్ నిబంధనలను కొత్త మున్సిపల్ చట్టానికి అనుగుణంగా మార్చే విధానంపై ఆయన సోమవారం పురపాలకశాఖ కార్యాలయంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. టౌన్‌ప్లానింగ్ నిబంధనల్లో ఎలాంటి గందరగోళం లేకుండా, వీలైనంత వరకూ ప్రజలకు అర్థమయ్యేలా సులభతరం చేయాలని సూచించారు. పట్టణ ప్రజానీకానికి టౌన్‌ప్లానింగ్‌కు సంబంధించిన సమాచారం సులువుగా అందజేయాలని, ఇందులో మనుష్యుల ప్రమేయాన్ని వీలైనంతమేర తగ్గించాలని చెప్పారు. కొత్త పురపాలకచట్టంలో టౌన్‌ప్లానింగ్ విభాగానికి సంబంధించి విప్లవాత్మక నిర్ణయాల్ని పొందుపరిచామన్నారు. అనుమతులన్నీ ఒకేచోట కాకుండా, అందుబాటులో ఉన్న పలు ప్రత్యామ్నాయ మార్గాలు.. మీసేవ, మొబైల్‌యాప్, స్థానిక పట్టణసంస్థ వెబ్‌సైట్, యూఎల్బీలోని కియోస్కులు వంటి వాటి ద్వారా అనుమతులు అందించే పద్ధతులకు శ్రీకారం చుట్టాలన్నారు. ప్రతి పట్టణానికి సమగ్రమైన మాస్టర్‌ప్లాన్‌లో డిజిటల్ డోర్‌నంబర్ల విధానాన్ని పొందుపర్చాలని సూచించారు. ఈ సమావేశంలో పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి అరవింద్‌కుమార్, డీటీసీపీ డైరెక్టర్ కే విద్యాధర్, జీహెచ్‌ఎంసీ చీఫ్ సిటీప్లానర్ దేవేందర్‌రెడ్డి, హెచ్‌ఎండీఏ రిటైర్డ్ ఓఎస్డీ ఏవీ బీడే, డిప్యూటీ ప్లానర్లు పాల్గొన్నారు.

# భారత్ చేతికి.. స్విస్ ఖాతాల జాబితా!

■ ఒప్పందంలో భాగంగా తొలి విడుత వివరాలు అందజేసిన స్విట్జర్లాండ్




**న్యూఢిల్లీ/బెర్న్:** దేశంలోని నల్ల కుబేరుల గుండెల్లో దడ మొదలైంది. స్విస్ బ్యాంకుల్లో డబ్బులు దాచుకున్న భారతీయుల ఖాతాల వివరాలు కేంద్ర ప్రభుత్వానికి అందాయి. ఎప్పటికప్పుడు సమాచారాన్ని పంచుకునే విధానం (ఏఈవోఐ) కింద స్విట్జర్లాండ్‌కు చెందిన ఫెడరల్ ట్యాక్స్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్‌టీఏ) తొలి విడుత సమాచారాన్ని భారత్‌కు అందజేసింది. ఆగస్టులో ఢిల్లీకి వచ్చిన ఎఫ్‌టీఏ అధికారులు ఈ వివరాలను కేంద్రానికి ఇచ్చినట్టు సమాచారం. ఆ దేశం నుంచి తొలిసారిగా అందిన వివరాల్లో 2018లో భారతీయ ఖాతాదారులు జరిపిన లావాదేవీలతోపాటు ఖాతాల మూసివేతకు సంబంధించినవే ఎక్కువగా ఉన్నట్టు తెలుస్తున్నది. ఖాతాదారుని పేరు, చిరునామా, ఖాతాలోని నగదుకు సంబంధించిన వివరాలను అందజేసినట్టు ఎఫ్‌టీఏ అధికారి ఒకరు పీటీఐ వార్తా సంస్థకు తెలిపారు. అయితే సమాచారాన్ని రహస్యంగా ఉంచాలన్న నిబంధన ఉండటంతో ఒక వ్యక్తి లేదా సంస్థకు ఎన్ని బ్యాంకు ఖాతాలు ఉన్నాయి, వాటిల్లో కలిపి మొత్తం ఎంత నగదు ఉన్నది అన్న వివరాలు వెల్లడించబోమని ఆయన చెప్పారు. నల్లధనం దాచుకునేందుకు స్విస్ బ్యాంకులు స్వర్గధామంగా మారాయన్న ఆరోపణల నుంచి బయటపడేందుకు 2017లో ఆ దేశం చర్యలు చేపట్టింది. నల్లధనం వెలికితీత కోసం భారత్‌తోసహా 75 దేశాలతో ఎప్పటికప్పుడు సమాచారాన్ని పంచుకునే విధంగా ఒప్పందం కుదుర్చుకుంది. కాగా స్విట్జర్లాండ్ నుంచి భారత్‌కు అందిన తొలి విడుత వివరాల్లో ఎక్కువగా ప్రవాస భారతీయుల వివరాలు ఉన్నట్టు సమాచారం. తమ నల్లధనం గుట్టు బయటపడుతుందన్న భయంతో 2018లో సుమారు వంద మంది భారతీయులు స్విస్‌లోని తమ పాత బ్యాంకు ఖాతాలను మూసిన వివరాలే ఎక్కువగా ఉన్నట్టు తెలుస్తున్నది. తదుపరి విడుత వివరాలను 2020 సెప్టెంబర్‌లో అందజేయనున్నట్టు ఎఫ్‌టీఏ అధికారి తెలిపారు.

# ఉత్తమ్ కోటకు బీటలు

- కాంగ్రెస్ నుంచి టీఆర్‌ఎస్‌లోకి భారీగా చేరికలు
- ఎనభై శాతానికిపైగా స్థానిక ప్రజాప్రతినిధులు గులాబీ చెంతనే
- కేటీఆర్ రోడ్‌షోకు అద్భుత స్పందనతో ప్రత్యర్థుల బెంబేలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** హుజూర్‌నగర్‌లో ఉత్తమ్ కోటకు బీటలువారాయి. ఇన్నాళ్లు కాంగ్రెస్‌కు, ఉత్తమ్‌కు అండగా నిలిచిన ఆ పార్టీ నియోజకవర్గ, మండల, గ్రామస్థాయి నాయకులు గులాబీ పార్టీ చెంతన చేరుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లోనే మెజార్టీ స్థానాలను గెలిచిన టీఆర్‌ఎస్.. వివిధ పార్టీల నుంచి చేరుతున్న స్థానిక ప్రజాప్రతినిధులతో కళకళలాడుతున్నది. జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, ఎంపీపీలు, సర్పంచ్‌ల్లో 80శాతం మందికిపైగా టీఆర్‌ఎస్‌కు చెందినవారే ఉన్నారు. వీరందరూ పార్టీ అభ్యర్థి విజయానికి అహర్నిశలు కృషి చేస్తున్నారు. టీఆర్‌ఎస్ అభ్యర్థి సైదిరెడ్డికి అన్నివర్గాల నుంచి మద్దతు లభిస్తున్నది. నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే టీఆర్‌ఎస్ అభ్యర్థిని గెలిపించుకోవాలని ప్రజలు ప్రచారంలో ఎక్కడికెళ్లినా గులాబీ దళానికి ఘనస్వాగతం పలుకుతున్నారు. నియోజకవర్గంలో టీఆర్‌ఎస్ అధ్యక్షుడు, సీఎం కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పర్యటన తేదీలు ఒకట్రెండురోజుల్లో ఖరారు కానున్నాయి. ఇప్పటికే కేటీఆర్ హుజూర్‌నగర్‌లో చేపట్టిన రోడ్‌షో విజయవంతం కావడంతో ప్రతిపక్షపార్టీలు బెంబేలెత్తుతున్నాయి. విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి, ఉపఎన్నికల ఇంచార్జి పల్లా రాజేశ్వర్‌రెడ్డి నియోజకవర్గంలో ఎప్పటికప్పుడు పార్టీ శ్రేణులను సమన్వయపరుస్తున్నారు. పదేండ్లపాటు ఎమ్మెల్యేగా ఉన్న ఉత్తమ్ నియోజకవర్గ అభివృద్ధిని ఏమాత్రం పట్టించుకోలేదనే విషయాన్ని పార్టీ శ్రేణులు బలంగా ప్రజల్లోకి తీసుకెళుతున్నాయి. గిరిజన సంక్షేమశాఖమంత్రి సత్యవతి రాథోడ్ ప్రతితండాలో పర్యటిస్తున్నారు. అక్కడి ప్రజలతో మమేకమవుతున్నారు.

### వివిధ పార్టీల నుంచి టీఆర్‌ఎస్‌లో చేరినవారు వీరే..

**హుజూర్‌నగర్:** పట్టణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ చిట్యాల అమర్‌నాథరెడ్డి, బ్లాక్ ప్రెసిడెంట్ గొట్టె రామయ్య, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ అట్లూరి హరిబాబు.

**గరిడేపల్లి:** గరిడేపల్లి, కాల్వపల్లి, కోదండరామాపురం సర్పంచ్‌లు త్రిపురం సీతారామిరెడ్డి, నాగేశ్వరరావు, వెన్న రవీందర్‌రెడ్డి, కుతుబ్‌షాపురం ఎంపీటీసీ ఆకుల రమణ, కాచవారిగూడెం మాజీసర్పంచ్ రామయ్య.

**మఠంపల్లి:** గుర్రంపోడుతండా సర్పంచ్ ముడావత్ పార్వతి, కొత్త దోనబండతండా మాజీ ఎంపీటీసీ అరుణ్‌దేశ్‌పాండే, పెదవీడు మాజీసర్పంచ్ మన్నెం శ్రీనివాస్‌రెడ్డి.

**మేళ్లచెర్వు:** రామాపురం సర్పంచ్ ఎం మల్లికార్జున్‌రావు, మాజీ ఎంపీటీసీ మంగమ్మ.

**నేరేడుచర్ల:** టీడీపీ మండలాధ్యక్షుడు నాగండ్ల శ్రీధర్, మాజీ జెడ్పీటీసీ అన్నపురెడ్డి నారాయణరెడ్డి, నేరేడుచర్ల మాజీ సర్పంచ్ కొణతం సత్యనారాయణరెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు నక్కా రమాదేవి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొణతం ఆదిరెడ్డి, కాంగ్రెస్ కిసాన్‌సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొణతం పెద వెంకటరెడ్డి.

**పాలకవీడు:** మాజీ ఎంపీపీ నాగయ్య, టీడీపీ మండలాధ్యక్షుడు పసుపులేటి సైదులు, ఎల్లాపురం, నాగిరెడ్డిగూడెం, జాన్‌పహాడ్, హన్మంతులగూడెం సర్పంచ్‌లు తీగల లక్ష్మమ్మ, మునగాల మాధవి, రూపావత్ చోరీ, సరితా ఇంద్రారెడ్డి, జాన్‌పహాడ్ మాజీ సర్పంచ్ వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ జిల్లా ప్రధానకార్యదర్శి సింగం మోహన్‌రావు.

**చింతలపాలెం:** గాంధీనగర్‌తండా సర్పంచ్ బాణావత్ అరుణ శ్రీను, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేల్పుల రామకృష్ణ, మాజీ జెడ్పీటీసీ మైలా నాగిరెడ్డి, తమ్మారం సర్పంచ్ గడ్డం అరుణ, మాజీ ఎంపీటీసీ కొడూరి అనంతాచారి, మండల కో ఆప్షన్ సభ్యుడు కామేపల్లి నర్సింహారావు.



ముంబైలోని ఆరే కాలనీలో నరికివేసిన చెట్లను క్రేన్ సహాయంతో తొలగిస్తున్న దృశ్యం.

# 'ఆరే'లో చెట్లు నరకొద్దు

- యథాతథ స్థితిని కొనసాగించండి
- మహారాష్ట్ర సర్కారుకు సుప్రీంకోర్టు ఆదేశాలు
- అవసరమైన చెట్లను ఇప్పటికే నరికేశామన్న ప్రభుత్వం
- 21న తదుపరి విచారణ



**న్యూఢిల్లీ/ ముంబై:** మెట్రో కార్ షెడ్ నిర్మాణం కోసం ముంబైలోని ఆరే కాలనీలో చెట్ల నరికివేత విషయంలో పర్యావరణ ప్రేమికులకు అత్యున్నత న్యాయస్థానం ఊరటనిచ్చింది. ఇకపై ఆ ప్రాంతంలో చెట్లు నరకడానికి వీల్లేదంటూ మహారాష్ట్ర ప్రభుత్వాన్ని సోమవారం ఆదేశించింది. తదుపరి విచారణ చేపట్టబోయే అక్టోబర్ 21వ తేదీ వరకు యథాతథ స్థితిని కొనసాగించాలని స్పష్టం చేసింది. అయితే మెట్రో కార్ షెడ్ నిర్మాణానికి అవసరమైన చెట్లను ఇప్పటికే నరికివేసినట్టు మహారాష్ట్ర ప్రభుత్వం పేర్కొనడం గమనార్హం. ఆరే కాలనీలో చెట్ల నరికివేతపై స్టే ఇవ్వాలని కోరుతూ న్యాయ విద్యార్థి రిశవ్ రంజన్ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్‌కి లేఖ రాశారు. దీన్ని సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించింది. విచారణకు ప్రత్యేక బెంచ్‌ను ఏర్పాటుచేసింది. సోమవారం ఈ వ్యవహారంపై విచారణ జరిపిన ఆ ధర్మాసనం పై విధంగా ఆదేశాలు జారీ చేసింది. ఈ నెల 4న ఆరే కాలనీని అటవీ ప్రాంతంగా గుర్తించడానికి నిరాకరించిన బాంబే హైకోర్టు.. మెట్రో కార్ షెడ్ నిర్మాణం కోసం గ్రీన్ జోన్‌లోని 2,600 చెట్లను నరికివేసేందుకు ముంబై మున్సిపల్ కార్పొరేషన్ అనుమతి ఇవ్వడాన్ని రద్దు చేసేందుకు కూడా నిరాకరించింది. దీంతో శుక్రవారం రాత్రి ముంబై మెట్రో రైల్ కార్పొరేషన్ సిబ్బంది చెట్ల నరికివేతకు సిద్ధం కావడంతో దుమారం రేగింది. చెట్లను నరకొద్దంటూ పర్యావరణ కార్యకర్తలు, స్థానిక కాలనీవాసులు ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో 29 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక కోర్టు బెయిల్ మంజూరు చేయడంతో సోమవారం వారు విడుదలయ్యారు.

### ఆరే అటవీ ప్రాంతమా? కాదా?

మహారాష్ట్ర ప్రభుత్వం, ముంబై పురపాలక సంస్థ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సుప్రీంకోర్టులో వాదనలు వినిపిస్తూ.. కార్ షెడ్ నిర్మాణానికి అవసరమైన 2,141 చెట్లను ఇప్పటికే నరికేశామని, ఇకపై నరకబోమని తెలిపారు. 'దీనిపై మేం నిర్ణయం తీసుకుంటాం. ఇకపై చెట్లను నరకొద్దు. తదుపరి విచారణ చేపట్టే 21వ తేదీ వరకు యథాతథ స్థితిని కొనసాగించండి' అని ధర్మాసనం ఆదేశించింది. ఆరే కాలనీ అటవీ ప్రాంతమా కాదా అన్నదానిపై తాము విచారణ జరుపుతామని, ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్ల వివరాలను తమ ముందు ఉంచాలని అధికారులను ఆదేశించింది.

### విపక్షాలు, పర్యావరణవేత్తల హర్షం

సుప్రీంకోర్టు ఆదేశాలను ఎన్సీపీ నేత సుప్రియా సూలే స్వాగతించారు. అయితే కార్‌షెడ్‌కు అవసరమైన చెట్లను ఇప్పటికే నరికివేయడంపై ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. కోర్టు ఆదేశాలు పర్యావరణ వేత్తలకు నైతిక విజయమని శివసేన వ్యాఖ్యానించింది. సుప్రీం తీర్పుపై స్పందించేందుకు కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి ప్రకాశ్ జవదేకర్ నిరాకరించారు. కోర్టు పరిధిలోని అంశంపై తాను స్పందించదలచుకోలేదని చెప్పారు. అయితే దేశంలో గత నాలుగేండ్లలో 15000 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో అటవీ ప్రాంతం పెరిగిందని పేర్కొన్నారు.

### 2,141 చెట్లను తొలిగించాం

మెట్రో కార్ షెడ్ నిర్మాణం కోసం ఆరే కాలనీలో ఇప్పటికే 2,141 చెట్లను నరికివేశామని ముంబై మెట్రో రైల్ కార్పొరేషన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. సుప్రీంకోర్టు తదుపరి ఉత్తర్వులు వెలువరించేవరకు అక్కడ ఇకపై చెట్లను తొలిగించబోమని పేర్కొంది. చెట్లను తొలిగించిన ప్రాంతంలో నిర్మాణ పనులను మొదలుపెడుతామని వివరించింది.

# టీఆర్‌ఎస్‌తోనే తండాల అభివృద్ధి

- తండాలను పంచాయతీలుగా మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌దే
- గిరిజన సంక్షేమ శాఖమంత్రి సత్యవతిరాథోడ్
- కేటీఆర్ రోడ్‌షోతో ఉత్తమ్‌కు నిద్రపట్టడం లేదు
- మీడియాతో హుజూర్‌నగర్ ఉపఎన్నికల ఇంచార్జి పల్లా రాజేశ్వర్‌రెడ్డి



మేళ్లచెర్వు మండలం హేమ్లాతండాలో మాట్లాడుతున్న మంత్రి సత్యవతి రాథోడ్. చిత్రంలో ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్ , ఉప ఎన్నికల ఇంచార్జి పల్లా రాజేశ్వర్‌రెడ్డి తదితరులు

**హుజూర్‌నగర్, నమస్తేతెలంగాణ, మేళ్లచెర్వు:** టీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే గిరిజన తండాలు పంచాయతీలు మారి అభివృద్ధి బాటలో పయనిస్తున్నాయని గిరిజన, మహిళా శిశుసంక్షేమశాఖమంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. గిరిజనులకు స్వయంపాలన అందించిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని చెప్పారు. హుజూర్‌నగర్ ఉప ఎన్నికల్లో టీఆర్‌ఎస్ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డికి మద్దతుగా సోమవారం మేళ్లచెర్వు మండలంలోని హేమ్లాతండా, కప్పలకుంటతండా, యతిరాజపురంతండా, రామాంజనేయతండాల్లో ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డితో కలిసి ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను కేటాయించి తండాలను అభివృద్ధి చేసేందుకు కృషిచేస్తానన్నారు. గిరిజన సోదరులు టీఆర్‌ఎస్‌ను గెలిపించి సీఎం కేసీఆర్ రుణం తీర్చుకోవాలని కోరారు. మండలంలోని జగ్గుతండాను ప్రత్యేక గ్రామపంచాయతీగా చేసేందుకు కృషిచేస్తానని హామీఇచ్చారు. హేమ్లాతండాలో పలువురు నాయకులు మంత్రి ఆధ్వర్యంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, ఉమ్మడి నల్లగొండ జిల్లా రైతు సమన్వయ సమితి చైర్మన్ రాంచందర్‌నాయక్ పాల్గొన్నారు. అంతకుముందు మంత్రి సత్యవతి టీఆర్‌ఎస్ నాయకులు డాక్టర్ రమణనాయక్‌తో కలిసి చింతలపాలెం మండలం గాంధీనగర్‌తండా, కొత్తగూడెంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

### తెలంగాణ కాంగ్రెస్ నేతలు వెన్నెముకలేనివారు: పల్లా

టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హుజూర్‌నగర్‌లో రోడ్‌షో చేసినప్పటి నుంచి ఉత్తమ్‌కు నిద్రపట్టడం లేదని, ఓడిపోతామన్న భయంతో తలాతోకలేకుండా మాట్లాడుతున్నాడని ఉపఎన్నికల టీఆర్‌ఎస్ ఇంచార్జి పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం హుజూర్‌నగర్‌లో మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ కాంగ్రెస్ నేతలు వెన్నెముకలేనివారని, అభివృద్ధి నిరోధకులని, ఢిల్లీకి సంచులను మోసేవారని, వలసపాలకుల మోచేతి నీళ్లు తాగేవారని విమర్శించారు. టీఆర్‌ఎస్ ప్రవాహాన్ని తట్టుకోలేక ఉత్తమ్ బీజేపీ అధ్యక్షుడు లక్ష్మణ్‌ను బతిమిలాడుకుంటున్నారని అన్నారు. పాలకవీడు మండలంలో ఇరవైమంది సర్పంచ్‌లను టీఆర్‌ఎస్ గెలుచుకున్నదని, మిగిలిన వారు కూడా అభివృద్ధి కోసం టీఆర్‌ఎస్‌లో చేరారన్నారు. సమావేశంలో వరంగల్ మేయర్ గుండా ప్రకాశ్‌రావు తదితరులు పాల్గొన్నారు.



హుజూర్‌నగర్‌లో మీడియాతో మాట్లాడుతున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి

మంగళవారం 8-10-2019
కరీంనగర్
# నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE
నేడు విజయదశమి






## శుభాకాంక్షలు

పాఠకులకు, ప్రకటనకర్తలకు, ఏజెంట్లకు, శ్రేయోభిలాషులకు దసరా పండుగ శుభాకాంక్షలు.

- దీవకొండ దామోదర్‌రావు, సీఎండీ

## సెలవు

దసరా పండుగ సందర్భంగా నేడు (08-10-2019) మా కార్యాలయానికి సెలవు. కావున బుధవారం (09-10-2019) సంచిక వెలువడదు. పునర్దర్శనం గురువారం (10-10-2019).




# ఆర్టీసీ బలోపేతం

### కొత్త నెత్తురు, జవసత్వాలు రావాలి • ఆర్టీసీ పూర్తి ప్రైవేటీకరణ ప్రభుత్వానికి ఇష్టంలేదు

మూడు భాగాలుగా బస్సుల విభజన • ఆర్టీసీ బస్సులు 50%, అద్దె బస్సులు 30%, ప్రైవేటు బస్సులు 20% • కొత్తగా అద్దెకు తీసుకునేవి 9%

ఆర్టీసీ చార్జీలతో సమానంగా ప్రైవేట్ బస్సుచార్జీలు • ప్రజలకు ఇబ్బంది కలుగకుండా చూడటమే ప్రభుత్వ ధ్యేయం: సీఎం కేసీఆర్



సోమవారం ప్రగతిభవన్‌లో ఆర్టీసీపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ . చిత్రంలో మంత్రులు పువ్వాడ అజయ్, వేముల ప్రశాంత్‌రెడ్డి, సీఎస్ ఎస్కే జోషి, ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్ శర్మ, ఉన్నతాధికారులు ఉన్నారు.

- ఇష్టంవచ్చినరీతిలో సమ్మె చేస్తామనటం దురహంకారం
- భవిష్యత్‌లో ఆర్టీసీలో యూనియనిజం ఉండదు
- ప్రభుత్వం ఎవర్నీ డిస్మిస్ చేయలేదు
- విధుల్లోకి రానివారు సెల్ఫ్‌డిస్మిస్ అయినట్టే
- రాయితీ పాసులు కొనసాగుతాయి
- ప్రభుత్వ చర్యలను ప్రశంసిస్తున్న ప్రజలు
- ఆర్టీసీపై సమీక్షలో సీఎం కే చంద్రశేఖర్‌రావు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

ఆర్టీసీని పూర్తిగా ప్రైవేటీకరించడం ప్రభుత్వానికి ఏమాత్రం ఇష్టంలేదని, ఆర్టీసీ ఉండి తీరాల్సిందేనని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు స్పష్టం చేశారు. ప్రజలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అసౌకర్యం కలుగకుండా చూడటమే ప్రభుత్వ ధ్యేయమని చెప్పారు. తదనుగుణంగానే ఆర్టీసీని పటిష్ఠపర్చేందుకు అనేకచర్యలు చేపడుతున్నామని తెలిపారు. మొత్తం ఆర్టీసీని ప్రైవేట్‌పరం చేయడం వివేకమైన చర్యకాదనికూడా అన్నారు. క్రమశిక్షణను తు.చ. తప్పకుండా అమలుచేసి, ఆర్టీసీని లాభాలబాటలో నడిపించడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రవాణాశాఖ ముఖ్యకార్యదర్శి సునిల్‌శర్మ అధ్యక్షతన ఏర్పాటైన కమిటీ ఆర్టీసీకి సంబంధించిన ప్రతిపాదనలను ముఖ్యమంత్రికి అందజేసింది. వాటిపై సోమవారం ప్రగతిభవన్‌లో సీఎం అధ్యక్షతన జరిగిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో కూలంకషంగా చర్చించారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ మాట్లాడుతూ.. 'ప్రస్తుతం ఆర్టీసీలో 10,400 బస్సులున్నాయి. వీటిని భవిష్యత్‌లో మూడురకాలుగా విభజించి నడపాలి. 50% బస్సులు అంటే 5200 పూర్తిగా ఆర్టీసీకి

మిగతా 4వ పేజీలో

# ఆగని ప్రయాణం

మూడోరోజూ సాఫీగాసాగిన రాకపోకలు • 50 శాతానికిపైగా రోడ్డెక్కిన ఆర్టీసీ బస్సులు

అన్ని బస్టాండ్లలో ప్రయాణికుల రద్దీ • విధుల్లో ఆరువేలకుపైగా తాత్కాలిక సిబ్బంది

ప్రభుత్వ ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో కనిపించని సమ్మె ప్రభావం

7



మహబూబ్‌నగర్‌లో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్న ప్రజలు

# క్యాంపుల పేరిట దందా

### 2013 నుంచి మెడికల్ కిట్లు పక్కదారి

### రోజుకో మలుపు తిరుగుతున్న ఐఎంఎస్ స్కాం

### తాజాగా మరో ముగ్గురి అరెస్ట్



అరెస్టయిన డాక్టర్ చెరుకు అరవింద్‌రెడ్డి, కే రాంరెడ్డి, కే లిఖిత్‌రెడ్డి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఐఎంఎస్ మందుల కుంభకోణంలో మరో కొత్త కోణం వెలుగులోకి వచ్చింది. మొన్నటివరకు ఐఎంఎస్ డైరెక్టర్ దేవికారాణి వర్గం అవినీతి డొంక కదలగా, ఇప్పుడు జేడీ పద్మ అవినీతి బాగోతం బయటపడింది. ఇండెంట్లు, పర్చేజ్ ఆర్డర్ల తప్పుడు పత్రాలను సృష్టించడాన్ని దాటి.. మెడికల్

మిగతా 4వ పేజీలో









epaper.ntnews.com






## అశ్వవాహనంపై తిరుమలేశుడు

**తిరుమల, నమస్తే తెలంగాణ:** తిరుమలలో శ్రీవేంకటేశ్వరస్వామివారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు చివరిదశకు చేరుకున్నాయి. ఎనిమిదోరోజు సోమవారం రాత్రి శ్రీవారు కల్కి అవతారంలో అశ్వవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఈ వాహనంపై స్వామివారు క్షత్రియ లక్షణాలు కలిగిన తలపాగా, దూసిన కరవాలంతో, విశేష తిరు ఆభరణాలతో అలంకారమై ఊరేగారు. ఉదయం ఉభయ దేవేరులతో శ్రీమలయప్పస్వామివారు మహారథంపై అధిష్ఠించి ఊరేగారు. ఆ అపురూప ఘట్టాన్ని తిలకించేందుకు వేల మంది భక్తులు తరలివచ్చారు. అడుగడుగునా స్వామివారికి నీరాజనాలు సమర్పించారు. కాగా, తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతున్నది. సోమవారం రాత్రి కంపార్ట్‌మెంట్లు నిండి క్యూలైన్లు వెలుపలివరకు ఉన్నాయి. శ్రీవారి సర్వదర్శనానికి 24 గంటల సమయం, ప్రత్యేక, ప్రవేశ దర్శనానికి 3 గంటల సమయం పడుతున్నది.

## ప్రగతిపథంలో జయశంకర్ భూపాలపల్లి

- వేగంగా అభివృద్ధి చెందుతున్న జిల్లాల్లో మూడోర్యాంక్
- జాబితాను ప్రకటించిన నీతి ఆయోగ్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** దేశంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు అరుదైన ఘనత దక్కింది. తాజాగా నీతిఆయోగ్ విడుదలచేసిన అభివృద్ధి చెందుతున్న జిల్లాల ర్యాంకుల్లో మూడోస్థానాన్ని సొంతం చేసుకున్నది. 2019 ఆగస్టులో ఆరోగ్యం, పోషణ తదితర విభాగాల్లో అత్యధికస్కోరు సాధించింది. మొదటి, రెండు ర్యాంకుల్లో జార్ఖండ్, సిక్కిం రాష్ట్రాల జిల్లాలు ఉన్నాయి. దేశంలో 115 దాకా వెనుకబడిన జిల్లాలుండగా.. వాటిని ఆరోగ్యం, విద్య, వ్యవసాయం, బ్యాంకింగ్ వంటి విభాగాల్లో అభివృద్ధిపరిచేందుకు కేంద్రం సంకల్పించింది. 49 ప్రమాణాల ప్రకారం పురోగతి సాధించే జిల్లాలకు నీతిఆయోగ్ క్రమం తప్పకుండా ర్యాంకులను ప్రకటిస్తున్నది. రాష్ట్రం ఏర్పడక ముందు వెనుకబడిన ప్రాంతంగా ఉన్న జయశంకర్ భూపాలపల్లిని.. అన్ని విభాగాల్లో అభివృద్ధిచేసేందుకు ప్రభుత్వం ప్రత్యేకదృష్టి సారించినందున జాతీయస్థాయిలో మూడోర్యాంకును సొంతం చేసుకోగలిగామని జిల్లా కలెక్టర్ వాసం వెంకటేశ్వర్లు తెలిపారు.



# ఆర్టీసీ బలోపేతం



సోమవారం ప్రగతిభవన్‌లో ఆర్టీసీపై సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్

మూడోపేజీ తరువాయి...

చెందినవై, ఆర్టీసీ యాజమాన్యంలోనే ఉంటాయి. 30%.. అంటే 3100 బస్సులు అద్దె రూపేణా తీసుకుని వాటిని కూడా పూర్తిగా ఆర్టీసీ పర్యవేక్షణలోనే, ఆర్టీసీ పాలన కిందే నడుపుతారు. వాటిని ఆర్టీసీ డిపోల్లోనే ఉంచుతారు. మరో 20%.. అంటే 2100 బస్సులు పూర్తిగా ప్రైవేట్‌వి. ప్రైవేట్ స్టేజ్‌క్యారేజ్‌విగా అనుమతి ఇస్తారు. ఈ బస్సులు పల్లెవెలుగు సర్వీసు కూడా నడపాలి. అద్దెకు తీసుకున్న బస్సులు, స్టేజ్‌క్యారేజ్ బస్సులు ఇతర రూట్లతోపాటు నగరంలోనూ నడపాలి' అని చెప్పారు. 'ఆర్టీసీ చార్జీలు, ప్రైవేట్ బస్సుల చార్జీలు సమానంగా, ఆర్టీసీ నియంత్రణలోనే ఉంటాయి. ఆర్టీసీ చార్జీలను పెంచినప్పుడే వాళ్ల చార్జీలు కూడా పెంచాలి. స్వల్పంగా పెంచడం కూడా ఆర్టీసీ కమిటీ నిర్ణయం మేరకు, అవసరమని భావించినప్పుడు చేయాలి. ఇప్పటికే 21% అద్దె బస్సులను ఆర్టీసీ నడుపుతున్నది. అంటే, ఇక అద్దెకు తీసుకోవాల్సింది అదనంగా మరో 9% మాత్రమే. అదనంగా 9% అద్దె బస్సులను పెంచడం అంటే ఆర్టీసీకి కొత్త బస్సులు వచ్చినట్లే' అని సీఎం తెలిపారు.

### యూనియన్ల అతి ప్రవర్తనే..

ఈ చర్యలన్నీ చేపట్టడానికి ప్రధానకారణం ఆర్టీసీ యూనియన్ల అతిప్రవర్తనేనని సీఎం కేసీఆర్ అన్నారు. 'తాము ఎక్కిన చెట్టుకొమ్మను తామే నరుక్కున్నారు. గత 40 ఏండ్లుగా జరుగుతున్న దాష్టీకంవల్ల ఇదంతా చేయాల్సి వచ్చింది. టీడీపీ, కాంగ్రెస్ ప్రభుత్వాల్లో సమ్మె చేసిన ఆర్టీసీ యూనియన్లు, టీఆర్‌ఎస్ ప్రభుత్వంలో కూడా సమ్మెకు దిగాయి. ప్రభుత్వం ఏది ఉన్నా వీళ్ల అతిప్రవర్తనలో మార్పులేదు. పకడ్బందీ నిర్ణయాలు తీసుకునే స్వేచ్ఛ మేనేజ్‌మెంట్‌కు ఈ యూనియన్లు ఇవ్వవు. ఏదేమైనా ప్రజలకు ఇబ్బంది కలుగకుండా చూడటమే ప్రభుత్వ ధ్యేయం. పండుగలకు, విద్యార్థుల పరీక్షలకు ఎవరూ కష్టపడకూడదని ప్రభుత్వ ఉద్దేశం. సమ్మె ఉధృతం చేస్తామనటం హాస్యాస్పదం' అని చెప్పారు.

### సెల్ఫ్ డిస్మిస్..

ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం దృష్టిలో ఆర్టీసీ సిబ్బంది 1200 మాత్రమేనని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. 'మిగతావారిని డిస్మిస్ చేయాల్సిన అవసరం ప్రభుత్వానికి లేనేలేదు. ఎవరూ ఎవర్నీ డిస్మిస్ చేయలేదు. వాళ్ళంతట వాళ్లే తొలగిపోయారు. గడువు లోపల విధుల్లో చేరకపోవటంతో వాళ్లు సెల్ఫ్ డిస్మిస్ అయినట్లే. ప్రభుత్వ, ఆర్టీసీ యాజమాన్య విజ్ఞప్తులకు వారు స్పందించలేదు. తొలగిపోయిన వారు డిపోల దగ్గర, బస్‌స్టేషన్ల దగ్గర గొడవ చేయకుండా ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటుచేయాలని డీజీపీని ఆదేశించాను. విధుల్లో ఉన్న 1200 మంది తప్ప ఎవరు వచ్చినా, దురుసుగా ప్రవర్తించినా డీజీపీ సరైన చర్యలు తీసుకుంటారు' అని ముఖ్యమంత్రి చెప్పారు.

### రాయితీ పాస్‌లు కొనసాగుతాయి

ప్రస్తుతం రాష్ట్రంలో విద్యార్థులు, దివ్యాంగులు, స్వాతంత్ర్య సమరయోధులు, పాత్రికేయులు, పోలీసు అమరవీరుల కుటుంబాలకు చెందినవారు, ఉద్యోగులు, తదితరుల సబ్సిడీ బస్‌పాసులు ఇక ముందు కూడా కొనసాగుతాయని సీఎం కేసీఆర్ స్పష్టంచేశారు. ఇవన్నీ ఆర్టీసీ నియంత్రణలోనే ఉంటాయని, సబ్సిడీ మొత్తాన్ని ప్రభుత్వం భరిస్తుందని తెలిపారు. దానికి కావాల్సిన నిధులు బడ్జెట్లో కేటాయిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో మంత్రులు పువ్వాడ అజయ్‌కుమార్, వేముల ప్రశాంత్‌రెడ్డి, ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్‌శర్మ, ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్, డీజీపీ మహేందర్‌రెడ్డి, రవాణాశాఖ ముఖ్య కార్యదర్శి సునిల్‌శర్మ, సీఎంవో ముఖ్య కార్యదర్శి ఎస్ నర్సింగ్‌రావు, రవాణాశాఖ కమిషనర్ సందీప్‌సుల్తానియా, అదనపు డీజీపీ జితేంద్ర, ఆర్టీసీ, రవాణాశాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### సమావేశంలో చర్చించిన, నిర్ణయం తీసుకున్న మరికొన్ని అంశాలు:

- దురహంకారపూరితంగా సమ్మెకు పోవటానికి కారణం యూనియన్ల మోనోపలీ భావనే.
- ఇష్టం వచ్చినరీతిలో సమ్మె చేస్తామనటం దురహంకారం.
- ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న ఏ సంస్థలో ఏది జరిగినా అది ప్రభుత్వ అనుమతితోనే జరగాలి.
- విధుల్లోకి రానివారిని ఆర్టీసీ సిబ్బందిగా పరిగణించనప్పుడు ఇక యూనియన్ల ప్రసక్తేలేదు. యూనియన్లు వాటి అస్తిత్వాన్ని కోల్పోయాయి.
- భవిష్యత్‌లో ఇక ఆర్టీసీలో యూనియనిజం ఉండదు.
- భవిష్యత్‌లో ఆర్టీసీ అంటే ఒక అద్భుతమైన సంస్థగా రూపుదిద్దుకోవటమే.
- ఆర్టీసీ భవిష్యత్‌లో లాభాలకు వచ్చి, కార్మికులకు (కొత్తగా చేరేవారికి) బోనస్ ఇచ్చే పరిస్థితికి రావాలి.
- సంస్థ లాభాల్లో నడవాలి.. నష్టాల్లోకి పోకూడదు.
- ఆర్టీసీకి కొత్త నెత్తురు, జవసత్వాలు రావాలి.
- రవాణారంగంలో రోజురోజుకు పెరుగుతున్న పోటీ నేపథ్యంలో మెరుగైన ప్రజారవాణా వ్యవస్థగా దేశంలోనే పేరుగాంచిన రాష్ట్ర ఆర్టీసీ.. తన సామాజిక బాధ్యతను నిర్వర్తిస్తూనే ఆర్థిక పరిపుష్టిని సాధించుకుని లాభాల బాటలో పయనించటానికి తీసుకోవాల్సిన చర్యలపై సూక్ష్మ దృష్టి సారించాల్సిన అవసరమున్నది.
- ఆర్టీసీ నిరంతరం చైతన్యంతో ప్రజలకు సేవలు అందించే సంస్థ.
- పండుగలు, పరీక్షలు వంటి కీలక సమయాల్లో కార్మికసంఘాలు సమ్మెలకు పిలుపునిచ్చి ప్రజలకు తీవ్ర ఇబ్బందులను కలిగించే పరిస్థితులు కొనసాగుతున్నాయి. వాటిని రూపుమాపి, ప్రజలకు ఇబ్బందులు రాకుండా చూసుకోవాలి.
- ఆర్టీసీ ప్రక్షాళనకు ప్రభుత్వం ఇప్పుడు తీసుకుంటున్న చర్యలను ప్రజలు ప్రశంసిస్తున్నారు.

## అమెరికాలో హైదరాబాద్ మహిళ ఆత్మహత్య!

- భర్త వేధింపులే కారణమని పోలీసులకు మృతురాలి తండ్రి ఫిర్యాదు





గజం వనిత (ఫైల్) వనిత మృతదేహం

**మన్సూరాబాద్:** హైదరాబాద్ నగరానికి చెందిన ఒక మహిళ అమెరికాలో అనుమానాస్పదస్థితిలో మృతిచెందింది. భర్త వేధింపుల కారణంగానే చనిపోయిందని మృతురాలి కుటుంబీకులు ఆరోపిస్తున్నారు. మృతదేహాన్ని నగరానికి తీసుకువచ్చేందుకు సహకరించాలని, అలాగే తన కూతురు మృతికి కారకుడైన అల్లుడిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని మృతురాలి తండ్రి ఎల్బీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మృతురాలి తండ్రి కథనం ప్రకారం.. ఎల్బీనగర్‌లో నివసించే గజం కృష్ణయ్య, పారిజాత దంపతుల రెండో కుమార్తె వనిత (30) వివాహం కొత్తపేటకు చెందిన రాచకొండ లక్ష్మీనారాయణ రెండో కుమారుడు శివకుమార్‌తో 15 ఏండ్ల క్రితం జరిగింది. వీరికి కూతురు సింధూ (13), కుమారుడు సిద్ధు (10) ఉన్నారు. శివకుమార్ భార్య, పిల్లలతో కలిసి అమెరికాలోని నార్త్ కరోలినాలో ఉంటున్నాడు. ఆరేండ్లుగా భార్యను వేధింపులకు గురిచేస్తున్నాడు. నాలుగేండ్ల క్రితం ఇండియాలో ఉండిపోదాంఅని భార్య, పిల్లలతో హైదరాబాద్ వచ్చిన శివకుమార్.. పిల్లలను తన తల్లిదండ్రుల వద్ద ఉంచాడు. ఉద్యోగం సెటిల్ చేసుకొని వస్తానంటూ ఎల్బీనగర్‌లో భార్యను వదిలి అమెరికా వెళ్లిపోయాడు. తర్వాత 15 రోజులకు వచ్చి ఇద్దరు పిల్లలను అమెరికాకు తీసుకెళ్లాడు. అప్పటి నుంచి భార్యకు ఫోన్ చేయడంగానీ, ఆమెను అమెరికాకు తీసుకెళ్లే ప్రయత్నంగానీ జరుగలేదు. దాంతో గజం కృష్ణయ్య విషయాన్ని కులపెద్దల దృష్టికి తీసుకెళ్లాడు. ఇరుపక్షాలు కూర్చొని మాట్లాడిన అనంతరం నాలుగునెలల క్రితం భార్యకు వీసా పంపాడు. పెద్దలు నచ్చజెప్పడంతో వనిత అమెరికా వెళ్లింది. తిరిగి వేధింపులకు గురిచేస్తున్నాడని వనిత తన తల్లిదండ్రులకు తెలిపింది. నరకం చూపిస్తున్నాడని, ఇక్కడ ఉండలేనంటూ రోదిస్తూ తల్లిదండ్రులకు చెప్పింది. ఈ నెల 4న సాయంత్రం భర్త, పిల్లలు ఇంట్లో లేని సమయంలో తలకు ప్లాస్టిక్ కవర్ చుట్టుకొని ఆత్మహత్యకు పాల్పడింది. శుక్రవారం అల్లుడి బంధువుల నుంచి సమాచారం అందడంతో.. కూతురు మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ గజం కృష్ణయ్య ఆదివారం ఎల్బీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



సోమవారం గన్‌పార్క్ వద్ద ఆర్టీసీ జేఏసీ కన్వీనర్ అశ్వత్థామరెడ్డిని అరెస్టు చేసి తీసుకెళ్తున్నపోలీసులు

## మా సమ్మె న్యాయబద్ధమే

ఆర్టీసీ జేఏసీ కన్వీనర్ అశ్వత్థామరెడ్డి

ఆర్టీసీ నేతల అరెస్ట్.. విడుదల

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తాము చేస్తున్న సమ్మె న్యాయసమ్మతమేనని ఆర్టీసీ జేఏసీ కన్వీనర్ అశ్వత్థామరెడ్డి చెప్పారు. ఆర్టీసీలో కొత్త నియామకాలు చేపడుతామనటం సమంజసం కాదన్నారు. సోమవారం ఉదయం గన్‌పార్క్‌లోని అమరవీరుల స్థూపానికి నివాళులర్పించడానికి చేరుకున్న ఆర్టీసీ జేఏసీ నేతలను.. అనుమతి లేకపోవటంతో పోలీసులు అడ్డుకొన్నారు. అసెంబ్లీ చుట్టుపక్కల నాలుగు కిలోమీటర్ల పరిధిలో ర్యాలీలు, నిరసనలు నిర్వహించడంపై నిషేధాజ్ఞలు ఉన్నాయి. ఈ విషయాన్ని పోలీసులు జేఏసీ నాయకులకు తెలిపినా.. వారు దురుసుగా ప్రవర్తించడంతో అదుపులోకి తీసుకొని వారిని సమీప పోలీస్‌స్టేషన్లకు తరలించారు. సాయంత్రం సొంత పూచీకత్తుపై వదిలివేశారు. నిబంధనలకు విరుద్ధంగా, అనుమతులు తీసుకోకుండా ఆర్టీసీ ఉద్యోగులు అసెంబ్లీకి ఎదురుగా ఉన్న గన్‌పార్కుకు చేరుకోవాలనే యోచనలో ఉండగా తప్పనిసరి పరిస్థితిలో అరెస్టులు చేయవలసి వచ్చిందని ఏసీపీ వేణుగోపాలచారి చెప్పారు. విడుదల అనంతరం అశ్వత్థామరెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఆర్టీసీని ప్రభుత్వం ఆదుకోవాలని, కార్మికులకు రావాల్సిన బకాయిలను సకాలంలో చెల్లించాలని కోరారు. భవిష్యత్ కార్యాచరణను బుధవారం ప్రకటిస్తామని తెలిపారు.

## రవిప్రకాశ్‌పై సీబీఐ దర్యాప్తు జరిపించాలి

- పీఎంఎల్‌ఏ, ఫెమా నిబంధనలకు ఆయన పాతరేశారు
- వైఎస్సార్సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి ఫిర్యాదు
- ఆధారాలతో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** టీవీ 9 మాజీ సీఈవో రవిప్రకాశ్‌పై సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దర్యాప్తునకు ఆదేశించాలని కోరుతూ వైఎస్సార్సీపీ పార్లమెంటరీ పార్టీ నేత వీ విజయసాయిరెడ్డి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాశారు. మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ), విదేశీ మారకద్రవ్య నిర్వహణ చట్టం (ఫెమా), ఆదాయం పన్ను చట్టం (ఐటీ యాక్ట్)తోపాటు రిజర్వుబ్యాంకు నిబంధనల ఉల్లంఘనల వ్యవహారంలో రవిప్రకాశ్‌పై దర్యాప్తు జరిపించాలని ఆయన తన లేఖలో కోరారు. ప్రభుత్వానికి పెద్దమొత్తంలో పన్నులు ఎగ్గొటిన మాంసం ఎగుమతిదారుడు మొయిన్ ఖురేషీ వ్యవహారంలో ఇప్పటికే సీబీఐ, ఈడీ విచారణను ఎదుర్కొంటున్న సానా సతీశ్‌బాబుతో రవిప్రకాశ్‌కు సన్నిహిత సంబంధాలున్నాయని, ఎలక్ట్రానిక్ మీడియా వృత్తిని దుర్వినియోగంచేసి బ్లాక్‌మెయిలింగ్ ద్వారా రవిప్రకాశ్ పలువురి నుంచి పెద్దమొత్తంలో డబ్బు వసూలుచేయడంతోపాటు ఆ సొమ్మును హవాలా మార్గంలో విదేశాలకు తరలించి అక్కడ పెట్టుబడులు పెట్టారని ఎంపీ విజయసాయిరెడ్డి ఆరోపించారు. రవిప్రకాశ్‌కు అనేక దేశాల్లో బ్యాంకు ఖాతాలు ఉన్నాయని, ఉగాండాలోని బ్యాంక్ ఆఫ్ బరోడాలో కార్పొరేట్ అకౌంట్‌ను కలిగివున్న రవిప్రకాశ్‌కు.. మీడియా ఎన్‌ఎక్స్‌టీ లిమిటెడ్ చైర్మన్‌గా జాంబియాలోని ఇండో జాంబియా బ్యాంక్ లిమిటెడ్‌లో మరో ఖాతా ఉన్నదని, మీడియా ఎన్‌ఎక్స్‌టీ లిమిటెడ్ డైరెక్టర్‌గా రవిప్రకాశ్ భార్య దేవికకు కూడా ఈ బ్యాంకులో అకౌంట్ ఉన్నప్పటికీ ఆ వివరాలను భారత ప్రభుత్వానికి తెలుపలేదని అన్నారు. 2009లో రవిప్రకాశ్ ఉగాండ రాజధాని కంపాలా సిటీకేబుల్‌లో షేర్లు కొనుగోలు చేశారని, అదే సంవత్సరం నవంబర్ 27న ఆయనకు ఆ షేర్లు బదిలీ అయ్యాయని, అలాగే రవిప్రకాశ్ 2011 అక్టోబర్ 5న అమెరికాలోని మాయా విజన్ ఎల్‌ఎల్‌సీలో కొనుగోలుచేసిన 15 వేల షేర్ల వివరాలను కూడా ప్రభుత్వానికి తెలియజేయలేదని పేర్కొన్నారు. రవిప్రకాశ్ డైరెక్టర్‌గా ఉన్న ఐకాస్ట్ ఇంటర్నేషనల్ సంస్థ పీఎంఎల్‌ఏ, ఫెమా, ఐటీ యాక్ట్, ఆర్బీఐ నిబంధనలను ఉల్లంఘించి అమెరికాలోని వైటీఈఎల్ సంస్థతో ఒప్పందాన్ని కుదుర్చుకోవడంతోపాటు అందులో 200 కోట్ల డాలర్లు పెట్టుబడులు పెట్టాలని నిర్ణయించారని, ఆ సమాచారాన్ని కూడా ప్రభుత్వానికి ఇవ్వలేదని తెలిపారు. సింబా మీడియా కెన్యా లిమిటెడ్‌లో రవిప్రకాశ్ వ్యక్తిగతంగా, సిటీకేబుల్ ద్వారా షేర్లు కొనుగోలు చేసినప్పటికీ ఐటీ రిటర్నుల్లో ఆ వివరాలను పొందుపర్చలేదని, అనేక చట్టాలను, నిబంధనలను ఉల్లంఘించిన రవిప్రకాశ్‌పై సీబీఐ, ఈడీతో దర్యాప్తు జరిపిస్తే మరిన్ని విషయాలు వెలుగులోకి వస్తాయని విజయసాయిరెడ్డి పేర్కొంటూ.. తన ఆరోపణలకు సంబంధించిన ఆధారాలను సుప్రీంకోర్టు జడ్జికి రాసిన లేఖలో పొందుపర్చారు.

# ఆర్టీసీకి నష్టాలే ఎందుకు!

- గుదిబండగా అధిక సిబ్బంది
- అధికారులకు లక్షల్లో జీతాలు
- దిద్దుబాటు చర్యలు తీసుకోని గత ప్రభుత్వాలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మూడు జోన్లు.. 11 రీజియన్లు.. 97 డిపోలు.. 364 బస్‌స్టేషన్లు.. 10,460 (2,140 అద్దె) బస్సులు.. 50,317 మంది ఉద్యోగులు, కార్మికులు.. రోజుకు కోటిమంది ప్రయాణికులు.. కోట్లల్లో ఆదాయం.. టీఎస్‌ఆర్టీసీ స్వరూపమిది. రోజుకు కోట్లలో ఆదాయం వస్తున్నా.. ఏడాదికి రూ. 900 కోట్ల అప్పుల్లో కూరుకుపోతున్నదెందుకు? ఈ నష్టాలకు బాధ్యులెవరు? ఆర్టీసీ స్వయం కృపారాధం.. గత ప్రభుత్వాలు అనుసరించిన తీరు ప్రధాన కారణాలనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతున్నది. నష్టాల నుంచి బయటపడటానికి ఆర్టీసీ యాజమాన్యం ప్రభుత్వంవైపు చూసే ధోరణి కూడా ఈ స్థితికి దారితీసిందని పరిశీలకులు పేర్కొంటున్నారు. నష్టాలకు కారణాలను అన్వేషించకపోవడం, లాభాలబాట పట్టించడానికి చర్యలు తీసుకోలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. యాజమాన్యం పకడ్బందీ చర్యలు చేపట్టకపోవడంతో కిలోమీటరుకు రూ.12 నుంచి రూ.16 వరకు నష్టపోయే స్థితి వచ్చిందని చెప్తున్నారు.

### భారంగా మారిన అధిక సిబ్బంది

ఆర్టీసీ నష్టాలకు కార్మికులకు ఇచ్చే వేతనాలు, పెరిగిన డీజిల్ ధరలు, సబ్సిడీలే కారణమని ఆర్టీసీ యాజమాన్యం పేర్కొంటున్నది. కర్ణాటక ఆర్టీసీలో స్టాఫ్ రేషియో ఒక బస్సుకు 4.73 % ఉంటే, టీఎస్‌ఆర్టీసీలో 5.3%గా ఉన్నది. ప్రైవేటు బస్సు ఆపరేటర్లలో ఈ రేషియో 2.7% మాత్రమే. సిబ్బందిని తగ్గించే క్రమంలో ఎక్స్‌ప్రెస్‌లు, డీలక్స్‌లు, సూపర్ లగ్జరీలు, ఏసీ, గరుడ తదితర బస్సులకు కండక్టర్లను తీసేసింది. ఈ బస్సుల్లో డ్రైవర్లే కండక్టర్ విధులు కూడా నిర్వర్తిస్తున్నారు. రాష్ట్రంలో దాదాపు 3 వేల బస్సులకు కండక్టర్లు లేరు. కొన్నిచోట్ల కౌంటర్లలోనే టికెట్లు ఇస్తున్నారు. ఇలా కండక్టర్‌రహిత వ్యవస్థను ఆర్టీసీ కొన్నేండ్లుగా నిర్వహిస్తున్నది. గ్రామీణప్రాంతాల్లో తిరిగే బస్సులతోపాటు, సిటీబస్సుల్లోనే కండక్టర్లు ఉంటారు. అలాంటప్పుడు ఒక బస్సుకు 5.3% మంది సిబ్బంది ఎందుకు? అనే అనుమానాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ఒక బస్సును షిఫ్టులవారీగా తిప్పినా ఇద్దరు డ్రైవర్లు ఉంటారు.. కానీ, ఇక్కడ 5.3% సిబ్బంది ఉన్నారంటే డ్రైవర్లు, కండక్టర్ల కంటే ఇతర సిబ్బందే అధికంగా ఉన్నారని తెలుస్తున్నది.

### ప్రైవేట్ బస్సుల ఆపరేటర్లకు లాభాలు

ప్రైవేట్ ఆపరేటర్లు టికెట్ల రేట్లు పెంచకుండానే లాభాలు గడిస్తున్నారు. ఒకబస్సు ఉన్న ఆపరేటర్ ఏడాది తిరిగే వరకు మరో బస్సు కొనే ప్రయత్నాలు చేస్తున్నాడు. కానీ, నిత్యం రద్దీతో తిరిగే ఆర్టీసీ ఒక్కకొత్త బస్సు కొనాలన్నా ఆపసోపాలు పడాల్సి వస్తున్నది. బస్సులు నడిపే డ్రైవర్లు, కండక్టర్లు మినహా ఇతర అధికారులు, సిబ్బంది ఖర్చే అదనంగా ఉంటుందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆర్టీసీలో వివిధ హోదాల్లో 280 మంది అధికారులు, దాదాపు 7 వేల మంది అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ ఉన్నట్టు తెలిసింది. వీరు కాకుండా దాదాపు మరో ఐదారువేల మంది కండక్టర్లు, డ్రైవర్లను ఇతర పనులకు వినియోగిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలా 10 వేలకు పైగా బస్సులు నడిపే, గ్యారేజీలు నిర్వహించే పనికి అవసరమయ్యే సిబ్బంది కేవలం అడ్మినిస్ట్రేషన్ విభాగంలో వృథాగా ఉన్నట్టు సమాచారం.

### కార్మికులకు వేలల్లో.. అధికారులకు లక్షల్లో...

ఆర్టీసీలో 280 మంది అధికారుల వేతనాలు అత్యధికంగా ఉన్నాయని తెలుస్తున్నది. కొంతమంది రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి వేతనం కంటే అధికంగా పొందుతున్నట్టు సమాచారం. ఆర్టీసీలో కార్మికులకు వేతనాలు వేలల్లో ఉంటే.. అధికారులు మాత్రం లక్షల్లో పొందుతున్నారు. పైగా అన్నిరకాల అలవెన్సులు కూడా కలిపితే భారీఎత్తున తీసుకుంటున్నట్టు చెపుతున్నారు. పైగా అధికారులు తమ దర్పం కోసం సిబ్బందిని అధికంగా వినియోగిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కొంతమంది వాహనాలను అడ్డగోలుగా వాడుతున్నారని సమాచారం. ఇలాంటివన్నీ ఆర్టీసీకి గుదిబండగా మారాయన్న వాదన వినిపిస్తున్నది. సిబ్బంది వృథాను అరికడితే ఆర్టీసీని నష్టాల నుంచి గట్టెక్కించవచ్చని నిపుణులు పేర్కొంటున్నారు.

### పట్టించుకోని పాత ప్రభుత్వాలు

ఉమ్మడి రాష్ట్రంలో ప్రభుత్వాలు ఏనాడూ ఆర్టీసీని పట్టించుకున్న దాఖలాలు లేవు. సమస్యలను గాలికొదిలేసి కార్మికుల గురించి కూడా పట్టించుకోలేదు. ప్రజారవాణావ్యవస్థను బలోపేతంచేసే చర్యలు చేపట్టలేదు. ఇలా గత పాలకులు అనుసరించిన పద్ధతులు కూడా ఆర్టీసీ తీవ్ర నష్టాలు చవి చూడటానికి కారణమైందన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది.

### ఆర్టీసీలో ప్రయాణించేది సామాన్యులే..

ఆర్టీసీ బస్సుల్లో సామాన్యులే ఎక్కువగా ప్రయాణిస్తుంటారు. నాన్ ఏసీ బస్సుల్లో 24.15 % మంది ప్రయాణిస్తుంటే.. గరుడ ప్లస్, రాజధాని, వజ్ర బస్సుల్లో 3.19 శాతం మంది మాత్రమే వెళ్తుంటారు. 9,377 గ్రామాలకు పల్లెవెలుగు బస్సులను నడుపుతున్నది. ఆక్యుపెన్సీ రేషియో 77 ఉన్నట్టు లెక్కలే చెప్తున్నాయి. ఆక్యుపెన్సీ రేషియో అద్భుతంగా ఉన్నా నష్టాలు రావడం అంటే.. యాజమాన్యం అనుసరిస్తున్న తప్పుడు విధానాలేనని చెప్తున్నారు.

## క్యాంపుల పేరిట దందా

మూడోపేజీ తరువాయి...

క్యాంపుల పేరిట ఖరీదైన మెడికల్ కిట్లను పక్కదారి పట్టించి, కోట్ల రూపాయలు కొల్లగొట్టిన విషయం వెలుగుచూసింది. దీనికి సంబంధించి ముగ్గురు నిందితులను సోమవారం అరెస్ట్ చేసినట్టు ఏసీబీ అధికారులు తెలిపారు. వెంకటేశ్వర హెల్త్‌కేర్ ఎండీ డాక్టర్ చెరుకు అరవింద్‌రెడ్డితోపాటు కే రాంరెడ్డి, కే లిఖిత్‌రెడ్డిని అరెస్టు చేశారు. దీంతో అరెస్టుల సంఖ్య 13కు చేరింది. 2013 నుంచి ఈ విధంగా పద్మ, అరవింద్‌రెడ్డి కలిసి ఈ తరహా అక్రమాలకు పాల్పడుతున్నట్టు ఏసీబీ గుర్తించింది. భూపాలపల్లి జిల్లా నందిగామకు చెందిన అరవింద్‌రెడ్డి ఓ ఔషధ తయారీ సంస్థలోని కార్మికులకు ఈఎస్‌ఐ ద్వారా వైద్య సేవలందించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ క్రమంలోనే ఐఎంఎస్ ఉన్నతాధికారులతో పరిచయాలు ఏర్పడ్డాయి. కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు సరఫరా చేసినట్టు రికార్డులు సృష్టించి, దోపిడీకి పథకం రచించారు. వీరికోసమని ఒక్కొక్కటి రూ.18వేల వరకు ఉండే వివిధ రకాల పరీక్షల కిట్లతోపాటు క్రేప్ బ్యాండేజీలు, మోకాలి ప్యాడ్లను తెప్పించారు. వాటిని దారి మళ్లించి సొమ్ము చేసుకున్నారు. ఈ వ్యవహారంలో ఏ అధికారి పాత్ర ఎంత.. ఎంత మొత్తం దారి మళ్లించారనే విషయాలను తేల్చే పనిలో ఏసీబీ అధికారులు నిమగ్నమయ్యారు.

### క్యాంపుల పేరిట రూ.కోట్లు కాజేశారు

జాయింట్ డైరెక్టర్ పద్మ డిస్పెన్సరీలకు పంపిణీచేయాల్సిన మెడికల్ కిట్లను అరవింద్‌రెడ్డి సహకారంతో ప్రైవేట్ దవాఖానలకు విక్రయించి సొమ్ము చేసుకున్నారు. దీన్ని సరిచేసేందుకు సేవ నెపంతో దూలపల్లి, బాలానగర్, చింతల్ ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించడం, అక్కడ హెపటైటిస్, ఎయిడ్స్ తదితర విలువైన మెడికల్ కిట్లను రోగులకు పంపిణీ చేసినట్టు రికార్డులు సృష్టించారు. 2013 నుంచి జరుగుతున్న ఈ కుంభకోణంలో రూ.కోట్లు సంపాదించినట్టు తెలుస్తున్నది. ఇలా సంపాదించిన డబ్బులతో ఇద్దరూ కలిసి బంధువుల పేరిట ఉమ్మడి ఆస్తులను కొనుగోలు చేసినట్టు సమాచారం. వాటితో కూడా దందాలుచేస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి.

# మహిళా ప్రయాణికులకు మరింత భద్రత

పోలీస్ యాప్‌లతో క్యాబ్‌ల అనుసంధానం: డీజీపీ మహేందర్‌రెడ్డి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

హైదరాబాద్‌లో, రాష్ట్ర వ్యాప్తంగా క్యాబ్‌లలో ప్రయాణించే.. ప్రత్యేకించి మహిళల భద్రత కోసం రాష్ట్ర డీజీపీ మహేందర్‌రెడ్డి కొత్త యాప్‌ను విడుదలచేశారు. పోలీస్ యాప్‌లు, పోలీస్ స్టేషన్లతో క్యాబ్‌లను అనుసంధానించేలా ఈ యాప్‌ను రూపొందించారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్‌లో మహిళలపై నేరాలను నియంత్రించేందుకు.. ముఖ్యంగా ఐటీ, ఐటీఈఎస్ పరిశ్రమల్లో పనిచేసే మహిళా ఉద్యోగులు క్యాబ్‌లలో ప్రయాణిస్తున్నప్పుడు వారికి భద్రత కల్పించేందుకు ఈ యాప్ ఉపయోగపడుతుందని డీజీపీ తెలిపారు. క్యాబ్‌లో ప్రయాణిస్తున్న సమయంలో ఆపద ఎదురైనప్పుడు క్యాబ్ సర్వీస్ యాప్‌లోని ఎమర్జెన్సీ బటన్‌ను నొక్కగానే ఆ సందేశం పోలీసు హాక్ ఐ యాప్‌కు వెళ్లిపోతుంది. ఆ వెంటనే క్యాబ్ లొకేషన్, ప్యాసింజర్ వివరాలు పోలీస్ కంట్రోల్ రూంకు, సమీప పెట్రోలింగ్ వాహనం, సంబంధిత పోలీస్ స్టేషన్, డివిజనల్ ఏసీపీ, జోనల్ డీసీపీతోపాటు క్యాబ్ ఆపరేటర్ కంట్రోల్ రూంకు, రిజిస్టర్డ్ కుటుంబసభ్యులు, స్నేహితులకు కూడా వెళ్తాయి. సమాచారం అందగానే సదరు వాహనాన్ని ట్రాక్ చేస్తూ పోలీసు బలగాలు నిర్దిష్ట ప్రాంతానికి చేరుకొంటాయి. ఈ మేరకు వివిధ క్యాబ్ ఆపరేటర్లతో పోలీసు శాఖ ఒప్పందాలు చేసుకున్నదని డీజీపీ వివరించారు. దీంతో నేరం జరుగకముందే దాన్ని నిరోధించేందుకు వీలవుతుందని డీజీపీ తెలిపారు.




పోలీస్ యాప్‌లతో క్యాబ్ సర్వీసులను అనుసంధానించే వ్యవస్థ పోస్టర్‌ను చూపుతున్న డీజీపీ మహేందర్‌రెడ్డి, ఇతర పోలీసు ఉన్నతాధికారులు

# యాచకుడు కాదు.. లక్షాధికారి!

- యాచకుడి ఇంట్లో రూ.1.5 లక్షల నగదు.. రూ. 8.77 లక్షల బ్యాంకు డిపాజిట్లు లభ్యం
- చిల్లర లెక్కించడానికి 8 గంటలు

**ముంబై, అక్టోబర్ 7:** చనిపోయినప్పుడు ఆయన్ని యాచకుడు అనుకున్నారు. తినడానికి కూడా తిండి లేని కటిక పేదరికంలో అతను మగ్గుతున్నట్టు భావించారు. అయితే, అతను చనిపోయాకనే తెలిసింది. అతను యాచకుడు కాదు.. లక్షాధికారని! ముంబైలో జరిగిన ఈ ఘటన పోలీసులకు ఆశ్చర్యాన్ని కలిగించింది. బిర్జు చంద్ర అజాద్ అనే వృద్ధుడు ముంబై వీధుల్లో భిక్షాటన చేస్తూ జీవనం సాగించేవాడు. అయితే శుక్రవారం రాత్రి రైలు పట్టాలు దాటుతుండగా.. ప్రమాదవశాత్తు రైలు ఢీకొట్టి చనిపోయాడు. మృతునికి సంబంధించిన వివరాలు ఏమైనా తెలుస్తాయేమోనని గోవండి బస్తీలో బిర్జు నివసించే గదికి పోలీసులు వెళ్లారు. గదిలో పెద్ద ఎత్తున చిల్లరతో పాటు నగదు, బ్యాంకు రసీదులు ఉండటాన్ని చూసి ఒకింత ఆశ్చర్యానికి లోనయ్యారు. చిల్లరను లెక్కించడానికి దాదాపు ఎనిమిది గంటలు సమయం పట్టినట్టు పోలీసులు తెలిపారు. చిల్లర, నోట్లు కలిసి మొత్తం రూ.1.5 లక్షల నగదు ఉన్నట్లు గుర్తించారు. అంతే కాదు బ్యాంకుల్లో డిపాజిట్ చేసిన సొమ్ము విలువ రూ. 8.77లక్షలు ఉన్నట్లు పేర్కొన్నారు. యాచకుడికి సంబంధించిన పాన్ కార్డు, ఆధార్‌కార్డు, సీనియర్ సిటిజన్ కార్డును చూసి పోలీసులు ఖంగుతిన్నారు. మృతుడు బిర్జు కుటుంబ సభ్యుల కోసం వెతుకుతున్నట్టు ఓ పోలీసు అధికారి తెలిపారు.


యాచకుడు బిర్జుకు చెందిన డబ్బుల మూటలతో పోలీసులు

## రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి దసరా శుభాకాంక్షలు!



**న్యూఢిల్లీ, అక్టోబర్ 7:** దేశ ప్రజలకు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్యనాయుడు విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు రాష్ట్రపతి కోవింద్ సోమవారం ఒక సందేశం విడుదల చేస్తూ 'అసత్యంపై సత్యం సాధించిన విజయానికి సూచికగా జరుపుకునే సంబురం విజయదశమి. నిజాయితీ, సత్య సంధత విలువల కోసం అహర్నిశలు పోరాడేందుకు దసరా ప్రతి ఒక్కరికీ స్ఫూర్తినిస్తుంది. ఈ విలువలకు శ్రీరామచంద్రుడి జీవితం ప్రతిబింబం. ఈనాటికీ ఆచరణీయం' అని పేర్కొన్నారు. చెడుపై మంచి విజయానికి సంకేతం విజయదశమి అని ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్యనాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.






### పరిస్థితులు మెరుగవ్వగానే..

# కశ్మీర్‌కు రాష్ట్ర హోదా

- 2018 ఐపీఎస్ ప్రొబేషనరీ అధికారులతో హోంమంత్రి అమిత్‌షా
- దేశభద్రతతోపాటు సుపరిపాలనకు ఎన్‌ఆర్సీ.. రాజకీయ ప్రక్రియగా చూడొద్దు



**న్యూఢిల్లీ, అక్టోబర్ 7:** జమ్ముకశ్మీర్ ఎప్పటికీ కేంద్ర పాలిత ప్రాంతంగా ఉండబోదని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పేర్కొన్నారు. భద్రతా పరిస్థితులు మెరుగుపడిన తర్వాత తిరిగి రాష్ట్ర హోదాను పునరుద్ధరిస్తామని చెప్పారు. సోమవారం ఆయన 2018 బ్యాచ్ ఇండియన్ పోలీస్ సర్వీస్ (ఐపీఎస్) ప్రొబేషనరీ అధికారులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. ఆగస్టు ఐదో తేదీన జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే 370 అధికరణాన్ని రద్దుచేయడంతో పాటు ఆ రాష్ట్రాన్ని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించిన తర్వాత ఒక్క వ్యక్తి కూడా మరణించలేదని, సింగిల్ బుల్లెట్ కూడా ప్రయోగించలేదని అన్నారు. జమ్ముకశ్మీర్‌లో సాధారణ పరిస్థితులు నెలకొన్న తర్వాత రాష్ట్ర హోదా పునరుద్ధరిస్తామని షా చెప్పినట్లు కేంద్ర హోంశాఖ ఒక ప్రకటనలో తెలిపింది. 370వ అధికరణం మాత్రమే కశ్మీర్ సంస్కృతిని, ఉనికిని కాపాడుతుందన్న భావన తప్పు అని అమిత్‌షా అన్నారు. భారత రాజ్యాంగానికి అనుగుణంగా అన్ని ప్రాంతాల ఉనికిని, గుర్తింపును కాపాడుకోవచ్చునన్నారు. 370 అధికరణం దుర్వినియోగం కూడా సీమాంతర ఉగ్రవాదానికి ఒక కారణమని అమిత్‌షా వ్యాఖ్యానించారు. కశ్మీర్‌లోని 196 పోలీస్ స్టేషన్లకు గాను 10 పోలీస్ స్టేషన్లలోనే 144 సెక్షన్ అమలులో ఉన్నదని పేర్కొన్నారు. ప్రజలకు లబ్ధి చేకూర్చడానికే కఠినమైనా కశ్మీర్‌పై సరైన నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. జాతీయ భద్రతతో పాటు సుపరిపాలనకు కూడా జాతీయ పౌర జాబితా (ఎన్‌ఆర్సీ) ముఖ్యమేనన్నారు. దేశ పౌరులందరికీ అభివృద్ధి ఫలాలను అందుబాటులోకి తేవడానికే ఎన్‌ఆర్సీ అమలు చాలా ముఖ్యమని చెప్పారు. దీన్ని రాజకీయ ప్రక్రియగా చూడొద్దన్నారు.

## పర్యావరణ హిత 'రావణుడు'!

**నోయిడా, అక్టోబర్ 7:** పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు నోయిడా అథారిటీ వినూత్న కార్యక్రమం చేపట్టింది. దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని ప్లాస్టిక్ వ్యర్థాలతో రావణాసురుడి ప్రతిమను రూపొందించింది. సంప్రదాయం ప్రకారం దాన్ని దహనం చేయడానికి బదులుగా, పర్యావరణహిత పద్ధతిలో నేలమట్టం చేస్తారు. 500 కిలోల ప్లాస్టిక్ వ్యర్థాలతో రూపొందించిన ఈ ప్రతిమను నోయిడా స్టేడియంలో ఏర్పాటుచేశారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై అవగాహన పెంచేందుకు సిమెంట్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సహకారంతో దీన్ని ఏర్పాటుచేసినట్లు నోయిడా అథారిటీ జనరల్ మేనేజర్ రాజీవ్ త్యాగీ తెలిపారు. 'ప్లాస్టిక్‌తో రూపొందించిన ఈ రావణుడి ప్రతిమను కాల్చబోం. ముఖ్య అతిథి బటన్ నొక్కగానే అది నేలమట్టం అవుతుంది. అనంతరం ఆ ప్లాస్టిక్‌ను సిమెంట్ బట్టీకి తీసుకెళ్లి పర్యావరణ హిత పద్ధతిలో తొలిగిస్తాం' అని ఆయన వివరించారు.

# ముగ్గురు భారత ఇంజినీర్లకు విముక్తి!

- 11 మంది ఉగ్రవాద నేతలకు బదులుగా విడుదల చేసిన తాలిబన్లు


చర్చల కోసం పాకిస్థాన్‌కు వచ్చిన అబ్దుల్ ఘని బరదార్ నేతృత్వంలోని తాలిబన్ బృందం (ఫైల్)

**ఇస్లామాబాద్, అక్టోబర్ 7:** ఆఫ్ఘనిస్థాన్‌లో తాలిబన్ల చెరలో ఉన్న ముగ్గురు భారత ఇంజినీర్లను విడుదల చేసినట్టు తాలిబన్లు ప్రకటించారు. అయితే ఈ ముగ్గురు ఇంజినీర్ల కోసం ఆఫ్ఘన్ జైలులో ఉన్న తాలిబన్ గ్రూపునకు చెందిన 11 మంది ముఖ్య నేతలను విడుదల చేయాలని షరతులు పెట్టినట్లు ఓ జాతీయ మీడియా పేర్కొంది. ముల్లాహ్ అబ్దుల్ ఘని బరదార్ నేతృత్వంలోని తాలిబన్ ప్రతినిధులు, ఆఫ్ఘనిస్థాన్‌లోని అమెరికా ప్రత్యేక ప్రతినిధి జాల్మే ఖలీల్‌జాద్ నేతృత్వంలోని అమెరికా బలగాల మధ్య గత వారాంతం పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్‌లో జరిగిన చర్చల్లో ఈ మేరకు ఒప్పందం కుదిరినట్టు సమాచారం. 2018 మే నెలలో ఆఫ్ఘన్‌లోని బగ్లాన్ ప్రావిన్స్‌లో పనిచేస్తున్న ఏడుగురు భారత ఇంజినీర్లను తాలిబన్లు కిడ్నాప్ చేశారు. వీరిలో ఒకరిని గత మార్చిలో విడుదల చేశారు. తాజాగా ముగ్గురిని విడుదల చేశారు. ఇక మిగిలిన ఇంజినీర్ల పరిస్థితి గురించి ఎలాంటి వివరాలు తెలియట్లేదు. అలాగే, తాజాగా విడుదల చేసిన ఇంజినీర్లకు సంబంధించిన వివరాలు, విడుదల చేసిన ప్రాంతం గురించి కూడా ఎలాంటి సమాచారం తెలియరాలేదు. కిడ్నాప్‌కు గురైన వారంతా బగ్లాన్ ప్రావిన్స్‌లోని కేఈసీ పవర్ ప్లాంట్‌లో పనిచేసేవారు. ఇక విడుదలైన తాలిబన్లలో ప్రముఖ నేతలు అబ్దుల్ రహీమ్, మౌలాన్ అబ్దుర్ రషీద్ కూడా ఉన్నట్లు సమాచారం. వీరిద్దరూ 2001లో అమెరికా నేతృత్వంలోని పరిపాలనకు ముందు తాలిబాన్ పరిపాలనలో వరుసగా కునార్, నిమ్రోజ్ ప్రావిన్సుల గవర్నర్లుగా పనిచేశారు. అయితే, ఇప్పటి వరకూ జైలులో ఉన్న ఈ 11 మంది తాలిబన్‌లు ఆఫ్ఘన్ ప్రభుత్వం చెరలో ఉన్నారా? లేక ఆఫ్ఘన్‌లోని అమెరికా దళాల చెరలో ఉన్నారా అన్న విషయాన్ని కూడా తాలిబన్‌లు ప్రకటించలేదు. భారత ఇంజినీర్ల విడుదల అంశంపై ఇటు భారత్, అటు ఆఫ్ఘనిస్థాన్ అధికారులు ఇంకా స్పందించలేదు.

### మోటర్ వాహన చట్టం ఉల్లంఘన నేరాలను..

## ఐపీసీ సెక్షన్ల కింద నమోదు చేయవచ్చు

- స్పష్టంచేసిన సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ, అక్టోబర్ 7:** మోటర్ వాహన చట్టం ఉల్లంఘన నేరాలను, ఇండియన్ పీనల్ కోడ్ (ఐపీసీ) సెక్షన్ల కింద కూడా నమోదు చేసి విచారణ జరుపవచ్చని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. దేశంలో మోటర్ వాహనాల సంఖ్య భారీగా పెరుగుతుండటం, రోడ్డు ప్రమాదాల కారణంగా గాయపడుతున్న వారి సంఖ్య కూడా అలాగే పెరుగుతున్నదని న్యాయమూర్తులు ఇందు మల్హోత్రా, సంజీవ్ కన్నాలతో కూడిన ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్ కారణంగా జరిగే మరణాలకు సంబంధించి మోటార్ వాహన చట్టంలోని 8వ అధ్యాయంలో ఏ చర్యలూ లేవని కోర్టు గుర్తుచేసింది. అయితే ఐపీసీలోని 279, 304 పార్ట్ 2, 304ఏ, 337, 338 సెక్షన్లలో ఈ నేరాలకు సంబంధించి సవివరంగా ఉన్నదని పేర్కొంది. ఈ నేపథ్యంలో ఈ రెండు చట్టాలను వేరుగా పరిగణించాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అతి వేగం, ప్రమాదకరంగా వాహనం నడపడం వంటి నేరాలను సాధారణ కేసులుగాను నమోదు చేసి విచారణ జరుపవచ్చని వెల్లడించింది. మోటర్ వాహన చట్టం ఉల్లంఘన నేరాలను, సాధారణ కేసులుగా పరిగణించరాదంటూ 2008 డిసెంబర్ 22న గుహవాటి హైకోర్టు ఇచ్చిన తీర్పు చెల్లదని సర్వోన్నత న్యాయస్థానం పేర్కొన్నది. ఈశాన్య రాష్ట్రాల్లోని దిగువ కోర్టులు దీన్ని పాటించాలన్న హైకోర్టు ఆదేశాన్ని కొట్టివేసింది.

# రాహుల్ కోసం మాస్టర్‌ప్లాన్!

- కాంబోడియా పర్యటన అందులో భాగమే
- సీనియర్ నేతల కథ ఇక కంచికే
- సోనియా నేతృత్వంలోనే పథక రచన!



**న్యూఢిల్లీ, అక్టోబర్ 7:** 'విపాసన' నిమిత్తం కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ కాంబోడియా వెళ్లారన్న వార్త ప్రస్తుతం ఆ పార్టీ వర్గాల్లో చర్చనీయాంశమైంది. రాహుల్ సన్నిహిత నేతలు ప్రస్తుతం పార్టీలో సంక్షోభం ఎదుర్కొంటున్న పరిస్థితుల్లో ఆయన విదేశీ పర్యటనకు వెళ్లడం యువనేతల్లో అయోమయానికి కారణమవుతున్నది. అశోక్ తన్వర్, సంజయ్ నిరుపమ్, ప్రద్యుత్ దెబర్‌మాన్ తిరుగుబాటు చెబుతున్నది ఒక్కటే.. పార్టీలో వృద్ధ నేతలు యువనేతలపై ఆధిపత్యం చెలాయిస్తున్నారని. మరోమాటలో చెప్పాలంటే.. సోనియా కోటరీ.. రాహుల్ సన్నిహితులను తప్పిస్తున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో రాహుల్ ఆకస్మిక పర్యటన వారిని విస్మయపరుస్తున్నది. ప్రస్తుతం మహారాష్ట్ర, హర్యానా అసెంబ్లీ ఎన్నికలు ఉండడమే కాకుండా, రాహుల్ టీం.. పార్టీలో టార్గెట్ అవుతున్నది. పార్టీలో ఉన్న చాలామంది జూనియర్ నేతలు అసంతృప్తితో ఉన్నారు. భవిష్యత్తుపై వారిలో అయోమయం నెలకొంది. ఇలాంటి పరిస్థితుల్లో రాహుల్ ఎందుకు విదేశీ పర్యటనకు వెళ్లారు? ఎందుకు ఆయన మౌనం వహిస్తున్నారు? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అయితే రాహుల్ త్వరలోనే తిరిగి వస్తారని, ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని ఆయన సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. కాకపోతే లోక్‌సభ ఎన్నికల్లోలాగా దూకుడుగా ప్రచారం చేయబోరని పేర్కొన్నాయి. యువనేతల్లో నెలకొన్న ఆందోళన ఆయనకు తెలుసునని, అయితే ఈసారి ఆయన వేచిచూసే ధోరణిలో ఉన్నారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. రాహుల్ పార్టీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టినప్పుడు సీనియర్ నేతలు (ముఖ్యంగా సోనియా గాంధీ కోటరీ) అసంతృప్తికి గురయ్యారు. ఆయన పనితీరుపై పలు సందర్భాల్లో అసమ్మతి తెలిపారు. అలాగే లోక్‌సభ ఎన్నికల్లో రాహుల్ సూచనలకు మద్దతు కరువైంది. రాఫెల్ వివాదం విషయంలో ప్రధాని మోదీపై రాహుల్ విమర్శల దాడి చేసినప్పుడు కొద్ది మంది మాత్రమే మద్దతుగా నిలిచారు. ఇక లోక్‌సభ ఎన్నికల ఫలితాలు రాహుల్‌ను షాక్‌కు గురిచేశాయి. సీనియర్ నేతలు ఎప్పటికీ తనకు అండగా నిలువరని భావించడం ఆయన రాజీనామా చేయడానికి ఒక కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మళ్లీ సీనియర్ నేతల పెత్తనానికి సోనియా ఎందుకు అంగీకరిస్తున్నారు? యువనేతలను ఎందుకు శాంతపరచడం లేదు? సమాధానం ఒక్కటే. తన కుమారుడు రాహుల్ గాంధీ తిరిగి పార్టీ పగ్గాలు చేపట్టాలని ఆమె కోరుకుంటున్నారు. అందులో భాగంగానే ఈ అంతర్గత కుట్ర అనే మాస్టర్‌ప్లాన్ వేశారని భావిస్తున్నారు.

**వృద్ధనేతల కథ ముగింపు..**

ఎన్నికల అనంతరం, మరోసారి పార్టీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టేందుకు రాహుల్ సిద్ధమైతే, వృద్ధ నేతాగణానికి ఇక ఒకేసారి ముగింపు పలుకుతారని విశ్లేషకులు చెబుతున్నారు. సీనియర్లపై తీవ్ర విమర్శలు చేస్తూ యువనేతలు పార్టీని వీడుతున్నారు. వీటిని రాహుల్, సోనియా తర్వాత ఉపయోగించుకునే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. ఇక్కడ సోనియా క్రియాశీలకంగా వ్యవహరించే అవకాశం ఉందని చెబుతున్నారు. కాంగ్రెస్ పార్టీ అంచనాల ప్రకారం హర్యానా, మహారాష్ట్రలో పార్టీకి ఓటమి తప్పదు. హర్యానాలో హుడాకు పగ్గాలు అప్పగించారు. పార్టీ ఓటమిపాలైతే ఆయన కథ ఇక ముగిసినట్లే. ఎన్నికల ముంగిట, ప్రస్తుతం సోనియా దృష్టి అంతా సీనియర్లను తప్పించడంపైనే ఉందని సమాచారం. తద్వారా యువ నేతలకు లేదా రాహుల్ టీంకు మార్గం సుగమం చేయనున్నారు. రాహుల్ 'విపాసన' కార్యక్రమం.. ఆయన సెకండ్ ఇన్నింగ్స్‌కు ప్రారంభమని నేతలు పేర్కొంటున్నారు.

### వ్యక్తిగత జీవితాన్ని గౌరవించాలి

ఎన్నికల ముంగిట రాహుల్ విదేశాలకు వెళ్లడంపై వస్తున్న వార్తలపై కాంగ్రెస్ పార్టీ స్పందించింది. భారత ప్రజాస్వామిక సంప్రదాయంలో వ్యక్తిగత స్వేచ్ఛకు ఎప్పుడూ గౌరవముందని, వ్యక్తిగత విషయాలను ప్రజా జీవితంతో ముడిపెట్టకూడదని స్పష్టంచేసింది. విదేశాల్లో ఉన్నప్పుడు ఎస్పీజీ భద్రతకు సంబంధించి నిబంధనల్లో చేసిన మార్పులపై తమ నేతలకు ఎలాంటి సమాచారం అందలేదని ఆ పార్టీ పేర్కొంది. విదేశాల్లో ఉన్నప్పుడు కూడా నేతలకు ఎస్పీజీ భద్రత కల్పించనున్నట్లు వార్తలు వెలువడిన నేపథ్యంలో ఈ మేరకు స్పందించింది.

### దేవుడి దయ వల్ల

## కేసు మిస్టరీ వీడుతున్నది

- కేరళలో కుటుంబ సభ్యుల వరుస మరణాలపై రెంజీ థామస్ స్పందన



**కోజికోడ్:** దేవుడి దయతో 17 ఏండ్ల తర్వాత తమ కుటుంబ సభ్యుల మరణాల కేసు మిస్టరీ వీడుతున్నదని ఫిర్యాదుదారుడి సోదరి రెంజీ థామస్ తెలిపారు. కేరళలోని కోజికోడ్‌లో ఓ సంపన్న కాథలిక్ కుటుంబం కోడలు జాలీ (47) ఆస్తిపై పెత్తనానికి 14 ఏండ్లలో ఆరుగురు కుటుంబసభ్యులను హత్యచేసిన సంగతి తెలిసిందే. 2002లో అత్త అన్నమ్మ థామస్, 2008లో మామ టామ్ థామస్, 2011లో భర్త రాయ్ థామస్, 2014లో భర్త మృతిపై అనుమానం వ్యక్తం చేసిన అన్నమ్మ సోదరుడు మాథ్యూస్, బంధువైన షాజును రెండో వివాహం చేసుకునేందుకు 2016లో అతడి భార్య సిలీ, పాప ఆల్ఫిన్‌ను అంతం చేసింది. అమెరికాలో ఉన్న టామ్ చిన్న కుమారుడు ఫిర్యాదు చేయడంతో అసలు గుట్టు రట్టయ్యింది. కాగా మోజో సోదరి రెంజీ థామస్ సోమవారం దీనిపై స్పందించారు. తనని, తన సోదరుడ్ని విషప్రయోగంతో చంపుతారని భయపడ్డామని, గత మూడేండ్లుగా ఆ ఇంట్లో పచ్చినీళ్లైనా ముట్టలేదన్నారు.

## నేడు రాఫెల్‌ను స్వీకరించనున్న రాజ్‌నాథ్

- ఫ్రాన్స్ బయల్దేరిన రక్షణ మంత్రి



**న్యూఢిల్లీ:** మొదటి రాఫెల్ యుద్ధ విమానాన్ని స్వీకరించడానికి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సోమవారం ఫ్రాన్స్‌కు బయల్దేరారు. విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని అక్కడే ఆయుధపూజ కూడా నిర్వహించనున్నారు. పర్యటనకు బయల్దేరే ముందు ఆయన ఓ ట్వీట్ చేశారు. భారత్-ఫ్రాన్స్ సంబంధాలను సరికొత్త స్థాయికి తీసుకెళ్లాలని ఎదురుచూస్తున్నట్లు పేర్కొన్నారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా ఫ్రెంచ్ సాయుధ దళాల మంత్రి ఫ్లోరెన్స్ పార్లీతో కలిసి మెరిగ్నాక్‌లో మంగళవారం జరిగే రాఫెల్ అప్పగింత కార్యక్రమంలో రాజ్‌నాథ్ పాల్గొంటారు. ఆర్బీ-01 నంబర్ గల రాఫెల్‌లో ఆయన ప్రయాణిస్తారని వాయుసేన వర్గాలు తెలిపాయి. దీనికి ముందు ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ తో సమావేశమవుతారు. ఫ్రెంచ్ రక్షణ సంస్థల సీఈఓలతో బుధవారం రాజ్‌నాథ్ భేటీ కానున్నారు.


అమెరికాలోని నార్త్‌కెరోలినాలోని చార్లెట్ తెలంగాణ అసోసియేషన్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలు



కెనడాలోని టోరంటో (బ్రాంప్టన్) నగరంలో బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్న తెలంగాణ మహిళలు, స్థానిక చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేస్తున్న యువకులు

# విదేశాల్లో వైభవంగా బతుకమ్మ సంబురాలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వివిధ దేశాల్లో బతుకమ్మ సంబురాలు ఘనంగా జరిగాయి. అమెరికాలోని నార్త్‌కెరోలినా, ఫ్లోరిడాలలో, మలేషియాలోని కౌలాలంపూర్‌లో, స్విట్జర్లాండ్‌లోని జ్యూరిచ్‌లో, యూకేలోని స్కాట్లాండ్ అబర్డీన్ నగరంలో, కెనడాలో బతుకమ్మ ఉత్సవాలు పల్లె వాతావరణాన్ని తలపించేలా ఉత్సాహంగా సాగాయి. తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం (టీడీఎఫ్ కెనడా) సాంస్కృతిక విభాగమైన 'తంగేడు' ఆధ్వర్యంలో కెనడాలోని టోరంటో(బ్రాంప్టన్) నగరంలో శనివారం బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. అనంతరం స్థానిక చెరువులలో బతుకమ్మను నిమజ్జనం చేశారు.


మలేషియాలోని కౌలాలంపూర్‌లో 'మైట' ఆధ్వర్యంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


అండమాన్ నికోబార్ దీవుల రాజధాని పోర్ట్ బ్లెయిర్‌లో బతుకమ్మ ఆడుతున్న తెలంగాణ మహిళలు


స్విట్జర్లాండ్‌లోని జ్యూరిచ్‌లో తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్న మహిళలు


అమెరికాలోని ఫ్లోరిడాలో బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్న తెలంగాణ మహిళలు


యూకేలోని స్కాట్లాండ్ అబర్డీన్ నగరంలో బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్న ప్రవాస తెలంగాణ యువతులు, రాబర్ట్ జార్డియన్ యూనివర్సిటీ విద్యార్థినులు



# ఆమ్లెట్‌లో పెంకులొచ్చాయని జరిమానా

- మహిళా ఎంపీ ఫిర్యాదుతో ఎయిర్ ఇండియా చర్యలు

**ముంబై, అక్టోబర్ 7:** విమానంలో ప్రయాణిస్తుండగా తనకు వడ్డించిన ఆమ్లెట్‌లో గుడ్డు పెంకులు వచ్చాయన్న ఎన్సీపీ ఎంపీ ఫిర్యాదు మేరకు ఎయిర్ ఇండియా చర్యలు తీసుకున్నది. గతవారం పుణె-ఢిల్లీ విమానానికి సరఫరా చేసిన ఆహార పదార్థాల మొత్తం ధరను, నిర్వహణ చార్జీలను క్యాటరింగ్ ఏజెన్సీలే భరించాలని ఆదేశించింది. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఎన్సీపీ రాజ్యసభ ఎంపీ వందనా చవాన్ గతవారం తాను ఎయిర్ ఇండియాలో ప్రయాణించినప్పుడు ఎదురైన అనుభవాన్ని ఆదివారం ట్విట్టర్‌లో వివరించారు. 'కొన్నాళ్ల కిందట ఎయిర్ ఇండియా విమానంలో పుణె నుంచి ఢిల్లీకి ప్రయాణించాను. బ్రేక్‌ఫాస్ట్ కోసం ఆమ్లెట్‌ను ఆర్డర్ చేశారు. సిబ్బంది నాకు నాణ్యత లేని ఆహారాన్ని సరఫరా చేశారు. ఆమ్లెట్ తింటుంటే చిన్న గుడ్డు పెంకులు తగిలాయి. పుచ్చిపోయిన ఆలుగడ్డలు, ఉడుకని గింజలు వచ్చాయి' అని ట్వీట్ చేశారు. దీనికి ప్రధానమంత్రి కార్యాలయం, విమానయాన శాఖ మంత్రి, డీజీసీఏ, ఎయిర్‌ఇండియా చైర్మన్‌ను ట్యాగ్ చేశారు. వాస్తవాలను వారి దృష్టికి తెచ్చేందుకే ఈ పోస్ట్ పెట్టినట్టు చెప్పారు. చవాన్ ఫిర్యాదును ఎయిర్‌ఇండియా తీవ్రంగా పరిగణించింది. క్యాటరింగ్ ఏజెన్సీలకు జరిమానా విధించింది.

## ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దేందుకు తాత్కాలిక చర్యలా?

- ప్రభుత్వంపై కాంగ్రెస్ పార్టీ మండిపాటు

**న్యూఢిల్లీ:** దేశ ఆర్థిక వ్యవస్థ పట్ల మోదీ సర్కార్ అనుసరిస్తున్న తీరుపై కాంగ్రెస్ పార్టీ మండిపడింది. తాత్కాలిక చర్యలు చేపట్టడానికి బదులు ఆర్థిక మందగమనానికి కారణాలపై సమగ్ర విశ్లేషణతో చర్యలు చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి సుప్రియా శ్రీనాటే పేర్కొన్నారు. వాణిజ్య రంగంలో ఆర్థిక లావాదేవీలు 88 శాతం తగ్గాయన్న ఆర్బీఐ కథనాలపై ఆమె స్పందించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సెప్టెంబర్ వరకు రుణ పరపతి పడిపోవడానికి ఆర్థిక కార్యకలాపాలు స్తంభించడమే కారణమన్నారు. గతేడాది వాణిజ్య రంగంలో రూ. 7.36 లక్షల కోట్ల ఆర్థిక లావాదేవీలు జరిగితే ఈ ఏడాది రూ.91వేల కోట్లకు పరిమితమయ్యాయని గుర్తు చేశారు.

## యూపీసీసీ చీఫ్‌గా అజయ్‌కుమార్ లల్లూ!

- 18 మందితో ప్రియాంకాగాంధీకి సలహా మండలి

**న్యూఢిల్లీ:** ఉత్తర్‌ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీని పూర్తిగా పునర్వ్యవస్థీకరించారు. అధ్యక్షుడిగా రాజ్‌బబ్బర్ స్థానంలో అజయ్‌కుమార్ లల్లూ నియమితులయ్యారు. ఆయన ప్రియాంకాగాంధీకి అత్యంత సన్నిహితుడన్న పేరున్నది. లల్లూ స్థానంలో సీఎల్పీ నేతగా ఆరాధనా మిశ్రా మోనాను నియమించారు. నలుగురు ఉపాధ్యక్షులు, 12 మంది ప్రధాన కార్యదర్శులు, 24 మంది కార్యదర్శులతో యూపీసీసీ కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. ప్రియాంకా గాంధీకి సీనియర్ నేతలు ఆర్పీఎన్ సింగ్, పీఎల్ పూనియా, మోహ్సినా కిద్వాయిలతోపాటు 18 మందితో కూడిన సలహా మండలిని ఏర్పాటు చేస్తూ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు సోనియాగాంధీ ఆదేశాలు జారీ చేశారు.

## ఉజ్బెకిస్థాన్ మహిళపై కస్టమ్స్ అధికారి లైంగిక వేధింపులు

- ఢిల్లీ పోలీసులకు ఫిర్యాదు చేసిన కస్టమ్స్ శాఖ

**న్యూఢిల్లీ:** భారత్‌కు వచ్చిన ఉజ్బెకిస్థాన్ మహిళపై సూపరింటెండెంట్ ర్యాంకు కలిగిన ఓ కస్టమ్స్ అధికారి లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై కస్టమ్స్ శాఖ ఢిల్లీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. తన సోదరి కుమారుడి చికిత్స నిమిత్తం ఉజ్బెకిస్థాన్‌కు చెందిన ఓ మహిళ మే 3న ఢిల్లీ విమానాశ్రయంలో దిగారు. కస్టమ్స్ శాఖలో పనిచేస్తున్న ఓ సూపరింటెండెంట్ ర్యాంకు అధికారి సదరు మహిళను తనిఖీ పేరుతో ఓ గదిలో అరగంటపాటు లైంగికంగా వేధించాడు. అదే శాఖలో పనిచేసే ఓ ప్రజావేగు ఫిర్యాదుతో ఈ ఘటన వెలుగుచూసింది. కస్టమ్స్ కమిషనర్ మనీశ్ కుమార్ ఆదేశాలతో ఆ శాఖ అధికారులు నిందితుడిపై ఢిల్లీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

తెలంగాణ ప్రభుత్వం
జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి, హైదరాబాద్
నోటిఫికేషన్
జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి, హైదరాబాద్ కార్యాలయంలో కాంట్రాక్టు పద్ధతిన జాతీయ పట్టణ ఆరోగ్య మిషన్ తాత్కాలిక ప్రాతిపదికన పని చేయుటకు ఈ క్రింది పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానించడమైనది. 1. ఉద్యోగం పేరు: వైద్యాధికారులు (పార్ట్ టైం), ఖాళీల సంఖ్య: 53, నోటిఫికేషన్ సంఖ్య: 2528/DMHO/HYD/2019, వేతనం: 20,000/-, వాక్-ఇన్-ఇంటర్వ్యూ తేది: 15-10-2019. 2. ఉద్యోగం పేరు: హెల్ప్ డెస్క్ కౌన్సిలర్, ఖాళీల సంఖ్య: 03, నోటిఫికేషన్ సంఖ్య: 1060/NHM/DMHO/2019, వేతనం: 10,000/-, వాక్-ఇన్-ఇంటర్వ్యూ తేది: 17-10-2019. దరఖాస్తు చేసుకునే విధానం: వైద్యాధికారులు మరియు హెల్ప్ డెస్క్ కౌన్సిలర్లు దరఖాస్తు కొరకు మరియు ఇతర వివరములు కొరకు వెబ్‌సైట్ www.hyderabad.telangana.gov.in నుండి డౌన్‌లోడ్ చేసుకొని దరఖాస్తుతోపాటు అన్ని సర్టిఫికెట్స్ మరియు జిరాక్స్ ప్రతులను జతపరిచి మరియు ఒరిజినల్ సర్టిఫికెట్స్‌లను తీసుకొని పైన తెలియజేసిన తేదీలలో జిల్లా కలెక్టర్ కార్యాలయం, అబిడ్స్, హైదరాబాద్ నందు ఉ. 10.30 నుండి 01.00 వరకు వాక్-ఇన్-ఇంటర్వ్యూకు హాజరు కావలెను.
సం/- జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి, హైదరాబాద్ జిల్లా
DIPR R.O.No. 1352-DP/CL/Advt/1/2019-20 తేది: 07-10-2019



బ్రాడ్‌పిట్‌తో విడాకుల తర్వాత నన్ను నేను కొంత కోల్పోయిన. ఇప్పుడు నేను పరివర్తనలో ఉన్నా. మళ్లా నా మూలాలకు చేరుకుంటా. నేను నేనుగా మారుతా.

**ఏంజెలినా జోలీ, హాలీవుడ్ నటి**

బ్రిటన్ ప్రధాని బోరిస్ జాన్సన్ 2008-16లో మేయర్‌గా ఉన్నప్పుడు మేం ప్రాచీన సాహిత్యం, ఫ్రెంచి తత్త్వవేత్త వాల్టేర్ తదితర అంశాలపై చర్చించేవారం. షేక్‌స్పియర్ అంటే ఇరువురికి ఇష్టం. ఇక మా వ్యక్తిగత సంబంధాల గురించి నేను మాట్లాడను. మా వ్యక్తిగత జీవితాలు ఎటువంటివనేది ఇతరులకు అనవసరం.

**జెన్నిఫర్ అర్క్యూరీ, అమెరికా పారిశ్రామికవేత్త**



**చరిత్రలో నేడు**



1600

రాజ్యాంగాన్ని ఆవిష్కరించుకున్న శాన్ మారినో.

1932

భారత వైమానిక దళం ఏర్పాటు





1962

ఐక్యరాజ్యసమితిలో సభ్యత్వం పొందిన అల్జీరియా.

నేపాలీ ప్రజలకు దశయిన్ (దసరా) పండుగ ప్రధానమైనది. ఎక్కడున్నా సొంతూరికి చేరుకొని తల్లిదండ్రుల ఆశీస్సులు పొందుతారు. మహిషాసురుడిని దుర్గాదేవి హతమార్చిన ఈ రోజున అధర్మంపై ధర్మం విజయం సాధించిందనేదిగా భావిస్తారు. తాజా వార్తల ప్రకారం దాదాపు పది లక్షల మంది కాఠ్మండు నుంచి ఇతర ప్రదేశాలకు బయల్దేరారు. పండుగ సందర్భంగా ఆహారపదార్థాల ధరలు ఆకాశాన్నంటాయి. ఆహార పదార్థాల దిగుమతి, వ్యాపారుల స్వార్థం వల్ల ఈ పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం వీరిని కట్టడి చేస్తే పండుగ ఆనందదాయకంగా సాగుతుంది.

**ది హిమాలయన్ టైమ్స్**

బ్రిటన్‌లో 1950 దశకంలో పుట్టిన మహిళలు పింఛన్ వయసులో మార్పుల ఫలితంగా నష్టపోకుండా ఏదో ఒక చర్య తీసుకోవలసి ఉన్నది. ఈ విషయమై మహిళా గ్రూప్ వాదనను హైకోర్టు కొట్టివేసింది. 1995లో, 2011లో చట్టంలో తెచ్చిన మార్పులు మహిళల పరంగా వయస్సురీత్యా వివక్షతో కూడి ఉన్నాయని మహిళలు ఆరోపిస్తున్నారు. దీనివల్ల 38 లక్షల మంది మహిళలు నష్టపోతున్నారు. హైకోర్టు తీర్పుపై అప్పీలు చేయడంతో పాటు రాజకీయ నాయకులను ఒప్పించడానికి మహిళా గ్రూప్ ప్రయత్నిస్తున్నది. ప్రభుత్వం ఏదో ఒక రీతిలో వీరికి న్యాయం చేయాలె.

**ది గార్డియన్**



# బంగ్లా మైత్రి

బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా నాలుగు రోజుల భారత పర్యటన రెండు దేశాల మధ్య ఉచ్ఛస్థాయిలో ఉన్న ద్వైపాక్షిక సంబంధాలను ప్రస్ఫుటింపజేస్తున్నది. హసీనా 2008లో అధికారానికి వచ్చిన నాటినుంచి భారత్‌తో సాన్నిహిత్యం బలపడుతూనే ఉన్నది. గురువారం నుంచి ఆదివారం వరకు భారత్ పర్యటించిన హసీనా మొదట ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో పాల్గొని పెట్టుబడులకు ఆహ్వానం పలికారు. భారత్ నుంచి మరింతగా పెట్టుబడులను రావాలని ఆమె ఆశిస్తున్నారు. ఈ సదస్సు అనంతరం ద్వైపాక్షిక చర్చ మొదలైంది. ఇరుపక్షాల మధ్య ఏడు ఒప్పందాలు కుదరడమే కాకుండా, మూడు ప్రాజెక్టులను ప్రారంభించారు. బంగ్లాదేశ్ నుంచి మన దేశంలోని ఈశాన్య రాష్ట్రాలకు ఎల్పీజీ సరఫరా చేయడం ఈ ప్రాజెక్టులలో ఒకటి. జలవనరులు, సంస్కృతి, విద్య, తీర గస్తీ మొదలైన అంశాలపై ఒప్పందాలు ద్వైపాక్షిక కుదిరాయి. ఏడాది కాలంలో పన్నెండు ప్రాజెక్టులను ప్రారంభించినట్టు ప్రధాని మోదీ ఈ సందర్భంగా గుర్తుచేశారు. రెండు దేశాల మధ్య అణుశక్తి రంగంలో కూడా సహకారం నెలకొన్నది. ద్వైపాక్షిక సంబంధాలు అనూహ్య స్థాయిలో అతివేగంగా బలపడుతున్నాయనేది కాదనలేని వాస్తవం. వేర్పాటువాదులు బంగ్లాదేశ్‌ను స్థావరంగా చేసుకొని భారత్‌లో కార్యకలాపాలు సాగించే పరిస్థితి ఇప్పుడు లేదు. 2015లో సరిహద్దు ఒప్పందంపై సంతకాలు చేయడం ఒక చరిత్రాత్మక ఘట్టం. ద్వైపాక్షిక వాణిజ్యం గత ఆర్థిక సంవత్సరంలో తొమ్మిది బిలియన్ డాలర్లకు పెరిగింది. భారత్‌కు బంగ్లా పర్యాటకుల సంఖ్య భారీగా పెరుగుతున్నది. భారత్‌కు వచ్చే పర్యాటకులలో ఐదో వంతు బంగ్లాదేశీయులే. భారత్‌లో చికిత్సకోసం వచ్చే రోగులలో సగం మంది బంగ్లాదేశ్ నుంచి వచ్చేవారే. రెండు దేశాల మధ్య రైలు, బస్సు మార్గాలు ఇరు దేశాలకు లబ్ధికరంగా మారాయి.

> **భారత్ కూడా లౌకికత్వం, ప్రజాస్వామ్యం విలువలు ప్రాతిపదికగా బంగ్లాదేశ్‌లో సంబంధాలను దృఢతరం చేసుకోవాలె. రెండు దేశాల మధ్య విభేదాలను స్నేహ పూర్వకంగా పరిష్కరించుకోవాలె. చిన్నదేశమే కదా అని నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చైనా ప్రభావం పెరుగుతుంది. కొన్నేండ్లుగా నేపాల్‌తో స్నేహ సంబంధాలు దెబ్బతినడం వల్ల ఆ దేశం చైనా వైపు కొంత మొగ్గింది. శ్రీలంక, మాల్దీవ్స్ ఇప్పుడిప్పుడే మళ్ళా భారత్‌కు అనుకూలంగా మారాయి. పాకిస్థాన్ తో వైషమ్యం తీవ్రస్థాయిలో ఉన్న నేపథ్యంలో ఇతర ఇరుగుపొరుగు దేశాల విషయంలో భారత్ చాతుర్యంతో వ్యవహరించాలె.**

ద్వైపాక్షిక సంబంధాలు బలోపేతం అవుతున్నంత మాత్రాన భారత్, బంగ్లాదేశ్ మధ్య విభేదాలు లేవని కాదు. కాకపోతే రాజకీయ నాయకత్వాల మధ్య ఉన్న సౌహార్ద్రత ఈ చికాకులను అధిగమిస్తున్నది. రెండు దేశాల మధ్య యాభై నాలుగు నదులున్నాయి. జల వివాదాలను పరిష్కరించుకోవడానికి రెండు దేశాలు ప్రయత్నిస్తున్నాయి. తీస్తా నదీజలాల ఒప్పందం 2011లోనే కుదిరినప్పటికీ పశ్చిమ బంగ్లాదేశ్ అభ్యంతరం వల్ల ముందడుగు పడటం లేదు. గంగా–పద్మా నదుల జల పంపకం కూడా ఇంకా కొలిక్కి రాలేదు. రోహింగ్యాల విషయంలోనూ చర్చలు సాగుతున్నాయి. రెండు దేశాల సంబంధాలను దెబ్బకొట్టగలిగే తీవ్రమైన అంశం అస్సాంలో తయారుచేసిన జాతీయ పౌర పట్టిక. ఇది తమ ఆంతరంగిక అంశమని విదేశాంగ మంత్రి జయ్ శంకర్ ప్రకటించారు. ఈ వ్యాఖ్య బంగ్లాదేశ్‌కు కొంత ఊరట కలిగించింది. ఐక్యరాజ్య సమితి సమావేశాలకు వెళ్ళినప్పుడు ఈ అంశాన్ని హసీనా ప్రధాని మోదీతో ప్రస్తావించారు. అయితే హోంమంత్రి అమిత్ షా ప్రకటనలు బంగ్లాదేశ్‌లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. లక్షలాదిమంది పేర్లు జాతీయ పౌర పట్టికలో లేకపోవడం, వారిని దేశం నుంచి పంపిస్తామనే రీతిలో అమిత్ షా మాట్లాడటం పట్ల బంగ్లాదేశ్‌లో చర్చ సాగుతున్నది. బంగ్లాదేశ్‌లోని ప్రతిపక్షాల ఒత్తిడిని హసీనా తట్టుకోవడానికి భారత్ నుంచి స్పష్టమైన హామీని కోరడం సహజం.

భారత బంగ్లాదేశ్ అనుబంధం చారిత్రకంగా ముడిపడి ఉన్నది. బంగ్లాదేశ్ అవతరణకు భారత్ తోడ్పాటు అక్కడి ప్రజలు మరిచిపోలేనిది. అయితే ప్రచ్ఛన్న యుద్ధకాలంలో సోవియెట్ యూనియన్‌తో సన్నిహితంగా ఉండే భారత్‌ను ఇరకాటంలో పెట్టడం అమెరికా అజెండాగా ఉండేది. బంగ్లాదేశ్‌లో మతవాదుల ప్రమేయం, సైనిక పాలనల మూలంగా భారత్‌తో వైషమ్యం ఏర్పడ్డది. అయినా మిగతా దేశాలతో పోలిస్తే బంగ్లాదేశ్‌తో దౌత్య సంబంధాలు మెరుగ్గానే ఉన్నాయి. ఇప్పుడు అమెరికా మూలంగా ఇబ్బంది లేదు కానీ భారత్ చుట్టుపక్కల చైనా ప్రభావం గణనీయంగా పెరిగిపోతున్నది. మతవాదుల ప్రాబల్యం కూడా బంగ్లాదేశ్‌లో పెరిగిపోయింది. ఈ ప్రతికూల పరిస్థితుల్లోనూ భారత్, బంగ్లా స్నేహం చెక్కుచెదరడం లేదు. లౌకికవాద, ప్రజాస్వామ్య భావనలు గల నాయకురాలైన హసీనాకు భారత్‌కు అనుకూల నాయకురాలిగా పేరున్నది . హసీనా బంగ్లాదేశ్ విముక్తి పోరాటానికి నాయకత్వం వహించిన షేక్ ముజిబ్ ఉర్ రహ్మాన్ కుమార్తె. అందువల్ల భారత్‌తో మైత్రి పటిష్ఠంగా ఉన్నది. భారత్ కూడా లౌకికత్వం, ప్రజాస్వామ్యం విలువలు ప్రాతిపదికగా బంగ్లాదేశ్‌లో సంబంధాలను దృఢతరం చేసుకోవాలె. రెండు దేశాల మధ్య విభేదాలను స్నేహ పూర్వకంగా పరిష్కరించుకోవాలె. చిన్నదేశమే కదా అని నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చైనా ప్రభావం పెరుగుతుంది. కొన్నేండ్లుగా నేపాల్‌తో స్నేహ సంబంధాలు దెబ్బతినడం వల్ల ఆ దేశం చైనావైపు కొంత మొగ్గింది. శ్రీలంక, మాల్దీవ్స్ ఇప్పుడిప్పుడే మళ్ళా భారత్‌కు అనుకూలంగా మారాయి. పాకిస్థాన్‌తో వైషమ్యం తీవ్రస్థాయిలో ఉన్న నేపథ్యంలో ఇతర ఇరుగుపొరుగు దేశాల విషయంలో భారత్ చాతుర్యంతో వ్యవహరించాలె. ఇరుగుపొరుగు దేశాలతో స్నేహ సంబంధాలే భారత్‌ను బలోపేతం చేస్తుంది. హసీనా పర్యటన సందర్భంగా మోదీ వ్యాఖ్యానించినట్టు భారత్– బంగ్లా మైత్రి ప్రపంచానికి ఆదర్శం కావాలె.

ఆర్థికం



**మాధవరం నాగేందర్**

# దాచేస్తే దాగని మాంద్యం

ప్రస్తుతం ఉన్న ఆర్థికమాంద్యం గత డెబ్భై ఏండ్లలో ఎప్పుడు లేదని ప్రముఖ ఆర్థిక శాస్త్రవేత్త, నీతి ఆయోగ్ ఉపాధ్యక్షుడు రాజీవ్‌కుమార్ అభిప్రాయపడినాడు. గత 15 ఏండ్లలో ప్రైవేట్‌రంగంలో ఇంత తక్కువగా ఎప్పుడు పెట్టుబడులు పెట్టడం జరుగలేదు. చిన్న పరిశ్రమలకు జీఎస్టీ గుదిబండగా మారింది. జీఎస్టీ నిబంధనలు కష్టతరంగా మారి చాలా పరిశ్రమలు తమ ఉత్పత్తులను నిబంధనల ప్రకారం మార్కెట్లో పెట్టలేకపోయాయి. ఫలితంగా వారి వస్తువులు కొనుగోలుదారులకు అందుబాటులో లేకుండాపోయాయి.

భారతదేశంపై ఆర్థికమాంద్యపు చీకటి మేఘాలు కమ్మేశాయి. ఆర్థికమాంద్యం రాలేదని మందగమనం అని నిర్వచించడానికి ప్రయత్నిస్తున్నారు. రాజకీయ పరిభాషలో ఇది 'మోదీ గమనం', ఆర్థిక పరిభాషలో 'ఆర్థిక మాంద్యం'. ముఖ్యంగా దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారు, వ్యవసాయాధారిత వృత్తుల వాళ్లు, చిన్న పరిశ్రమలు, విద్యార్థులు, సంక్షేమ పథకాలు పొం దుతున్నవారు ఎక్కువగా నష్టపోతారు. రాజ్యాంగబద్ధ స్వతంత్ర ప్రతిప త్తి గల సుప్రీంకోర్టు, రిజర్వ్ బ్యాంక్, పార్లమెంట్ ప్రేక్షకపాత్ర వహిస్తున్నప్పుడు ప్రజాస్వామ్య భారతంలో ఒక వ్యక్తి తన చర్యల ద్వారా దేశానికి ఎంతటి నష్టం కలిగించగలడు అనడానికి డీమానిటైజేషన్ చక్కటి ఉదాహరణ.

2016 నవంబర్ 8న రాత్రి భారత ప్రధాని నరేంద్ర మోదీ 80 శాతం చలామణిలో ఉన్న నోట్లను రద్దు చేశాడు. నోట్లరద్దుకు ప్రధాన ఉద్దేశాలు దేశాన్ని డిజిటలైజేషన్ చేయడం, నల్లధనాన్ని వెలికితీయడం, పన్నులు సక్రమంగా వసూలుచేయడం, తీవ్రవాదాన్ని నిర్మూలించడం, హవాలా మార్గాలను మూసివేయడం, ఆర్థికవ్యవస్థను సంపూర్ణంగా ప్రక్షాళన చేయడం ద్వారా స్థూల జాతీయోత్పత్తిని పెంచడం అని పేర్కొనడం జరిగింది. ఈ చర్య ద్వారా అన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తుందని స్వర్ణ భారత్ నిర్మాణానికి దారి ఏర్పడుతుందని ఎంతో ఆర్భాటం చేయడం జరిగింది. కానీ, ఏ సమస్య పరిష్కారం కాకపోగా డీమానిటైజేషన్ వల్ల వ్యవసాయ, నిర్మాణ, ఉత్పత్తిరంగాలు దెబ్బతిన్నాయి. ఈ రంగాలు జాతీయ స్థూల ఉత్పత్తిలో 50 శాతం వాటా, ఉద్యోగకల్పనలో 80 శాతం వాటా కలిగి ఉన్నాయి. శతాబ్దాల తరబడి భారత సంస్కృతిలో భాగమై దేశ ఆర్థిక పరిపుష్టికి తోడ్పడిన ఈ రంగాలు మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యానికి పునాదిగా నిలిచాయి. వినియోగదారులు, వ్యవసాయం, చిన్నతరహా పరిశ్రమలు కొనుగోలు శక్తి కోల్పోవడం ద్వారా ఆర్థిక సంక్షోభం వచ్చిందని ఆర్థికవేత్తలు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం ఉన్న ఆర్థికమాంద్యం గత డెబ్భై ఏండ్లలో ఎప్పుడు లేదని ప్రముఖ ఆర్థిక శాస్త్రవేత్త, నీతి ఆయోగ్ ఉపాధ్యక్షుడు రాజీవ్ కుమార్ అభిప్రాయపడినాడు. గత 15 ఏండ్లలో ప్రైవేట్‌రంగంలో ఇంత తక్కువగా ఎప్పుడు పెట్టుబడులు పెట్టడం జరుగలేదు. చిన్న పరిశ్రమలకు జీఎస్టీ గుదిబండగా మారింది. జీఎస్టీ నిబంధనలు కష్టతరంగా మారి చాలా పరిశ్రమలు తమ ఉత్పత్తులను నిబంధనల ప్రకారం మార్కెట్లో పెట్టలేకపోయాయి. ఫలితంగా వారి వస్తువులు కొనుగోలుదారులకు అందుబాటులో లేకుండాపోయాయి.

స్థూల ఉత్పత్తి పెరుగుదల 5 శాతానికి పడిపోయింది. సుబ్రహ్మణ్యస్వామితో సహ అనేకమంది ఆర్థికవేత్తలకు మోదీ ప్రభుత్వ జీడీపీ లెక్కలపై అనేక అనుమానాలున్నాయి. సుబ్రహ్మణ్యస్వామి ప్రకారం జీడీపీ పెరుగుదల 3.5 శాతం. కార్ల పరిశ్రమ సంక్షోభం వల్ల పది లక్షల ఉద్యోగాలు పోయాయి. గృహ నిర్మాణ పరిశ్రమ కుప్పకూలిపోయింది. బనియన్లు, డ్రాయర్లు ఉత్పత్తిచేసే పరిశ్రమలు కూడా డిమాండ్లకే మూతపడుతున్నాయి. ఇదే పరిస్థితి అనేక రంగాలలో నెలకొని ఉన్నది. 2011–2014 మధ్యన వినియోగదారుల కొనుగోలు శక్తి సూచిక 6.1 శాతం ఉండగా, ఇప్పుడు అది 3.1 శాతానికి పడిపోయింది. ఆదాయం లేక ప్రజలు వస్తువులు కొనలేకపోవడం, డిమాండ్ లేక పరిశ్రమలు కార్మికులను తొలిగించి ఉత్పత్తిని తగ్గించుకోవడం, నిరుద్యోగులైన కార్మికులు వస్తువులను కొనుగోలు శక్తి కోల్పోవడమనేది ఒక విషవలయం. ఈ విషవలయం నుంచి బయటపడటానికి అనేక సంవత్సరాలు పడుతుంది. ఆర్థికపరిస్థితి తీవ్రంగా దిగజారినప్పుడు మాత్రమే బిస్కెట్లు, బనియన్లు, డ్రాయర్లు విలాస వస్తువులుగా మారుతాయి. ఈ పరిస్థితి తీవ్రమైన ఆర్థిక సంక్షోభానికి సూచిక.

నిరుద్యోగం పెరిగి ప్రజల కొనుగోలు శక్తి తగ్గిపోవడం వల్ల వచ్చే ఆర్థికమాంద్యం 1929లో అమెరికాలో వచ్చింది. అమెరికా అధ్యక్షుడు రూజ్‌వెల్ట్ ఆర్థిక శాస్త్రవేత్త కీన్స్ సూచనలతో ఆర్థికమాంద్యం నుంచి బయటపడటానికి ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు 15 శాతం, ప్రభుత్వ ఖర్చులు 25 శాతం తగ్గించాడు. నిధులను వ్యవసాయంపై, రైల్వే లైన్లపై, రహదారుల నిర్మాణంపై, చిన్న పరిశ్రమలపై, ఉద్యోగకల్పన పథకాలపై ఖర్చు పెట్టాడు. ఫలితంగా అమెరికా ఆర్థిక మాంద్యం నుంచి బయటపడింది. డిమాండ్ లేక పరిశ్రమలు ఉత్పత్తిని ఆపుతున్నప్పుడు ప్రజల కొనుగోలు శక్తి పెంచడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. కానీ, దెబ్బతిన్న రంగాలను వదిలేసి నష్టపోని బడా పారిశ్రామిక వేత్తలకు రూ.1.45 లక్షల కోట్లు కార్పొరేట్ ట్యాక్స్ మినహాయింపు ప్రభుత్వం ఇచ్చింది. పారిశ్రామికవేత్తలకు ఉదారంగా అప్పులు ఇవ్వమని బ్యాంకులకు ఆదేశాలు జారీ చేసింది. రిజర్వు బ్యాంక్ నుంచి వచ్చిన రూ.1.7 లక్షల కోట్లను బడా పారిశ్రామికవేత్తలకు అందుబాటులో ఉంచడానికి ప్రయత్నిస్తున్నది. ఆర్థికవ్యవస్థ పునరుద్ధరణ కోసం ఆర్థికశాస్త్రవేత్తల సూచనలు పాటించాల్సిన ప్రభుత్వం పారిశ్రామికవేత్తల సూచనలతో దేశ ప్రయోజనాలను ఫణంగా పెట్టి ఈ క్లిష్ట సమయంలో వారికి మేలుచేసే ప్రయత్నాలు చేస్తున్నది. ప్రధాని ఆర్థిక సలహాదారులు మండలం నుంచి రాతిన్‌రాయ్, శామిక రవిలను వాస్తవాలు చెప్పినందుకు తొలిగించారు. కష్టాల్లో ఉన్న ప్రజలకు చెందాల్సిన డబ్బును పారిశ్రామికవేత్తలకు ఇవ్వడం జరిగింది. 3.8 లక్షల కోట్ల ఆస్తులు కలిగిన అంబాని తదితర పెట్టుబడిదారులకు పరిశ్రమలు విస్తరించడానికి, నెలకొల్పడానికి మూలధనం కొరత లేనప్పుడు కార్పొరేట్ టాక్స్ మినహాయింపు ఇవ్వాల్సిన అవసరం ఏమొచ్చింది? వాజపేయి ప్రధానిగా ఉన్న సమయంలో మందగమనం సూచనలు వచ్చినప్పుడు జాతీయ రహదారులపైన ఖర్చుపెట్టడం జరిగింది. మన్మోహన్‌సింగ్ సమయంలో రోజ్‌గార్ యోజన పథకం ద్వారా గ్రామాలకు నిధులు తరలించడం జరిగింది. వేలాదిమందికి పనికల్పిస్తూ తెలంగాణలో ఐదు కోట్ల మందికి మంచినీటిని సరఫరా చేస్తున్న మిషన్ భగీరథకు, బీడు భూములకు నీటిని తరలిస్తున్న కాళేశ్వరం ప్రాజెక్టుకు ఒక్క పైసా ఇవ్వని ప్రభుత్వం బడా పారిశ్రామికవేత్తలకు విరివిగా సహాయం చేస్తున్నది. పారిశ్రామికవేత్తలకు ఇచ్చిన రూ.1.45 లక్షల కోట్లను, రిజర్వు బ్యాంక్ నుంచి తీసుకుంటున్న రూ.1.7 లక్షల కోట్లను దేశంలోని ఇరిగేషన్ ప్రాజెక్టులపై, రహదారుల నిర్మాణంపై, మంచినీటి పథకాలపై, వ్యవసాయరంగంపై, చిన్న పరిశ్రమల పునరుద్ధరణపై పెట్టినట్లయితే ఆర్థిక మాంద్యం నుంచి బయటపడే అవకాశాలుండేవి.

మోదీ అభిమాన మిత్రుడు డొనాల్డ్ ట్రంప్ అమెరికాలో కార్పొరేట్ టాక్స్ కట్ ప్రవేశపెడుతూ ఫలితాలు వివిధ మార్గాల్లో కార్మికులకు చేరుతాయని చెప్పాడు. కార్మికుల జీతాలు సరాసరి 4 వేల డాలర్ల వరకు జీతాలు పెరిగి ప్రతి కుటుంబం ఆదాయం 9 వేల డాలర్ల వరకు పెరుగ వచ్చని చెప్పాడు. అర్థ శాస్త్ర సిద్ధాంత ఆధారాల్లేకుండా ఇష్టం వచ్చినట్లుగా కాకి లెక్కలు చెప్పి ప్రజలను మభ్యపెట్టాడు. ట్రంప్ చెప్పినట్టుగా ఏమీ జరుగకపోగా దేశ ఆర్థికలోటు పెరిగింది. మధ్యతరగతి ప్రజలు సగటున నాలుగు వేల డాలర్లు ఎక్కువగా టాక్స్ చెల్లించారు. పన్ను మినహాయింపు వల్ల లాభం పొందినవాళ్ల నుంచి ఇప్పుడు ఎన్నికల నిధులను వసూలు చేస్తున్నాడు. అమెరికా అనుభవం చెప్పేదేమంటే బడా పారిశ్రామిక వేత్తలకు చేసే సహాయం ఎన్నికల్లో నిధుల సమీకరణకు ఉపయోగించుకోవడం. పారిశ్రామిక పునరుద్ధరణకు టాక్స్ మినహాయింపు ఇచ్చామని నిర్మలా సీతారామన్ చెప్పేవన్నీ కట్టుకథలే.

> దేశ ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలకే అత్యంత ప్రాధాన్యం ఇచ్చే మోదీ తాత్త్విక ఆలోచనల్లోనే లోపం ఉన్నది. 2015లో వ్యవసాయదారుల భూమి హక్కును హరించడానికి ప్రయత్నించి విఫలమయ్యాడు. 2016, నవంబర్‌లో ప్రజల డబ్బును బలవంతంగా బ్యాంకుల్లో సమీకరించే విషయంలో విజయం సాధించాడు. జీఎస్టీ ప్రవేశపెట్టి ట్రాక్టర్ టైర్లపై కూడా 18 శాతం టాక్స్ విధించి రైతుపై అదనపు భారాన్ని మోపాడు. ప్రజల దగ్గర డబ్బులను తీసుకొని పారిశ్రామికవేత్తలకు అందుబాటులో ఉంచడానికి ప్రయత్నించడం ప్రజాస్వామ్యవ్యవస్థలో ఊహించని విషయం. కుహనా పారిశ్రామికవేత్తల ప్రయోజనాల కోసం ఇంతగా తహతహలాడే ప్రధాని దేశ చరిత్రలో లేడు.

మేక్ ఇన్ ఇండియా పథకం నినాదంగా మాత్రమే మిగిలిపోయింది. ప్రతి భారతీయుడు సగటున రూ.6 వేల విలువైన చైనా వస్తువులను ప్రస్తుతం వాడుతున్నాడు. 2014లో ఈ వాడకం రూ.3 వేలు మాత్రమే ఉండేది. భార త ఉత్పత్తిరంగం బలహీనపడి చైనా, అమెరికా మధ్య జరుగుతున్న వాణిజ్య యుద్ధాన్ని ఉపయోగించుకునే పరిస్థితిలో లేదు. చాలా వెనుకబడిన దేశాలైన బంగ్లాదేశ్, వియెత్నాం దేశాలు ఎక్కువగా వస్తువులను అమెరికాకు ఎగుమతి చేస్తున్నాయి.

దేశ ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలకే అత్యంత ప్రాధాన్యం ఇచ్చే మోదీ తాత్త్విక ఆలోచనలలోనే లోపం ఉన్నది. 2015లో వ్యవసాయదారుల భూమి హక్కును హరించడానికి ప్రయత్నించి విఫలమయ్యాడు. 2016, నవంబర్‌లో ప్రజల డబ్బును బలవంతంగా బ్యాంకుల్లో సమీకరించే విషయంలో విజయం సాధించాడు. జీఎస్టీ ప్రవేశపెట్టి ట్రాక్టర్ టైర్లపై కూడా 18 శాతం టాక్స్ విధించి రైతుపై అదనపు భారాన్ని మోపాడు. ప్రజల దగ్గర డబ్బులను తీసుకొని పారిశ్రామికవేత్తలకు అందుబాటులో ఉంచడానికి ప్రయత్నించడం ప్రజాస్వామ్య వ్యవస్థలో ఊహించని విషయం. కుహనా పారిశ్రామికవేత్తల ప్రయోజనాల కోసం ఇంతగా తహతహలాడే ప్రధాని దేశ చరిత్రలో లేడు. మోదీ విధానాలు పేద, ధనిక వర్గాల మధ్య అంతరాన్ని పెంచుతూ, మధ్యతరగతి వర్గాన్ని పేదరికంలోకి నెట్టుతూ, మత భావాలను రెచ్చగొడుతూ, పారిశ్రామికవర్గాలకు మేలు చేకూరుస్తున్నాయి. యువతను నిరుద్యోగంలోకి నెట్టిన ఆర్థికమాంద్యం రాజకీయాల్లో కూడా పెను మార్పులను తీసుకొస్తుంది.

**(వ్యాసకర్త: రాజకీయ విశ్లేషకులు, వాషింగ్టన్ డీసీ)**

# జమ్మిచెట్టు ప్రాశస్త్యం

సందర్భం

**రవికాంత్ మోతి**

జమ్మిచెట్టు దసరా నవరాత్రుల్లో గుర్తుకువచ్చే చెట్టు. వాడుక భాషలో జమ్మిచెట్టుగా పిలుచుకునే ఈ చెట్టును శమీ వృక్షం అని సంస్కృతంలో పిలుచుకుంటాం. శమీ వృక్షానికి దసరా పండుగకు ప్రశస్థమైన విశేషం ఉన్నది. వైదిక భాషలో 'అరణి' అని పిలుస్తారు. అరణి అంటే అగ్నిని ఉద్భవించేందుకు కాష్ఠాంతరించే మధింపజేయడానికి యోగ్యమైన దారువని అర్థం. అందుకే పురాణ కాలం నుంచి శమీ వృక్షం పూజ్యనీయమైనది.

జమ్మిచెట్టు వేలాడే శాఖలతో, ముళ్లతో కూడిన మధ్యరకంగా పెరిగే వృక్షం. జమ్మి పత్రాలు సన్నగా దీర్ఘవృత్తాకారంగా గురు అగ్రంతో పత్రకాలున్న ద్విపిచ్ఛకార సంయుక్త పత్రాలుంటాయి. ఈ చెట్టుకు సన్నటి పొడుగాటి కంకులతో అమర్చబడిన పసుపురంగు పుష్పాలుంటాయి. జమ్మిచెట్టును విజయదశమి రోజున తప్పక దర్శనం చేసుకుంటారు.

శమీపూజ ఎప్పుడు మొదలైందో తెలియదు కానీ 'అర్జునస్య ధనుర్ధారీ.. రామస్య ప్రియదర్శనం' అని పురాణాల ప్రకారం శ్రీరాముడు విజయదశమి రోజున 'అపరాజితా' దేవిని పూజించి రావణుని సంహరించి, విజయం పొందాడు. రాముడు, రావణాసురుడి పది తలలు చూసి భీతిల్లి నిద్రించిన శక్తిని పూజించగా, ఆమె మేల్కొని శ్రీరాముని పూజలందుకొని శ్రీరామునికి విజయాన్ని కలుగుజేసింది. శ్రీరాముడు శక్తిని మేల్కొలిపిన సమయం ఆశ్వీయుజ శుక్ల పాఢ్యమి. నాటినుంచి పదో రోజు శ్రీరాముడు సంపూర్ణ విజయాన్ని పొంది పుష్పక విమానమెక్కి అయోధ్యకు బయల్దేరాడు. అలా బయల్దేరే ముందు శమీ వృక్షాన్ని పూజించాడు. అందువల్లనే దేవీ నవరాత్రుల ఉత్సవాలను జరిపి, విజయదశమినాడు అందరూ శమీపూజ చేయడమనేది ఆనవాయితీగా వస్తున్నది. మహాభారతంలో కూడా పాండవులు పన్నెండేండ్ల అరణ్యావాసం పూర్తి చేసుకొని అజ్ఞాతవాసానికి వెళ్లే ముందు తమ ఆయుధాలను జమ్మిచెట్టు మీద దాచిపెట్టి, విరాటరాజు వద్ద కొలువుకు వెళ్లారు. ఏడాది తర్వాత తిరిగివచ్చి ఆ ఆయుధాలను ధరించి అర్జునుడు గో గ్రహణంలో కౌరవులపై విజయం సాధించాడు. శమీవృక్ష రూపంలో ఉన్న అపరాజితా దేవి తనను వేడిన వారికి సదా విజయాన్నందిస్తుందని, అందుకే శమీ వృక్షానికి ప్రాముఖ్యం. విజయద శమి నాటి ఆయుధపూజ వెనుక ఆంతర్యమూ ఇదే! జమ్మిచెట్టు ఆకులనే శమీ పత్రం అంటారు. విజయ దశమి రోజున సాయంత్రం నక్షత్ర దర్శన సమయాన జమ్మిచెట్టుకు పూజలు చేసి

**'శమీ శమయతే పాపం శమలోహిత కంటకా**
**ధారిణ్యర్జున బాణానాం రామస్య ప్రియవాదినీ**
**కరిష్యమాణ యాత్రాయాం, యధాకాల సుఖంమతా**
**తత్ర నిర్విఘ్న కర్త్రీత్వం భవ శ్రీరామ పూజితే॥'**

అనే శ్లోకం పఠించి, రాసుకున్న చిట్టీని ఆ చెట్టు కొమ్మలకు తగిలిస్తారు. ఇలా చేయడం వల్ల అమ్మవారి కృపతో పాటు, శని దోష నివారణ కూడా జరుగుతుందని ప్రతీతి. ఎందుకంటే జమ్మిచెట్టు శనీశ్వరునికి ప్రతీక. అనంతరం శమీ పత్రాలను తీసుకువచ్చి పెద్దల చేతిలో పెట్టి, పాదాభివందనం చేసి ఆశీర్వాదాలు తీసుకోవడం కూడా ఆనవాయితీ. తెలంగాణలో జమ్మి దర్శనం అనంతరం పాలపిట్టను దర్శించుకోవడం ఆచారం.

అంతేకాకుండా జమ్మిచెట్టు అనేక ఔషధాలకు ఉపయోగపడుతుంది. కాబట్టి ఈ చెట్టుకు సురభి బంగారం అని పేరు కూడా వచ్చింది. దేవతా ప్రతీక అయినా జమ్మిచెట్లను ప్రతి దేవాలయ ప్రాంగణంలో ఉండేవిధంగా ప్రభుత్వం కృషిచేయాలి. అప్పుడే భావితరాలకు జమ్మిచెట్టు విశిష్టత తెలుస్తుంది.

**(వ్యాసకర్త: సేఫ్‌ఎర్త్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు)**

# ప్రజల సౌకర్యమే ముఖ్యం

విశ్లేషణ

**త్రిగుళ్ల సాకేత రామశర్మ**

మా పని అనుకొని అంకితభావంతో పనిచేసే అతి కొద్దిమంది ప్రభుత్వ ఉద్యోగులకు ఈ వ్యాసం వర్తించదు!

మాకు జీతాలు పెంచాలి, ఇంక్రిమెంట్లు కావాలి, పీఆర్‌సీలు కావాలి, ఫిట్‌మెంట్లు కావాలి, అలవెన్సులూ కావాలనే ప్రభుత్వ ఉద్యోగులు ప్రైవేట్ రంగానికి దీటుగా మీ ప్రభుత్వరంగం ఎందుకు పనిచేయదనే దానికి సమాధానం చెప్పాలి.

సమ్మె చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు ప్రైవేట్‌రంగానికి దీటుగా లాభాలు ఎందుకు తేలేకపోతున్నారు? వారిని ప్రశ్నించొద్దు. అలా ప్రశ్నిస్తే బస్సులకు బ్రేకులు వేస్తారు.

ప్రైవేట్‌రంగంలో పది నుంచి ఇరువై వేల సగటు జీతం తీసుకొని వందకు వంద మార్కులు స్టేట్ ఫస్ట్ తెప్పిస్తున్న ప్రైవేట్ ఉపాధ్యాయుల కంటే ఎన్నో రెట్ల జీతాలు తీసుకొని పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు కనీస పోటీ ఇయ్యలేకపోతున్నారనేది జగమెరిగిన సత్యం. అయినా వారికి అన్ని కావాలి. లేకుంటే ప్రభుత్వంపై లేనిపోని నిందారోపణలు చేస్తారు. పెట్టిన్నాడు పాలభిషేకాలు చేస్తారు. చేయనినాడు కాలనాగులై కాటేస్తారు.

ఇక రెవెన్యూ రంగంలో ఎన్ని అవకతవకలు జరిగినా వారిని ఏం అనొద్దు. ఒక రైతు ఏండ్లకొద్ది, చెప్పులరిగేలా తిరిగినా ఆ రైతు పని కాదు. అయినా రెవెన్యూ ఉద్యోగులకు జేజేలు కొట్టాలి. పీజీ చదువుకున్న రైతు తన భూమికి సంబంధించిన వివరాలు అతని పాస్ పుస్తకంలో ముద్రించేలా చేసుకోవాలంటే రెవెన్యూ ఉద్యోగుల కాళ్లు, గడ్డాలు పట్టుకోవాలి. అదీచాలకుంటే ఎంతోకొంత ముడుపులు అప్పజెప్పాలి. ఇలా అటెండర్ నుంచి ఆఫీసర్ దాకా అందరి జేబులూ తడుపాలి. అప్పుడు గాని ఫైల్ ముందుకు కదులదు. ఈ లోపు సదరు ఉద్యోగికి కోపం వస్తే ఆ రైతు పొలం రాత్రికిరాత్రే ఏ మల్లయ్య పాస్‌బుక్‌లనో, ఏ పుల్లయ్య పాస్‌బుక్‌లనో ఎక్కుతుంది. అయినా వారిని అందలం ఎక్కియ్యాలి. లేకుంటే ప్రభుత్వ అధినేత కర్కోటకుడు, కాలకూట విషం చిమ్మినవాడి కిందే లెక్క.

ఇలా.. ఒక ఆర్టీసీ, ఒక రెవెన్యూ, ఒక విద్యారంగం ఒక రవాణా రంగం కాదేదీ ప్రక్షాళనకు అనర్హం. అయినా వారిని పనిచేయమనొద్దు, చేయనివారికి శిక్షలు పడేలా, గాడినపెట్టేలా చట్టాలు తేవొద్దు. చర్యలు తీసుకోవద్దు. అలాచేస్తే అది నేరం, ఘోరం, అమానవీయం, కర్కశత్వం, అప్రజాస్వామికం. అలాచేసే నాయకుడు, ప్రజల ఇబ్బందులను తొలి గిద్దాం అనుకొని నడుం బిగించే నాయకుడు ఆ ప్రభు త్వ ఉద్యోగుల దృష్టిలో ఒక నియంత.

అయినా ఏం ఫర్వాలేదు. లక్షల్లో ఉండే ఉద్యోగులను పనిచేసే దిశగా తీసుకుపోవాలి. కఠినమైన చర్యలు తీసుకుంటే ఉద్యోగులకు కోపం వచ్చి కన్నెర్ర చేసినా సరే, కఠిన చట్టాలు తెచ్చి వారిని గాడిలో పెట్టాలి. వారిని సక్రమంగా పనిచేయించిన నాయకునికి, ఆ ప్రభుత్వరంగ ఉద్యోగుల వల్ల ఇబ్బందులు పడుతున్న కోట్లాది మంది సామాన్య ప్రజల మద్దతు ఎప్పుడూ ఉండనే ఉంటుంది!

ప్రజాస్వామ్య దేశంలో ప్రభుత్వాలు, ప్రభుత్వ రంగ ఉద్యోగులు శాశ్వతం కాదు. అంతిమంగా సామాన్య ప్రజల ప్రయోజనాలే ముఖ్యం. ఆ ప్రజల ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇచ్చిన నాయకుడే ప్రజా నాయకుడు అవుతాడు. ఆ నాయకుడే ప్రజల మద్దతు చూరగొంటాడు.

**జనగళం**

# విజయాల దసరా

**దసరా పండుగ వచ్చింది**
పల్లె జనులతో నిండింది
కష్టసుఖాలు ముచ్చటించింది
చిన్నారులు సంబురంతో చిందులేశారు
బాల్యస్నేహంతో పల్లె మురిసింది
డప్పుల మోత మోగింది
నృత్యకేళితో జనసంద్రం నడిచింది
జమ్మి వృక్షం వద్దకు తరిలారు
ఆయుధపూజలు ఎన్నో చేశారు
పసిడి జమ్మిని జేబులో దాచారు
కొండ కోన ఎక్కి తిరిగారు
పాలపిట్టయంటూ అరిచారు
అరుపులు కేకలతో పరవశించారు
ప్రకృతి అందాలతో కలిసిపోయారు
పసిడి కొమ్మలు చేతబట్టారు



పరుగుల పోటీతో ఇళ్లు చేరారు
పెద్దలందరికి జమ్మి పెట్టి నమస్కరించారు
విజయోస్తంటూ దీవెనలొందారు
విందు వినోదాలతో దసరా గడిపారు
విజయదశమి శుభాలుగా నింపారు
మధుర స్మృతులు మదిన దాచారు
విజయాల దసరాకు జైజైలు పలికారు.

**– ఉండ్రాల రాజేశం, 9966946084**

**ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా:** 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@ntnews.com Fax-040-23291118

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.

epaper.ntnews.com



మహిషాసురమర్దిని అలంకరణలో భద్రకాళి







సిద్ధి ధాత్రి దేవి అలంకరణలో జోగుళాంబ, వేములవాడలోని రాజరాజేశ్వరీ అమ్మవారు, బాసర సరస్వతి మాత



మహాలక్ష్మి అలంకారంలో దర్శనమిస్తున్న భద్రాచలంలోని లక్ష్మీతాయారు అమ్మవారు

## మహిషాసురమర్దినిగా భద్రకాళి

**నమస్తేతెలంగాణ నెట్‌వర్క్:** దేవీ నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా చివరి రోజైన సోమవారం వరంగల్ శ్రీభద్రకాళి అమ్మవారిని మహిషాసురమర్దినిగా అలంకరించారు. అలంపూర్ జోగుళాంబ, బాసర శ్రీజ్ఞాన సరస్వతీ, వేములవాడ శ్రీపార్వతీ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు సిద్ధి ధాత్రి దేవిగా దర్శమిచ్చారు. భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం సన్నిధిలో లక్ష్మీతాయారు అమ్మవారిని శ్రీమహాలక్ష్మిగా అలంకరించారు.






● వేములవాడలో వైభవంగా తెప్పోత్సవం



శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా వేములవాడలోని శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో 9 రోజులపాటు విశేష పూజలందుకున్న అమ్మవారు సోమవారం ధర్మగుండంలో తెప్పపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ధర్మగుండంలో ప్రత్యేకంగా పూలతో అలంకరించిన వాహనంపై స్వామి, అమ్మవారి ఉత్సవ విగ్రహాలను ఉంచి ధర్మగుండంలో ప్రదక్షిణలు చేయించారు. - వేములవాడ కల్చరల్

# ఆగని ప్రయాణం

### మూడోరోజూ సాఫీగా సాగిన రాకపోకలు.. 50 శాతానికిపైగా రోడ్డెక్కిన ఆర్టీసీ బస్సులు

### రాష్ట్రంలోని అన్ని బస్టాండ్లలో కనిపించిన ప్రయాణికుల రద్దీ



సోమవారం హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్‌లో ప్రయాణికుల రద్దీ

- విధుల్లో ఆరువేల మందికిపైగా తాత్కాలిక సిబ్బంది
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో కనిపించని సమ్మె ప్రభావం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ/నెట్‌వర్క్:** ఆర్టీసీ సమ్మె ప్రభావం ప్రయాణికులపై పడకుండా అధికార యంత్రాంగం తీసుకున్న ప్రత్యామ్నాయ చర్యలు సత్ఫలితాలిస్తున్నాయి. సమ్మె మూడో రోజైన సోమవారం కూడా రాష్ట్రవ్యాప్తంగా బస్సులు యథావిధిగా నడిచాయి. మొదటి రెండ్రోజులు తలెత్తిన చిన్నచిన్న సమస్యలను సైతం అధికారులు అధిగమించారు. పకడ్బందీ ఏర్పాట్లు చేయడంతో అధికశాతం మంది దసరా సమయంలో ప్రశాంతంగా ఇండ్లకు చేరుకున్నారు. రవాణా శాఖ మంత్రి అజయ్‌కుమార్ అధికారులతో ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించారు. హైదరాబాద్‌లో మెట్రో, ఎంఎంటీఎస్ సర్వీసులు అదనం గా నడిపి రవాణా ఇక్కట్లను నివారించారు. రాష్ట్రవ్యాప్తంగా 50శాతానికిపైగా ఆర్టీసీ బస్సు లు తిరిగినట్టు అధికారులు తెలిపారు. ఆరువేల మందికిపైగా తాత్కాలిక డ్రైవర్లు, కండక్టర్లు ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేశారు. ప్రతి డిపోలో ప్రస్తుతమున్న డ్రైవర్ల కంటే అదనంగా 20 మందిని అధికారులు రిజర్వులో ఉంచారు. రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో సెవన్‌సీటర్ ఆటోలను అందుబాటులోకి తెచ్చా రు. వాటికి తాత్కాలిక పర్మిట్లు జారీ చేశారు. ప్రైవేట్ ట్రావెల్స్, వివిధ సంస్థల బస్సులను ఆయా రూట్లలో పంపిస్తున్నారు. ప్రధానంగా ఏసీ బస్సులు, లగ్జరీ సర్వీసులను దూర ప్రాంతాలకు నడుపుతున్నారు. అన్నిరూట్లలో బస్సులు నడుస్తుండటంతో సమ్మె ప్రభావం కనిపించడం లేదు. ప్రయాణికులు ఇబ్బందులు పడటం లేదు. రవాణాశాఖ ఆధ్వర్యంలో డిపోల పరిధి లో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్‌లను కొనసాగిస్తున్నారు. దసరా సందర్భంగా సెలవులు లేకుండా రవాణాశాఖ అధికారులు, సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రజారవాణా వ్యవస్థను మరింత మెరుగు పరిచే దిశలో రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉన్నదని మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, టీఎస్‌ఆర్టీసీ ఎండీ, ఆర్‌అండ్‌బీ ముఖ్య కార్యదర్శి సునీల్‌శర్మ తెలిపారు. 3,105 ఆర్టీసీ బస్సులు, 2,013 అద్దె బస్సులతోపాటు ప్రైవేట్ వాహనాలు, స్కూలు, కాలేజీ బస్సులు, మ్యాక్సీ క్యాబ్స్ మరో ఆరువేలకుపైగా నడిపి ప్రయాణికులను గమ్యస్థానాలకు తరలించినట్టు పేర్కొన్నారు.

**కరీంనగర్ రీజియన్‌లో..**

కరీంనగర్ రీజియన్‌లో సోమవారం 302 ఆర్టీసీ బస్సులు, 203 అద్దె బస్సులు నడిచాయి. 57 స్కూల్ బస్సులు, 43 కాంట్రాక్టు క్యారియర్లు తిరిగాయి. మహబూబ్‌నగర్ జిల్లాలో 53 ఆర్టీసీ, 32 హైర్, 30 ప్రైవేట్ బస్సులు నడిచాయి. 53 మంది డ్రైవర్లు, 75 మంది కండక్టర్లు 14 వేల మందికిపైగా ప్రయాణికులను గమ్యాలకు తరలించారు. నల్లగొండ జిల్లాలోని నాలుగు డిపోల పరిధిలో 283 బస్సులు నడిపారు. సుమారు 40 వేలమందిని గమ్యస్థానాలకు తరలించారు. సూర్యాపేట డిపోలో 111 బస్సులకుగాను 110 నడువగా వీటిలో 65 ప్రభుత్వ, 45 ప్రైవేట్ బస్సులు ఉన్నాయి. కోదాడ డిపోలో 83 ఆర్టీసీ, ఇతర ప్రైవేట్, 27 స్కూల్ బస్సులు, యాదగిరిగుట్ట డిపో పరిధిలో 34 ఆర్టీసీ, 15 అద్దె, 12 ప్రైవేట్ స్కూల్ బస్సులు తిరిగాయి.

**మెదక్ రీజియన్‌లో..**

మెదక్ రీజియన్‌లో ఎనిమిది డిపోల పరిధిలో 672బస్సులకుగాను 502బస్సులు నడిచాయి. 332ఆర్టీసీ, 170 హైర్ బస్సులు తిరిగాయి. నిజామాబాద్ రీజియన్‌లో 366 బస్సులను నడిపించారు. ఇందులో 184 ఆర్టీసీ, 182 హైర్ బస్సులు ఉన్నాయి. 184 మంది డ్రైవర్లు, అంతేసంఖ్యలో కండక్టర్లు విధులు నిర్వహించారు. ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా 324 బస్సుల ద్వారా 50 వేల మంది ప్రయాణికులు గమ్యస్థానానికి చేరుకున్నారు.

**వరంగల్ రీజియన్‌లో..**

వరంగల్ రీజియన్‌లో 942 బస్సులు ఉండగా, 505 బస్సులను నడిపించారు. మహబూబాబాద్ జిల్లాలో 106 బస్సులు తిరిగాయి. వనపర్తి డిపో నుంచి 55 ఆర్టీసీ, 24 అద్దె బస్సులు నడిపారు. ఖమ్మం డివిజన్‌లోని ఖమ్మం డిపోలో 46 ఆర్టీసీ, 56 అద్దె బస్సులు, మధిర డిపో నుంచి 30 ఆర్టీసీ, 20 అద్దె బస్సులు, సత్తుపల్లి డిపో నుంచి 65 ఆర్టీసీ, 36 అద్దె బస్సులను తిప్పారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కొత్తగూడెం డిపోలో 43 ఆర్టీసీ, 43 హైర్, మణుగూరులో 48 ఆర్టీసీ, 48 హైర్, భద్రాచలం డిపోనుంచి 54 ఆర్టీసీ, 54 హైర్ బస్సులు నడిచాయి. నిర్మల్ జిల్లావ్యాప్తంగా 50 ఆర్టీసీ, 78 అద్దె బస్సులు, 70 క్యాబ్‌లు, 10 ఇతర వాహనాలు నడిచాయి. పరిగి డిపోలో 87 బస్సులకుగాను 49 బస్సులు, వికారాబాద్ డిపోలో 82 బస్సులకు 25 ఆర్టీసీ, 20 ప్రైవేటు బస్సులు, తాండూరు డిపోలో 93 బస్సులకుగాను 59 సర్వీసులను వివిధ రూట్లలో నడిపించారు.



కరీంనగర్ బస్టాండ్‌లో బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు



ఆదిలాబాద్ బస్టాండ్‌లో ప్లాట్‌ఫారాలపై సిద్ధంగా ఉన్న బస్సులు



వికారాబాద్ జిల్లా పరిగి నుంచి బస్సులో వెళ్తున్న ప్రయాణికులు



సోమవారం వనపర్తిలోని నల్లచెరువును పరిశీలిస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

## నల్లచెరువును పూర్తిస్థాయిలో నింపాలి

### మినీ ట్యాంక్‌బండ్ పనులను పరిశీలించిన మంత్రి నిరంజన్‌రెడ్డి

**వనపర్తి, నమస్తే తెలంగాణ:** వనపర్తి జిల్లా కేంద్రం నడిబొడ్డున ఉన్న నల్లచెరువు (మినీ ట్యాంక్‌బండ్) పూర్తిస్థాయిలో నిండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆదేశించారు. 17 రోజులుగా చెరువులోకి వస్తున్న నీటిని సోమవారం ఆయన టీఆర్‌ఎస్ నాయకులతో కలిసి పరిశీలించారు. గతంలో వర్షాలు పడితేనే నల్లచెరువుకు నీళ్లు వచ్చేవని, ప్రస్తుతం కృష్ణాజలాలను తరలిస్తున్నట్టు మంత్రి తెలిపారు. కొంతకాలంగా మినీ ట్యాంక్‌బండ్‌పై జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో టీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు గట్టుయాదవ్, మాజీ కౌన్సిలర్ పాకనాటి కృష్ణయ్యతదితరులు పాల్గొన్నారు.

## మాది పేదల ప్రభుత్వం



కేఎల్‌ఐ నీటిలో పూలు చల్లి పూజలు చేస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే ఆల

- ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- రాచాల చెరువుకు కేఎల్‌ఐ నీటి విడుదల

**అడ్డాకుల:** రాష్ట్రాన్ని పాలిస్తున్నది పేదల ప్రభుత్వమని ఎక్సైజ్ శాఖ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకుల మండలం రాచాల గ్రామంలో కందూరు పెద్దవాగు నుంచి వస్తున్న కేఎల్‌ఐ నీటిని రాచాల పెద్ద చెరువుకు మంత్రి శ్రీనివాస్‌గౌడ్, దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సోమవారం నీటిని విడుదల చేసి పూజలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పక్కనుంచే ప్రవహిస్తున్న పెద్దవాగు నుంచి నీటిని తీసుకుని రాచాల చెరువు నింపాలనే ఆలోచన 75 ఏండ్లు పాలించిన నాయకులకు ఎందుకు రాలేదని ప్రశ్నించారు. గతేడాది ఎమ్మెల్యే, మంత్రి నిరంజన్‌రెడ్డి, తాను కలిసి కేఎల్‌ఐ నీటిని తీసుకొచ్చి పెద్దవాగులో పారించామని గుర్తుచేశారు. ప్రస్తుతం ప్రతి గ్రామంలోని చెరువులను నీటితో నింపుతున్నామని వివరించారు.

● సొంతూర్లో మంత్రి ఎర్రబెల్లి ఆత్మీయ పలుకరింపు



అక్కా.. బాగున్నవా?, తమ్మీ.. ఎట్లున్నవే?, అన్నా ఆరోగ్యం బాగున్నదా?.. అంటూ పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తన ఊరోళ్లను ఆత్మీయంగా పలుకరించారు. సోమవారం ఆయన తన స్వగ్రామమైన వరంగల్ రూరల్ జిల్లా పర్వతగిరిలో ఇంటింటికి వెళ్లారు. చిన్ననాటి మిత్రులను, గ్రామస్థులను కలిసి ఆప్యాయంగా పలుకరిస్తూ కలియతిరిగారు. వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. - పర్వతగిరి



మూసీ గేటు ఊడిన ప్రాంతం నుంచి దిగువకు వెళ్తున్న నీరు. (ఇన్‌సెట్‌లో) తిరుపతి కల్యాణి డ్యామ్ నుంచి మంగళవారం ఉదయానికి మూసీ ప్రాజెక్టుకు చేరుకోనున్న గేట్లు

## ఆగమేఘాల మీద..

### మూసీ గేటు బిగించేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు

**సూర్యాపేట రూరల్:** మూసీ నీటి ఉధృతితో ప్రాజెక్టు ఐదోనంబర్ రెగ్యులేటరీ గేట్ ఊడిపోవడంతో విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి వెంటనే స్పందించడం, విషయాన్ని మరుక్షణమే సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లడంతో 36 గంటల్లోనే డ్యాం వద్దకు కొత్త గేట్లు చేరనున్నాయి. ఊడిన గేటు 4 మీటర్ల ఎత్తు, 40 ఫీట్ల వెడల్పు ఉండగా తిరుపతి కల్యాణి డ్యామ్ వద్ద నుంచి తీసుకొచ్చేవి 0.6, 0.4 మీటర్ల ఎత్తు అంటే మొత్తం మీటరు ఎత్తు గల రెండు గేట్లతో మూసీ డీఈ నవికాంత్ అక్కడి నుంచి కంటెయినర్‌లో సోమవారం బయలుదేరగా మంగళవారం ఉదయం వరకు మూసీకి తీసుకురానున్నారు. మిగిలిన 3 మీటర్ల ఎత్తులో ఉండే గేట్లను హైదరాబాద్‌లో తయారుచేస్తుండగా పనులు పూర్తికావచ్చినట్టు అధికారులు పేర్కొన్నారు. ఆ గేట్లు కూడా మంగళవారం ప్రాజెక్టుకు చేరే అవకాశం ఉండటంతో అన్నింటితో కలిపి 4 మీటర్ల ఎత్తుగల గేటు తయారు చేసి పాత గేటు స్థానంలో బిగించి నీటి లీకేజీని అరికట్టనున్నారు.

**14వేల క్యూసెక్కులు దిగువకు**

**కేతేపల్లి:** మూసీ ప్రాజెక్టు గేటు ఊడిపోవడంతో మూడోరోజైన సోమవారం కూడా దిగువకు నీటి ప్రవాహం కొనసాగింది. దీంతో ప్రాజెక్టు నీటిమట్టం క్రమంగా తగ్గుతున్నది. ఊడిపోయిన గేటు ద్వారా ప్రస్తుతం 14 వేల క్యూసెక్కులకుపైగా నీరు దిగువ మూసీలోకి వృథాగా వెళ్తున్నట్టు ఏఈ మమత తెలిపారు. ప్రాజెక్టు నీటిమట్టం సోమవారం సాయంత్రానికి 635 అడుగులు (2.10 టీఎంసీలు)గా ఉన్నది. శనివారం సాయంత్రం గేటు ఊడిపోగా ఇప్పటి వరకు 10 అడుగుల (2.35 టీఎంసీలు) నీరు దిగువకు వృథాగా వెళ్లింది.

## పల్లె ప్రగతిపై సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టి

### దళిత సంక్షేమశాఖ మంత్రి ఈశ్వర్



ధర్మపురి క్షేత్రంలో శమీపూజ షెడ్డును ప్రారంభిస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

**ధర్మపురి, నమస్తేతెలంగాణ:** గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టి సారించారనీ, అందులో భాగంగానే 30రోజుల కార్యాచరణ ప్రణాళికను రాష్ట్రంలోని 12,400 గ్రామాల్లో పకడ్బందీగా అమలుచేసి వందశాతం విజయవంతం చేసినట్టు దళిత సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ తెలిపారు. సోమవారం జగిత్యాల జిల్లా ధర్మపురి క్షేత్రంతోపాటు మండలంలోని బూరుగుపల్లిలో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ధర్మపురి క్షేత్రంలోని శమీవృక్షం వద్ద భక్తుల సౌకర్యార్థం రూ. 20 లక్షలతో నిర్మించిన షెడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనతోపాటు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడం కోసం సీఎం కేసీఆర్ అనేక చర్యలు చేపట్టారన్నారు. ముఖ్యంగా 30 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేయడంతో గ్రామాల రూపురేఖలు మారిపోయాయని, 12,400 గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రత వెల్లివిరిస్తున్నదని, ఎన్నో ఏండ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలకు పరిష్కార మార్గం దొరికిందని మంత్రి తెలిపారు. ఈ ప్రణాళిక దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు.



జెనీవా సదస్సులో దర్రీ రాట్నంపై నూలు వడుకుతున్న కేంద్రమంత్రి స్మృతి ఇరానీ. చిత్రంలో వరంగల్ కొత్తవాడకు చెందిన చేనేత కార్మికుడు పిట్ట రాములు ఉన్నారు.

## జెనీవా సదస్సులో వరంగల్ నేతన్న

- ‘వరల్డ్ కాటన్ డే’లో పాల్గొన్న కొత్తవాడ చేనేత కార్మికుడు
- దేశం తరఫున నూలు వడికిన కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ

**పోచమ్మమైదాన్ (వరంగల్):** ‘వరల్డ్ కాటన్ డే’ సందర్భంగా స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో సోమవారం జరిగిన సదస్సులో వరంగల్ నగరంలోని కొత్తవాడ చేనేత కార్మికులకు ప్రత్యేక గుర్తింపు లభించింది. తెలంగాణలో చేనేత ఉత్పత్తుల తయారీలో భాగమైన నూలు వడికే దర్రీ రాట్నంను దేశం తరఫున ప్రదర్శించారు. వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్ (డబ్ల్యూటీవో) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సదస్సుకు దేశం నుంచి కొత్తవాడకు చెందిన జాతీయ చేనేత అవార్డు గ్రహీత పిట్ట రాములు వెళ్లారు. నూలు వడికె రాట్నాన్ని అక్కడికి తీసుకెళ్లాడు. సదస్సుకు కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూలుతో భారత్‌లో తయారు చేస్తున్న వస్త్రాలతోపాటు కొత్తవాడలోని ఉత్పత్తులైన దర్రీస్, బెడ్‌షీట్ల గురించి వివరించారు.

## భద్రాద్రిలో భారీ వర్షం

- రాజన్న సిరిసిల్ల జిల్లాలో పిడుగుపాటుకు రైతు మృతి
- గ్రేటర్ హైదరాబాద్‌లో జల్లులు

**నమస్తే తెలంగాణ నెట్‌వర్క్:** ఉపరితల ఆవర్తన ప్రభావంతో సోమవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో భారీగా, రంగారెడ్డి జిల్లాలో ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురువగా, గ్రేటర్ హైదరాబాద్‌లోని పలుచోట్ల జల్లులు పడ్డాయి. రాజన్న సిరిసిల్ల జిల్లాలో పిడుగుపాటుకు రైతు మరణించాడు. అత్యధికంగా పాల్వంచలో 3 సెం.మీ. వర్షపాతం నమోదైంది. ఆళ్లపల్లి మండలంలో పిడుగుపాటుకు పది మేకలు చనిపోయాయి. రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలంలో భారీ వర్షం పడింది. రామన్నపేటలో రైతు పోతురాజు లచ్చయ్య (60) పొలం పనులు చేస్తుండగా పిడుగుపాటుకు మరణించారు. మూడు మేకలు మృ త్యువాతపడ్డాయి. రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని మాల్, యాచారం, మేడిపల్లి, మల్కీజ్‌గూడ, తమ్మలోనిగూడ తదితర గ్రామాల్లో సోమవారం ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. గ్రేటర్‌లోని కాప్రా, కుషాయిగూడ, చెర్లపల్లి, ఎర్రగడ్డ, రహ్మత్‌నగర్, బోరబండ తదితర ప్రాంతాల్లో తేలికపాటి వర్షం కురిసింది.

**48 గంటల్లో రాష్ట్రంలో వర్షాలు**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రాగల 48 గంటల్లో తెలంగాణలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వానలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

## ‘కృష్ణ’కు పెరిగిన ఇన్‌ఫ్లోలు

### శ్రీరాంసాగర్‌కు 29,630 క్యూసెక్కుల వరద



శ్రీరాంసాగర్ జలాశయం

**హైదరాబాద్/జోగుళాంబ గద్వాల జిల్లా ప్రతినిధి/నందికొండ/మెండోరా/భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** కృష్ణా బేసిన్‌లో ఇన్‌ఫ్లోలు మళ్లీ పెరిగాయి. ఆల్మట్టికి 57 వేలు, నారాయణపురకు 80 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. సోమవారం సాయంత్రం వరకు జూరాలకు ఇన్‌ఫ్లో 28 వేల క్యూసెక్కులుగా ఉన్నది. తుంగభద్రకు 44 వేల క్యూసెక్కులకు పైగా ఇన్‌ఫ్లో వస్తుండటంతో 12 స్పిల్ గేట్ల ద్వారా నీటిని వదులుతున్నారు. శ్రీశైలానికి 25 వేలపైచిలుకు క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో, సాగర్‌కు పదివేల క్యూసెక్కులకుపైగా ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో నమోదవుతున్నది. గోదావరి బేసిన్‌లోనూ వరద కాస్త పెరిగింది. నిజామాబాద్ జిల్లా మెండోరా మండలం పోచంపాడ్‌లోని శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌కు 29,630 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నది. శ్రీరాజరాజేశ్వర జలాశయానికి ఇన్‌ఫ్లో నిలిచిపోగా.. లోయర్ మానేరుకు మూడువేలకుపైగా, కడెంకు 264, ఎల్లంపల్లికి 2,574 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతున్నది. భద్రాచలం వద్ద గోదావరి 20 అడుగుల మేరలో ప్రవహిస్తున్నది.

## విద్యుదాఘాతంతో ఇద్దరు రైతులు మృతి

**వెల్గటూరు:** జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం ఎండపల్లిలో సోమవారం విద్యుదాఘాతానికి ఇద్దరు రైతులు మరణించారు. ఎండపల్లికి చెందిన ముస్కు రాజిరెడ్డి.. సూరకంటి సుశీలకు చెందిన నాలుగెకరాలు కౌలుకు తీసుకొని వరి, పత్తి, మక్కజొన్న సాగు చేస్తున్నాడు. అడవి పందుల నుంచి పంటలను కాపాడుకునేందుకు చుట్టూ విద్యుత్ వైర్లను అమర్చాడు. సోమవారం అదే గ్రామానికి చెందిన గుర్రం అజయ్‌ని వెంటతీసుకొని వెళ్లి పంట పొలానికి నీళ్లు పెడుతున్న క్రమంలో అడవి పందులకోసం అమర్చిన విద్యుత్ వైర్లకు ప్రమాదవశాత్తు తగిలి ముస్కు రాజిరెడ్డి చనిపోగా, అతడిని కాపాడే ప్రయత్నం చేస్తూ విద్యుదాఘాతానికి గురై అజయ్ కూడా మరణించాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## మొదలైన ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

### కరీంనగర్‌లో 17 వరకు కొనసాగనున్న ప్రక్రియ

**కరీంనగర్ స్పోర్ట్స్:** కరీంనగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో సోమవారం తెల్లవారుజామున ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ ప్రారంభమైంది. ఈనెల 17 వరకు నియామక ప్రక్రియ కొనసాగనున్నది. తొలిరోజు టెక్నికల్ గ్రేడ్ విభాగంలో ఉద్యోగాల కోసం 3,448 మంది దరఖాస్తు చేసుకోగా సుమారు మూడువేల మంది హాజరయ్యారు. తొలుత అభ్యర్థుల అడ్మిట్ కార్డులను పరిశీలించి 1.6 కిలోమీటర్ల పరుగు పందెం, ఇతర శారీర ధృడత్వ పరీక్షలు నిర్వహించారు. అర్హత సాధించినవారిని వైద్య పరీక్షల కోసం ఆర్మీ అధికారులు ఎంపికచేశారు. ఆదివారం నగరంలో వర్షం పడటంతో రన్నింగ్ ట్రాక్ పూర్తిగా బురదమయమైంది. యువకులు బురదలో సైతం పరుగెత్తి ఎక్కువశాతం మంది అర్హత సాధించారు.






## క్వార్టర్స్‌లో మంజు రాణి

**న్యూఢిల్లీ:** ప్రపంచ మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత బాక్సర్ మంజు రాణి (48 కేజీలు) క్వార్టర్ ఫైనల్లో అడుగుపెట్టింది. ఆరోసీడ్‌గా బరిలో దిగిన మంజు రాణి ప్రిక్వార్టర్స్‌లో 5-0తో రోజస్ టొయనిక్ (వెనిజులా)పై గెలిచింది. ఇరువురు బాక్సర్లు రక్షణాత్మక ధోరణిలో తలపడగా.. మంజు రాణి కచ్చితమైన పంచ్‌లతో సత్తాచాటింది. ఈ ఏడాది ఆరంభంలో జరిగిన ప్రతిష్ఠాత్మక స్ట్రాంజా మెమోరియల్ బాక్సింగ్ టోర్నీలో రజతం నెగ్గిన మంజు.. ఈ మెగాటోర్నీలో మరో విజయం సాధిస్తే అరంగేట్రంలోనే పతకం ఖాయం చేసుకుంటుంది. గురువారం జరిగే క్వార్టర్ ఫైనల్లో టాప్ సీడ్ కిమ్ హ్యాంగ్ మీ (దక్షిణ కొరియా)తో మంజు తలపడనుంది. మరో బౌట్‌లో భారత బాక్సర్ మంజు బంబోరియా (64 కేజీలు) 1-4తో నాలుగో సీడ్ అంజెలా కారినీ (ఇటలీ) చేతిలో ఓడింది. స్టార్ బాక్సర్, ఆరుసార్లు ప్రపంచ చాంపియన్ మేరీ కోమ్ (51 కేజీలు) మంగళవారం రింగ్‌లో అడుగుపెట్టనుంది. తొలి రౌండ్‌లో బై దక్కడంతో రెండో రౌండ్‌లో మూడో సీడ్ మేరీ కోమ్.. థాయ్‌లాండ్‌కు చెందిన జుటామస్ జిట్‌పాంగ్‌తో తలపడనుంది.


హైదరాబాద్ పార్క్ హయత్ హోటల్లో బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన యాప్‌ను సోమవారంఆవిష్కరిస్తున్న ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్ పీవీ సింధు, చిత్రంలో ఐటీ కార్యదర్శి జయేశ్ రంజన్, ఫౌండేషన్ డైరెక్టర్ పి. రఘురాం, భైరవ్ శంకర్




దక్షిణాఫ్రికాతో రెండో టెస్టు కోసం పుణె చేరుకున్న టీమ్ఇండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ, చతేశ్వర్ పుజారా

## ర్యాంకింగ్స్‌లో రోహిత్ హవా



**దుబాయ్:** ఓపెనర్‌గా బరిలోకి దిగిన తొలి టెస్టులోనే రెండు శతకాలతో (176, 126) విజృంభించిన టీమ్ఇండియా బ్యాట్స్‌మన్ రోహిత్ శర్మ ర్యాంకింగ్స్‌లో దూసుకెళ్లాడు. టెస్టు ర్యాంకుల్లో ఒకేసారి 36 స్థానాలు ఎగబాకి కెరీర్ అత్యుత్తమ 17వ ర్యాంకుకు చేరుకున్నాడు. గతంలో ఆడిన 27 టెస్టుల్లో మిడిల్‌ఆర్డర్‌లో బరిలోకి దిగిన హిట్‌మ్యాన్ విశాఖలో దక్షిణాఫ్రికాతో మ్యాచ్‌లో ఓపెనర్‌గా వచ్చి భారత్ భారీ విజయంలో కీలకపాత్ర పోషించాడు. మరో ఓపెనర్, డబుల్ సెంచరీ హీరో మయాంక్ అగర్వాల్ సైతం 38 స్థానాలు మెరుగుపరుచుకొని 25వ ర్యాంకుకు చేరాడు. ఇక టీమ్ఇండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ రెండో స్థానంలో కొనసాగుతుండగా, ఆసీస్ మాజీ కెప్టెన్ స్టీవ్ స్మిత్ అగ్రర్యాంకును నిలబెట్టుకున్నాడు. వైజాగ్ టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో ఏడు వికెట్లతో అదరగొట్టిన రవిచంద్రన్ అశ్విన్ బౌలింగ్ ర్యాంకింగ్స్ టాప్-10లోకి తిరిగొచ్చాడు. 14వ స్థానం నుంచి 10కి చేరుకున్నాడు. పేసర్ షమీ రెండు స్థానాలు ఎగబాకి 16వ ర్యాంకుకు చేరాడు.

## మయాంక్.. సెహ్వాగ్‌లా..

### వీవీఎస్ లక్ష్మణ్ వ్యాఖ్య

**న్యూఢిల్లీ:** విశాఖ టెస్టులో ద్విశతకంతో సత్తాచాటిన ఓపెనర్ మయాంక్ అగర్వాల్‌పై టీమ్ఇండియా మాజీ స్టార్ బ్యాట్స్‌మన్ వీవీఎస్ లక్ష్మణ్, టర్బోనేటర్ హర్భజన్ సింగ్ ప్రశంసలు కురిపించారు. భయం లేకుండా మాజీ డాషింగ్ బ్యాట్స్‌మన్ వీరేందర్ సెహ్వాగ్‌లా మయాంక్ ఆడుతున్నాడని లక్ష్మణ్ అభిప్రాయపడ్డాడు. 'సాధారణంగా దేశవాళీ క్రికెట్‌కు, అంతర్జాతీయ క్రికెట్‌కు ఆటగాళ్లు కాస్త మార్పులు చేసుకొని ఆడుతారు. కానీ మయాంక్ ఎలాంటి మార్పు లేకుండా ధైర్యంగా ఆడాడు. మానసిక స్థైర్యం, స్థిరత్వం అతడి బలాలు. అతడి ఫేవరెట్ సెహ్వాగ్‌లాగే మయాంక్ ఆడుతున్నాడు' అని ఓ కార్యక్రమంలో లక్ష్మణ్ చెప్పాడు. మయాంక్ పాదాల కదలికలు చాలా చక్కగా ఉన్నాయని.. దీనివల్లే అతడు సరైన షాట్లు ఆడుతున్నాడని హర్భజన్ అన్నాడు. 'క్రీజును వదిలి ముందుకు వచ్చి బంతిని బాదినప్పుడు మయాంక్ కాళ్లను బాగా ఉపయోగించుకుంటున్నాడు. రివర్స్‌స్వీప్ సైతం చక్కగా ఆడుతున్నాడు. అతడిలో చాలా ప్రతిభ దాగుంది. అవసరమైనప్పుడు బయటకు తీస్తున్నాడు. జట్టు కోసం ఏం చేయాలో మయాంక్‌కు బాగా తెలుసు. అందుకే బాగా రాణిస్తున్నాడు' అని భజ్జీ అన్నాడు.

## ఒలింపిక్స్‌లో కబడ్డీ కోసం కృషి


రిజిజు

**న్యూఢిల్లీ:** మట్టి ఆట కబడ్డీని 2024 పారిస్ ఒలింపిక్స్‌లో చేర్చే విధంగా కృషిచేస్తామని కేంద్ర క్రీడాశాఖ మంత్రి కిరణ్ రిజిజు పేర్కొన్నారు. దేశవాళీ ఆటను విశ్వవేదికపై వెలుగులీనేలా చేయడానికి యత్నిస్తామన్నారు. 'ఓ స్వదేశీ క్రీడా విజయవంతంగా వృద్ధి చెందిందనడానికి కబడ్డీ చక్కటి ఉదాహరణ. దేశంలో క్రీడాసంస్కృతి పెంపొందుతుందనడానికి ఇదే నిదర్శనం. తదుపరి ఒలింపిక్స్‌లో కబడ్డీని చేర్చేందుకు మా వంతు కృషి చేస్తాం. ప్రస్తుతం కబడ్డీకి లభిస్తున్న ఆదరణను బట్టి చూస్తే ఇదేమంత కష్టమైన పనికాదనిపిస్తున్నది. దీనికోసం మేం బలంగా ప్రయత్నించాలని నిర్ణయించాం' అని రిజిజు తెలిపారు. కబడ్డీని ఒలింపిక్స్‌లో చేర్చాలంటే అంతకుముందు అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) గుర్తింపు సాధించాల్సి ఉంటుంది. అనంతరం అది అంతర్జాతీయ సమాఖ్య (ఐఎఫ్)గా నమోదై.. ఆనక ఒలింపిక్స్ క్రీడల జాబితాలో చోటు కోసం ప్రయత్నించాల్సి ఉంటుంది.

## సుమిత్ నాగల్ @129



**న్యూఢిల్లీ:** భారత యువ టెన్నిస్ ప్లేయర్ సుమిత్ నాగల్ కెరీర్ అత్యుత్తమ ర్యాంక్‌కు చేరుకున్నాడు. అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో 22 ఏండ్ల నాగల్ 129వ స్థానానికి దూసుకెళ్లాడు. గతవారం ఏటీపీ చాలెంజర్ బ్రెజిల్ టోర్నీలో సెమీఫైనల్‌కు చేరడం ద్వారా నాగల్ 6 స్థానాలు మెరుగుపర్చుకొని టాప్-100కు మరింత చేరువయ్యాడు. యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ తొలిరౌండ్‌లో టెన్నిస్ దిగ్గజం ఫెదరర్‌పై ఓ సెట్ గెలిచిన నాగల్.. ఆ తర్వాత బ్యూనస్ ఎయిర్స్ ఏటీపీ చాలెంజర్ టోర్నీలో విజేతగా నిలిచాడు. పురుషుల విభాగంలో జొకోవిచ్ (10, 365) టాప్‌ప్లేస్‌లో కొనసాగుతుండగా.. నాదల్ (9225), ఫెదరర్ (7,130) ఆ తర్వాతి స్థానాలు నిలబెట్టుకున్నారు. మహిళల విభాగంలో ఆష్లే బార్టీ అగ్రస్థానంలోనే ఉంది.

# పతకానికి ఎంతో.. దూరం

## ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో మారని భారత్ ప్రదర్శన

### విజేతలకు.. మన అథ్లెట్లకు భారీ అంతరం


అంజు బాబి జార్జ్

ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ రెండేండ్లకోసారి వస్తున్నది.. పోతున్నది. ఇప్పటికి వరకు 17సార్లు ఈ ప్రపంచ సమరం జరిగితే అందులో భారత్ సాధించింది ఒక్క కాంస్య పతకమే. అదీ 2003లో లాంగ్‌జంప్ విభాగంలో అంజు బాబి జార్జ్ గెలిచిందే. దీన్నిబట్టే మన పరిస్థితి ఎంత దీనంగా ఉందో తెలుస్తున్నది. పతకాల్లో అమెరికా టాప్‌లో దూసుకెళ్తుంటే కెన్యా, జమైకా లాంటి అతిచిన్న దేశాలూ ప్రతీ చాంపియన్‌షిప్‌లో అదరగొడుతున్నాయి. చాలామందికి పేర్లు కూడా తెలియని బహమస్, బోస్నియా, బుర్కినాఫాసో లాంటి దేశాలకు చెందిన అథ్లెట్లు పతకాలు పడుతున్నారు. ఈసారి దోహా వేదికగా జరిగిన చాంపియన్‌షిప్‌లోనూ పతకాల పట్టికలో అమెరికా (29) టాప్‌లో నిలువగా ఆఫ్రికాలోని చిన్న దేశాలైన కెన్యా (11), జమైకా (12) పతకాల పంట పడించినా.. మన 27మంది అథ్లెట్ల బృందం మాత్రం రిక్తహస్తాలతోనే వెనుదిరిగింది. మిక్స్‌డ్ రిలే జట్టు, స్టిపుల్‌చేజ్‌లో అవినాశ్ టోక్యో ఒలింపిక్స్ (2020) బెర్తులు దక్కించుకోవడం కాస్త సంతోషం కలిగించే అంశమైనా.. అన్నూరాణి, జబీర్ మినహా మిగలినవారంతా క్వాలిఫికేషన్ రౌండ్లోనే ఇంటిముఖం పట్టారు. ఇక్కడ మరో అంశం దిగ్భ్రాంతికి గురిచేస్తున్నది. అసలు సమీప భవిష్యత్తులో చాంపియన్‌షిప్‌లో భారత్ స్వర్ణ పతకాన్ని సాధిస్తుందా అన్న అనుమానాలను బలపరుస్తున్నది. అదే ఈసారి వివిధ విభాగాల్లో స్వర్ణ పతక విజేతలకు.. మన అథ్లెట్ల ప్రదర్శనకు మధ్య గల భారీ అంతరం. పతకం గెలువకున్నా కనీస పోటీ లేకుండా తొలి అడుగులోనే నిష్క్రమించడం నిరాశ కలిగించే అంశం. దేశంలోని అథ్లెటిక్స్ పరిస్థితిని, ప్రోత్సహించాల్సిన అవసరాన్ని చాంపియన్‌షిప్ ఫలితాలు మరోసారి తేటతెల్లం చేస్తున్నాయి.

– నమస్తే తెలంగాణ, క్రీడావిభాగం

## పురుషుల విభాగం

**400మీటర్ల హర్డిల్స్**

ఎంపీ జబీర్ (భారత్): హీట్స్‌లో 49.62 సెకన్లు, సెమీస్‌లో: 49.71 సెకన్లు (హీట్-3లో 5వ, ఓవరాల్‌గా 17వ స్థానం)
ధరుణ్ అయ్యస్వామి (భారత్): 50.55 సెకన్లు (హీట్-5లో 6వ, ఓవరాల్‌గా 27వ స్థానం)
స్వర్ణ పతక విజేత: కార్‌స్టెన్ వార్‌హోమ్ (నార్వే), 47.42 సెకన్లు

**మారథాన్**

గోపీ తనకల్ (భారత్): 2 గంటల 15.57 నిమిషాలు (21వ స్థానం)
స్వర్ణ విజేత: లీసా దెసీసా (ఇథియోపియా), 2గంటల 10.40 నిమిషాలు

**3000 మీటర్ల స్టిపుల్ చేజ్**

అవినాశ్ సేబల్ (భారత్): హీట్స్‌లో 8 నిమిషాల 25.23 సెకన్లు, ఫైనల్లో 8 నిమిషాల 21.37 సెకన్లు (13వ స్థానం)
స్వర్ణ పతక విజేత: సెన్సస్ కిప్రుటో (కెన్యా), 8 నిమిషాల 01.35 సెకన్లు

**20 కిలోమీటర్ల రేస్ వాక్**

ఇర్ఫాన్ తోడి (భారత్): గంటా 35.21 నిమిషాలు (27వ స్థానం)
దేవేందర్ సింగ్ (భారత్): గంటా 41.48 నిమిషాలు (36వ స్థానం)
పసిడి విజేత: తషికాజు యమనిషి (జపాన్), గంటా 26.34 నిమిషాలు



**షార్ట్‌పుట్**

తేజేందర్ పాల్ సింగ్ తూర్ (భారత్): 20.43 మీటర్లు (క్వాలిఫికేషన్ గ్రూప్-బిలో 8వ, ఓవరాల్‌గా 18వ స్థానం)
స్వర్ణ పతక విజేత: జోయ్ కోవాక్స్ (అమెరికా), 22.91 మీటర్లు

**4 X 400 రిలే**

భారత జట్టు (మహమ్మద్ అనస్, జాకోబ్, కేఎస్ జీవన్, నోవా నిర్మల్ టామ్) 3 నిమిషాల 03.09 సెకన్లు (హీట్-2లో 7వ, ఓవరాల్‌గా 12వ స్థానం)
స్వర్ణ విజేత: అమెరికా జట్టు, 2 నిమిషాల 56.69 సెకన్లు



**1500 మీటర్ల పరుగు**

జిన్సన్ జాన్సన్ (భారత్): 3నిమిషాల 39.86సెకన్లు (హీట్స్-2లో 10వ, ఓవరాల్‌గా 34వ స్థానం)
స్వర్ణ పతక విజేత: తిమోతి చెర్యోట్ (కెన్యా), 3 నిమిషాల 29.26 సెకన్లు

## మహిళల విభాగం

**200 మీటర్ల పరుగు**

అర్చన సుసీంద్రన్ (భారత్): 23.65 సెకన్లు (హీట్స్-2లో చివరి, ఓవరాల్‌గా 40వ స్థానం)
స్వర్ణ పతక విజేత: దినా ఆషెర్ స్మిత్ (బ్రిటన్), 21.88 సెకన్లు

**400 మీటర్ల పరుగు**

అంజలీ దేవి(భారత్): 52.33సెకన్లు (హీట్-6లో 6వ, ఓవరాల్‌గా 37వ స్థానం)
స్వర్ణ పతక విజేత: సల్వా ఈద్ నాసెర్ (బెహ్రయిన్), 48.14 సెకన్లు

**1500 మీటర్ల పరుగు**

పీయూ చిత్ర (భారత్): 4 నిమిషాల 11.10 సెకన్లు (హీట్-2లో 8వ, ఓవరాల్‌గా 30వ స్థానం)
స్వర్ణ పతక విజేత: సిఫాన్ హసన్ (నెదర్లాండ్స్), 3 నిమిషాల 51.95 సెకన్లు



**జావెలిన్‌త్రో**

అన్నూరాణి (భారత్): క్వాలిఫికేషన్ రౌండ్: 62.43 మీటర్లు, ఫైనల్: 61.12 మీటర్లు (8వ స్థానం)
స్వర్ణ పతక విజేత: కెలీసే లీ బార్బర్ (ఆస్ట్రేలియా), 66.56 మీటర్లు



**100 మీటర్ల పరుగు**

ద్యుతీ చంద్ (భారత్): 11.48సెకన్లు (హీట్-3లో 7వ, ఓవరాల్‌గా 37వ స్థానం)
స్వర్ణ పతక విజేత: షెల్లీ అన్‌ఫ్రేసర్ ప్రైస్ (జమైకా), 10.71 సెకన్లు



**4X400 మిక్స్‌డ్ రిలే**

భారత జట్టు (మహమ్మద్ అనస్, విస్మయ, జిన్నా మథ్యూస్, నిర్మల్ టామ్): హీట్స్‌లో 3 నిమిషాల 16.14 సెకన్లు, ఫైనల్లో 3 నిమిషాల 15.77 సెకన్లు (7వ స్థానం)
స్వర్ణ పతక విజేత: అమెరికా, 3 నిమిషాల 09.34 సెకన్లు

**4X400 మహిళల రిలే పరుగు**

భారత జట్టు (జిన్నా మాథ్యూ, పూవమ్మ, విస్మయ, సుభా వెంకటేషన్): 3 నిమిషాల 29.42 సెకన్లు (హీట్స్-1లో 6వ, ఓవరాల్‌గా 15లో 11వ స్థానం)
స్వర్ణ పతక విజేత: అమెరికా జట్టు, 3 నిమిషాల 18.92 సెకన్లు

## గోవాపై గెలుపు

**బెంగళూరు:** విజయ్ హజారే ట్రోఫీ వన్డే టోర్నీలో హైదరాబాద్ మూడో విజయాన్ని నమోదు చేసుకుంది. సోమవారం ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో రాయుడు సేన 5 వికెట్ల తేడాతో గోవాను చిత్తు చేసింది. మహమ్మద్ సిరాజ్ (4/20), భావనక సందీప్ (4/13) ధాటికి టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన గోవా 37.4 ఓవర్లలో 122 పరుగులకు ఆలౌటైంది. అమోఘ్ దేశాయ్ (55) ఒక్కడే అర్ధశతకంతో ఆకట్టుకోగా.. మిగిలినవారు పూర్తిగా విఫలమయ్యారు. అనంతరం లక్ష్య ఛేదనలో ఓపెనర్ తన్మయ్ అగర్వాల్ (66 నాటౌట్; 11 ఫోర్లు, 1 సిక్స్) రాణించడంతో హైదరాబాద్ 22.2 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 126 పరుగులు చేసింది. మరో మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు 53 పరుగుల తేడాతో కర్ణాటక చేతిలో ఓడింది

## ఇంగ్లండ్ కోచ్‌గా సిల్వర్‌వుడ్



**లండన్:** ఇంగ్లండ్ క్రికెట్ జట్టు నయా కోచ్‌గా క్రిస్ సిల్వర్‌వుడ్ ఎంపికయ్యాడు. ఇటీవల ఇంగ్లండ్‌కు వన్డే ప్రపంచకప్ అందించిన మాజీ కోచ్ ట్రేవర్ బేలిస్ ఒప్పందం ముగియడంతో అతడి స్థానంలో గతంలో బౌలింగ్ కోచ్‌గా పనిచేసిన సిల్వర్‌వుడ్‌ను నియమించారు. భారత మాజీ కోచ్ గ్యారీ కిర్‌స్టన్ కూడా పోటీలో నిలిచినా.. ఇంగ్లండ్ వెల్స్ క్రికెట్ బోర్డు సిల్వర్‌వుడ్ వైపే మొగ్గుచూపింది. 'సిల్వర్‌వుడ్ మాకు బాగా తెలుసు. మా జట్లను ముందుకు తీసుకెళ్లే వ్యక్తి అతడేనని నమ్ముతున్నాం. వ్యవస్థపై అతడికి చక్కటి అవగాహనతో పాటు ఇంగ్లండ్ సారథులు జో రూట్, మోర్గాన్‌తో మంచి అనుబంధం ఉంది' అని ఇంగ్లండ్ క్రికెట్ మేనేజింగ్ డైరెక్టర్ యాష్లే గైల్స్ తెలిపాడు.

## ప్రణవ్ ముందంజ

**కజన్ (రష్యా):** ప్రపంచ జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత షట్లర్లు శుభారంభం చేశారు. సోమవారం ఇక్కడ ప్రారంభమైన టోర్నీలో గంధం ప్రణవ్ రావు, మీరబా, సతీశ్ కరుణాకరన్ విజయాలు సాధించి ముందడుగేశారు. తొలిరౌండ్‌లో ప్రణవ్ 21-10, 21-6తేడాతో అర్మన్ వర్దన్యన్ (అర్మేనియా)ను చిత్తు చేశాడు. తొలి రౌండ్‌లో బై లభించగా.. రెండో రౌండ్‌లో మీరబా 21-4, 21-3తో సునాయాసంగా టీడొర్ సిరొబోయ్ (రొమేనియా)పై విజయం సాధించాడు. కేవలం 15 నిమిషాల్లోనే మ్యాచ్‌ను ముగించాడు. కరుణాకరన్ 21-6, 21-5తో శామ్యూల్ వాస్వా (ఉగాండా)పై గెలిచాడు. ఈ టోర్నీ గత సీజన్‌లో లక్ష్యసేన్ కాంస్యం నెగ్గాడు.

## బ్రిడ్జ్‌లో కాంస్యం

**ముంబై:** ప్రపంచ బ్రిడ్జ్ చాంపియన్‌షిప్‌లో భారత సీనియర్ జట్టు కాంస్య పతకం సాధించింది. దీపక్ సారథ్యంలోని జట్టు చక్కటి ప్రదర్శన కనబర్చిందని భారత బ్రిడ్జ్ సమాఖ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఇటీవల చైనా వేదికగా జరిగిన 44వ వరల్డ్ బ్రిడ్జ్ చాంపియన్‌షిప్‌లో దీపక్, జితేంద్ర సోలాని, సుభాశ్, శ్రీధరన్, సుబ్రతా సాహా, సుకమల్ దాస్‌తో కూడిన జట్టు మూడోస్థానంలో నిలిచింది. రెండేండ్ల క్రితం ఫ్రాన్స్ వేదికగా జరిగిన పోటీల్లో నాలుగోస్థానంలో నిలిచిన భారత జట్టు ఈ సారి మెరుగైన ప్రదర్శన చేసింది.

## టైటాన్స్ పరాజయాల హ్యాట్రిక్



### గుజరాత్ చేతిలో ఓటమి

**గ్రేటర్ నోయిడా:** తొలి అర్ధభాగం వరకు ఎదురులేని ఆధిపత్యం ప్రదర్శించి.. ఆ తర్వాత చతికిలబడిన తెలుగు టైటాన్స్ ప్రొకబడ్డీ లీగ్ ఏడో సీజన్‌లో మరో పరాజయాల హ్యాట్రిక్‌ను నమోదు చేసింది. సోమవారం ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో టైటాన్స్ 38-48తేడాతో గుజరాత్ ఫార్చ్యూన్ జెయింట్స్‌పై పరాజయం పాలైంది. రైడర్లు సిద్ధార్థ్ దేశాయ్ (13 పాయింట్లు), రాకేశ్ గౌడ (6 పాయింట్లు) రాణించినా ఫలితం లేకపోయింది. గుజరాత్ జట్టులో రైడర్ సోనూ (17 పాయింట్లు), డిఫెండర్ పంకజ్ (5పాయింట్లు) అదరగొట్టారు. మ్యాచ్ తొలి నుంచి తెలుగు టైటాన్స్ పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. ఏడో నిమిషంలోనే గుజరాత్‌ను ఆలౌట్ చేసి 12-5తో టైటాన్స్ పైచేయి సాధించింది. ఫస్ట్‌హాఫ్ ముగిసే సరికి 21-13తో నిలి చింది. అయితే రెండో అర్ధభాగంలో కథ అడ్డం తిరిగింది. గుజరాత్ రైడర్ సోనూ రెచ్చిపోయి వరుస పాయింట్లు సాధించాడు. దీంతో ద్వితీయార్ధం రెండో నిమిషంలోనే టైటాన్స్ ఆలౌట్ కాగా, ఆధిక్యం 22-19కి తగ్గిపోయింది. 32వ నిమిషంలో మరోసారి ఆలౌటైన తెలుగు జట్టు 30-32తో వెనుకబడింది. చివరికి టైటాన్స్‌కు పరాజయం తప్పలేదు. మరోమ్యాచ్‌లో తమిళ్ తలైవాస్ 35-33తో జైపూర్ పింక్ పాంథర్స్‌పై విజయం సాధించింది.

## సిరీస్ లంకదే

**లాహోర్:** సొంతగడ్డపై శ్రీలంకతో జరిగిన వన్డే సిరీస్ కైవసం చేసుకున్న పాకిస్థాన్.. పొట్టి ఫార్మాట్‌లో మాత్రం ఆ జోరు కనబర్చలేకపోయింది. టీ20 ఫార్మాట్‌లో ప్రపంచ నంబర్‌వన్ పాక్‌పై లంక యువ జట్టు వరుసగా రెండు విజయాలు సాధించి సిరీస్ చేజిక్కించుకుంది. సోమవారం జరిగిన రెండో టీ20లో టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన లంక 20 ఓవర్లలో 6 వికెట్లకు 182 పరుగులు చేసింది. భానుక రాజపక్సె (77; 4 ఫోర్లు, 6 సిక్సర్లు) అర్ధసెంచరీతో అదరగొట్టగా.. షెహన్ జయసూర్య (34) రాణించాడు. అనంతరం ప్రదీప్ (4/25), వనిందు డిసిల్వా (3/38) ధాటికి పాక్ 19 ఓవర్లలో 147 పరుగులకు ఆలౌటైంది.

## అజర్ కొడుకుతో సానియా చెల్లి నిఖా



**న్యూఢిల్లీ:** టీమ్ఇండియా మాజీ కెప్టెన్, హెచ్‌సీఏ అధ్యక్షుడు మహమ్మద్ అజారుద్దీన్ ఇంట త్వరలోనే పెండ్లి సందడి మొదలుకానుంది. అజర్ కుమారుడు అసద్‌తో తన చెల్లి ఆనమ్ మీర్జా వివాహం డిసెంబర్‌లో జరుగనుందని భారత టెన్నిస్ స్టార్ సానియా మీర్జా వెల్లడించింది. 'ఆనమ్ వివాహం డిసెంబర్‌లో జరుగనుంది. మేం ఇప్పుడే పారిస్ పర్యటన నుంచి వచ్చాం. ఎంతో ఉత్సాహంగా ఉన్నాం. ఆజారుద్దీన్ కుమారుడు అసద్‌తో ఆనమ్ పెండ్లి జరుగనుండడం చాలా సంతోషంగా ఉంది' అని సానియా జాతీయ మీడియాతో చెప్పింది. ఆనమ్ మీర్జా ఫ్యాషన్ డిజైనర్‌గా పనిచేస్తున్నది. చాలా ఈవెంట్లలో సానియాకు ఆమె డ్రెస్ డిజైనింగ్ చేస్తున్నది. ఓ సందర్భంలో ఆనమ్, అసద్‌తో కలిసి దిగిన ఫొటోను సోషల్ మీడియాలో సానియా పోస్ట్ చేసి ఫ్యామిలీ అని రాసింది. అప్పటి నుంచి అసద్, అనమ్‌కు పెండ్లి జరుగనుందనే వార్తలు హల్‌చల్ చేశాయి. తాజాగా సానియా ఈ విషయాన్ని ధ్రువీకరించింది.






| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 37,532 | 11,126 |
| ↓141 | ↓48 |

ముడి చమురు (బ్రెంట్) ↑ 58.58 డాలర్లు

బంగారం ధరలు

| న్యూఢిల్లీ (రూ.లలో) | |
|---|---|
| 24 క్యారెట్లు | 39,210 |
| క్యారెట్లు | --- |
| వెండి (కిలో) | 46,390 |

## ఏకీకరణ దిశగా ఫోక్స్‌వాగన్ ఇండియా

**న్యూఢిల్లీ, అక్టోబర్ 7:** ఫోక్స్‌వాగన్ గ్రూప్ ఇండియా అనుబంధ సంస్థలు ఏకమవుతున్నాయి. అన్ని రెగ్యులేటరీ, చట్టపరమైన అనుమతులు లభించాయని సోమవారం సంస్థ తెలిపింది. దీంతో ఫోక్స్‌వాగన్ ఇండియా, ఫోక్స్‌వాగన్ గ్రూప్ సేల్స్ ఇండియా, స్కోడా ఆటో ఇండియా ఒక్కటి కానున్నాయి. ఇవన్నీ కలిసి ఇకపై స్కోడా ఆటో ఫోక్స్‌వాగన్ ఇండియాగా మారనున్నాయని ఓ ప్రకటనలో స్కోడా ఆటో సీఈవో బెన్‌హార్డ్ తెలిపారు. కొత్త సంస్థకు ఎండీగా గురుప్రతాప్ బోపరాయి వ్యవహరించనున్నారు.

## హెచ్ఎస్‌బీసీలో 10 వేల ఉద్యోగాల కోత!

- వ్యయ నియంత్రణ చర్యల్లో బ్యాంక్
- ఆర్థిక అనిశ్చితే కారణం

**హాంకాంగ్, అక్టోబర్ 7:** హెచ్ఎస్‌బీసీ బ్యాంక్‌లో భారీ ఎత్తున ఉద్యోగాలు పోనున్నాయి. 10 వేల మంది ఉద్యోగుల్ని తొలగించే దిశగా బ్యాంక్ యాజమాన్యం అడుగులు వేస్తున్నది. వీరంతా కూడా అధిక మొత్తాల్లో జీతాలు తీసుకుంటున్నవారే కావడం గమనార్హం. గత నెల ఈ లండన్ ఆధారిత బ్యాంక్ సీఈవో జాన్ ఫ్లింట్ అనూహ్యంగా రాజీనామా చేయగా, ఆ విషయాన్ని ప్రకటించిన యాజమాన్యం అందుకు కారణాన్ని మాత్రం చెప్పలేదు. ఫ్లింట్ ఆ హోదాలో ఉన్నది కేవలం ఏడాదిన్నరే. ఈ క్రమంలో ఇప్పుడు ఏకంగా 10 వేల మంది ఉద్యోగులపై వేటు వేయాలని చూస్తుండటం, అదికూడా ఉన్నతస్థాయి ఉద్యోగుల్నే లక్ష్యంగా చేసుకోవడం ప్రాధాన్యతను సంతరించుకున్నది. కాగా, అంతర్జాతీయంగా నెలకొన్న ప్రతికూల పరిస్థితుల మధ్యే హెచ్ఎస్‌బీసీ వ్యయ నియంత్రణ చర్యలకు దిగుతున్నట్లు ఫైనాన్షియల్ టైమ్స్ కథనం ద్వారా తెలుస్తున్నది. ఇక ఈ ఉద్యోగ కోతలు యూరోపియన్ దేశాల్లో ఎక్కువగా ఉండొచ్చని తెలుస్తుండగా, అంతర్జాతీయ అనిశ్చితితో ప్రపంచవ్యాప్తంగా 4 వేల మంది ఉద్యోగులను తీసేస్తున్నట్లు సమాచారం. వడ్డీరేట్ల పతనం, బ్రెగ్జిట్, అమెరికా-చైనా సుదీర్ఘ వాణిజ్య యుద్ధం వంటివి ఈ కోతలకు దారితీశాయని హెచ్ఎస్‌బీసీ చెబుతున్నదని ఫైనాన్షియల్ టైమ్స్ తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా హెచ్ఎస్‌బీసీలో 2,38,000 మంది పనిచేస్తున్నారు. కాగా, గత నెల జర్మనీకి చెందిన రెండో అతిపెద్ద బ్యాంకైన కామర్జ్‌బ్యాంక్.. 4,300 మంది ఉద్యోగులను తొలగించనున్నామని, 200 శాఖలను ఎత్తేయనున్నామని ప్రకటించిన విషయం తెలిసిందే. డ్యూషే బ్యాంక్ 18 వేల మందిని, ఫ్రాన్స్‌కు చెందిన సోషియేట్ జనరెల్లి 1,600 మందిని తీసేస్తున్నట్లు చెప్పాయి. ఈ క్రమంలో హెచ్ఎస్‌బీసీ బ్యాంక్ కూడా ఈ జాబితాలోకి చేరడం అంతర్జాతీయ బ్యాంకింగ్ రంగాన్ని కలవరపెడుతున్నది.




## లాట్ పండుగ ఆఫర్లు భళా

**హైదరాబాద్, అక్టోబర్ 7:** మొబైల్ రిటైల్ రంగంలో తనదైన శైలిలో దూసుకుపోతున్న లాట్ మొబైల్స్.. పండుగ ఆఫర్లకు కస్టమర్ల నుంచి విశేష స్పందన లభిస్తున్నది. గత నెల 29న దసరా, దీవాలీ పండుగ ఆఫర్లను లాట్ మొబైల్స్ ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఈ ఆఫర్లను కొనుగోలుదారులు సద్వినియోగం చేసుకోవాలని సంస్థ కోరింది. మొబైల్ ఎక్స్ఛేంజ్‌పై 60 శాతం వరకు రాయితీలు, రూ.5 వేల వరకు ఎక్స్ఛేంజ్ క్యాష్ బోనస్, 30 శాతం దాకా పేటీఎం క్యాష్ బ్యాక్, 10 శాతం వరకు హెచ్‌డీఎఫ్‌సీ క్యాష్ బ్యాక్ ఉంటుందని వివరించింది. అలాగే సామ్‌సంగ్ ఎ50ఎస్ కొనుగోలుపై రూ.2 వేల తగ్గింపు, వివో వై సిరీస్‌పై రూ.500 నుంచి 1,500 వరకు తగ్గింపు, ఒప్పో ఎఫ్11ప్రో, ఎఫ్11లపై రూ.2 వేల తగ్గింపునిస్తున్నట్లు పేర్కొంది. బజాజ్ ఫైనాన్స్‌పై 5 శాతం వరకు క్యాష్ బ్యాక్, ఫోన్‌పేపై రూ.500 వరకు క్యాష్ బ్యాక్, సెలెక్టెడ్ బ్రాండెడ్ మొబైల్స్‌పై వన్‌టైం స్క్రీన్ రీప్లేస్‌మెంట్ ఉచితమని సంస్థ ఈ సందర్భంగా వెల్లడించింది. 6 నెలల స్క్రీన్ రిప్లేస్‌మెంట్ సర్వీస్‌పై ఎక్స్‌టెండ్ వారెంట్ ఉచితమని, డెబిట్ కార్డుపై కేవలం రూపాయి చెల్లించి మొబైల్ పొందవచ్చని స్పష్టం చేసింది. వడ్డీ లేకుండా నెలసరి వాయిదాలతో మిగతా మొత్తాన్ని చెల్లించే వీలుందని చెప్పింది. అలాగే ప్రముఖ మొబైల్ ఫైనాన్స్ సంస్థల ద్వారా మొబైల్ కొన్న కస్టమర్లకు ఒక నెల ఈఎంఐని తామే చెల్లిస్తామని, ప్రతీ మొబైల్ కొనుగోలుపై ఖచ్చితమైన బహుమతి ఉంటుందని ప్రకటించింది.

# అన్నీ ఆన్‌లైన్‌లోనే..

**వేగంగా విస్తరిస్తున్న ఈ-కామర్స్ మార్కెట్ ■ పడిపోతున్న సంప్రదాయ వ్యాపారం**

**గ్రామాల్లోనూ బలపడుతున్న ఈ-మార్కెటీర్లు ■ పండుగ సీజన్‌లో ఆఫర్లతో ఆన్‌లైన్ షాపింగ్ కళకళ**

**పోటీ ప్రకటనలతో కస్టమర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్న దుకాణదారులు**

**న్యూఢిల్లీ/హైదరాబాద్, అక్టోబర్ 7:**

అర క్షణంలో అన్నీ అరచేతిలోకి రావాలనుకునే నేటి తరానికి.. ఆన్‌లైనే అంతా అన్నట్లు తయారైంది. సంప్రదాయ మార్కెట్ ముఖమైనా చూసేందుకు ఇష్టపడని యువత.. అన్నీ ఆన్‌లైన్‌లోనే కానిచ్చేస్తున్నది మరి. దీనికితోడు ఆఫర్లు ఉండనే ఉన్నాయి. ఫలితంగా ఈ-కామర్స్ మార్కెట్.. రాకెట్ వేగంతో దూసుకుపోతున్నది. ఆర్థిక మందగమనంలోనూ నూతన అంచనాలతో పరుగులు పెడుతున్నది. నిరుడు పండుగ సీజన్‌లో ఆన్‌లైన్ అమ్మకాలు 2.9 బిలియన్ డాలర్లుగా ఉంటే, ఈసారి 3.8 బిలియన్ డాలర్లుగా నమోదు కావచ్చని పరిశ్రమ వర్గాల అభిప్రాయం. ఇందులో అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లదే పైచేయి. ప్రస్తుత దేశీయ ఆన్‌లైన్ మార్కెట్‌లో 75 శాతం వాటా ఈ రెండింటిదే.



### పండుగ సీజనే కీలకం

ఈ-కామర్స్ దిగ్గజాలు అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లు ఇప్పటికే పండుగ సీజన్ సమరాన్ని ఆరంభించేశాయి. కస్టమర్లను ఆకట్టుకునేందుకు బోలెడు ఆఫర్లతో ముందుకొచ్చేశాయి. డిమాండ్ దృష్ట్యా హైదరాబాద్ వంటి మెట్రో నగరాల్లో వేలాది తాత్కాలిక ఉద్యోగులనూ ఈ సంస్థలు నియమించేసుకుంటున్న విషయం తెలిసిందే. అక్టోబర్-నవంబర్ నెలలపై భారతీయ వ్యాపారులు పెద్ద ఎత్తునే ఆశలు పెట్టుకుంటారు. పెద్ద పండుగల కాలం కావడంతో వార్షిక అమ్మకాల్లో సగమైనా ఈ పండుగల్లో నమోదు చేసుకోవాలని ఆరాటపడుతుంటారు. అయితే విస్తరిస్తున్న ఆన్‌లైన్ మార్కెట్.. వీరి ఆశల్ని ఆవిరి చేస్తున్నది. నగదు కొరత, నిరుద్యోగం వంటివి సంప్రదాయ మార్కెట్‌ను మరింతగా కుంగదీస్తున్నాయని ఢిల్లీ హోల్‌సేల్ మార్కెట్ వ్యాపారుల సంఘం సదర్ బజార్ ట్రేడర్స్ అసోసియేషన్ ప్రతినిధి రాకేశ్ కుమార్ యాదవ్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### ఆఫర్లు, ప్రకటనలే అండ

ఆర్థిక మాంద్యంలోనూ ఆన్‌లైన్ మార్కెట్ జోరుగా సాగుతున్నది. ఇందుకు కారణం అవి ఇస్తున్న ఆఫర్లు, చేస్తున్న ప్రచారమే. క్యాష్‌బ్యాక్, భారీ డిస్కౌంట్లు, క్రెడిట్ సదుపాయం, ఈఎంఐ వెసులుబాటు వంటివి కస్టమర్లను కొనుగోళ్ల వైపునకు లాగేస్తున్నాయి. మెగా సేల్స్, బిగ్ డీల్స్ అంటూ పత్రికలు, టెలివిజన్లలో ప్రకటనలు, రహదారులపై హోర్డింగ్‌లతోపాటు మెట్రో రైళ్లు, సిటీ బస్సులు, క్యాబ్స్ తదితర రవాణా వ్యవస్థలపై పోస్టర్లు కూడా ఆన్‌లైన్ షాపింగ్‌ను అందరికీ దగ్గర చేస్తున్నది. బ్యాంకులు కూడా తమ క్రెడిట్ కార్డులతో ఆన్‌లైన్ షాపింగ్ చేస్తే ఖాతాదారులకు రివార్డులిస్తుండటం మరింతగా కలిసొస్తున్నది. ఈ విషయంలో సంప్రదాయ వ్యాపారులు చాలాచాలా వెనుకబడిపోతున్నారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

### దుకాణదారుల పాట్లు

ఆన్‌లైన్ సంస్థలకు ధీటుగా పోటీ ప్రకటనలతో కస్టమర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు దుకాణదారులు. క్యాష్‌బ్యాక్, అప్‌టూ ఆఫర్లు, బైవన్ గెట్‌వన్, టుప్లస్‌వన్‌లతోపాటు నిర్ణీత మొత్తంలో షాపింగ్ చేస్తే బంగారం, ద్విచక్ర వాహనాలు, బంపర్ ప్రైజ్ కింద కార్లు, ఫ్లాట్లు, గృహాలనూ ఆఫర్ చేస్తున్నారు. చివరకు ఆన్‌లైన్ ధరలకూ ఇస్తామంటూ కొనుగోలుదారులను ఆకర్షించే దిశగా శ్రమిస్తున్నారు. దీంతో ఆ మేరకు కొంత విజయాన్ని వారు అందుకోగలుగుతున్నారు.

### కిరాణా వ్యాపారంలోనూ..

స్థానికంగా ఎంతో బలమైన కిరాణా వ్యాపార వ్యవస్థనూ ఆన్‌లైన్ మార్కెట్ ప్రభావితం చేస్తున్నది. భారతీయ రిటైల్ మార్కెట్ విలువ 600 బిలియన్ డాలర్లని అంచనా. ఇందులో ఈ-కామర్స్ మార్కెటీర్ల వాటా 5 శాతం కన్నా తక్కువే. అయితే 2022 నాటికి ఇది 8-9 శాతానికి పెరుగుతుందని పరిశ్రమ నిపుణులు చెబుతున్నారు. ఒంటికి, ఇంటికి సంబంధించినవే కాకుండా వంటింటికీ ఆన్‌లైన్ మార్కెటీర్లు వచ్చేస్తున్నారని, కిరాణా సరుకులను తక్కువ ధరకే అందిస్తున్నాయని, తమకు గిరాకీ తక్కువైపోతున్నదని ఇప్పుడు పలువురు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం ఆన్‌లైన్ మార్కెట్ నిబంధనలు కఠినతరం చేసినా.. ఆ ప్రభావం అంతంతమాత్రమేనన్న వాదనలు సంప్రదాయ మార్కెటీర్ల నుంచి వినిపిస్తున్నాయి.

### స్మార్ట్ ఫోన్ల వల్లే..

స్మార్ట్ ఫోన్లు అందరికీ చేరువయ్యాయి. ఇంటర్నెట్ కూడా చౌకగానే లభిస్తున్నది. దీంతో ఆన్‌లైన్ షాపింగ్ సులభమైపోయింది. క్షణం తీరికలేని ఈ యాంత్రిక జీవనంలో ఇంటి నుంచే షాపింగ్ చేయాలని కోరుకునేవారే ఎక్కువైపోయారు. దీంతో రోడ్డు మీదున్న దుకాణాలకు వచ్చేవారే కరువైపోయారు. ఒకప్పుడు నెల రోజుల ముందే మార్కెట్‌కు పండుగ వచ్చేది. కానీ ఇప్పుడు రెండు రోజులకు పరిమితమైంది. అదికూడా ఆన్‌లైన్ షాపింగ్ తర్వాత ప్రత్యామ్నాయమైపోయిందంటే అతిశయోక్తి కాదు. మొబైల్ ఆర్డర్లపై ఇంటి వద్దకే డెలివరీలు వచ్చేస్తున్నాయి. ఇక నగరాలు, పట్టణాల్లో ట్రాఫిక్ కష్టాలు కూడా ఆన్‌లైన్ షాపింగ్‌కు దోహదం చేస్తున్నాయి.






### స్నాప్‌డీల్ దూకుడు

ప్రముఖ ఆన్‌లైన్ మార్కెటింగ్ సంస్థ స్నాప్‌డీల్.. మూడు ప్రత్యేక ఈ-స్టోర్లను ప్రారంభించనున్నది. కర్వా చౌత్, ధనత్రయోదశి, దీపావళి పండుగల సందర్భంగా వీటిని అందుబాటులోకి తేనున్నది. నానాటికీ పెరుగుతున్న ఆన్‌లైన్ షాపింగ్ క్రేజ్‌ను ఒడిసి పట్టేందుకు ఈ-స్టోర్లను ఉపయోగించుకోవాలని స్నాప్‌డీల్ భావిస్తున్నది. కాగా, ఒక్కో ఈ-స్టోర్‌లో ఆయా పండుగలకు సంబంధించిన ఉత్పత్తులన్నింటినీ కస్టమర్లు పొందవచ్చని స్నాప్‌డీల్ అధికార ప్రతినిధి ఒకరు తెలిపారు. కర్వా చౌత్ ఈ-స్టోర్‌లో అన్ని రకాల పూజా సామాగ్రి, ధనత్రయోదశి ఈ-స్టోర్‌లో బంగారు, వెండి నాణేలు, దీపావళి ఈ-స్టోర్‌లో ఎలక్ట్రానిక్స్, గృహోపకరణాలు, లక్ష్మీ, గణేశ్ ప్రతిమలు ఉంటాయని చెప్పారు.

## పోటెత్తిన అమ్మకాలు




**ఈ పండుగ** సీజన్‌లో ఆన్‌లైన్ అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. దేశీయ ఈ-కామర్స్ మార్కెట్‌లో దిగ్గజాలైన అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లు మునుపెన్నడూ లేనివిధంగా ఈసారి బంపర్ సేల్స్‌ను నమోదు చేశామని చెబుతున్నాయి. ఇటీవలి తమ బిగ్ బిలియన్ డేస్‌కు అపూర్వ స్పందన లభించిందని ఫ్లిప్‌కార్ట్ ప్రకటించగా, మా గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్‌కు విశేష ఆదరణ దక్కిందని అమెజాన్ స్పష్టం చేసింది. గతంతో పోల్చితే ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో ఆకర్షణీయ అమ్మకాలను చూశామని ఫ్లిప్‌కార్ట్ గ్రూప్ సీఈవో కల్యాణ్ కృష్ణమూర్తి తెలిపారు. గ్రామీణ ప్రాంతాల నుంచీ ఆర్డర్లు వస్తున్నాయని పేర్కొన్నారు. కొత్త కస్టమర్లు 50 నుంచి 60 శాతం పెరిగారన్న ఆయన మొత్తం ఈ పండుగ అమ్మకాల్లో 70 నుంచి 75 శాతం మావేనన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. మరోవైపు ఈసారి స్మార్ట్‌ఫోన్, ఫ్యాషన్ ఉత్పత్తుల విక్రయాలు బాగా జరిగాయని, గతేడాదితో చూస్తే స్మార్ట్‌ఫోన్ల విక్రయాలు ఏకంగా 15 రెట్లు, ఫ్యాషన్ దుస్తుల అమ్మకాలు 5 రెట్లు పుంజుకున్నాయని అమెజాన్ ఇండియా అధిపతి, సీనియర్ ఉపాధ్యక్షుడు అమిత్ అగర్వాల్ చెప్పారు. ఈ నెల 13 నుంచి 17 వరకు రెండో విడుత గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్‌ను అమెజాన్ నిర్వహించనున్నది. మరోవైపు తమ ఫస్ట్ దీవాలీ సేల్‌కు గొప్ప ఆదరణ కనిపించిందని స్నాప్‌డీల్ సైతం ప్రకటించింది. గత నెల 29 నుంచి ఈ నెల 6దాకా ఈ సేల్ జరుగగా, అమ్మకాల్లో గతంతో పోల్చితే ఈసారి 52 శాతం వృద్ధి నమోదైందని తెలిపింది.

# ఆఖరులో ఆగమాగం

**లాభాల స్వీకరణలో మదుపరులు**

**అమ్మకాల ఒత్తిడిలో ఫార్మా, ఐటీ, ఆటో షేర్లు**

**ముంబై, అక్టోబర్ 7:**



### సెన్సెక్స్ 141, నిఫ్టీ 48 పాయింట్లు పతనం

దేశీయ స్టాక్ మార్కెట్లలో వరుస నష్టాలు కొనసాగుతున్నాయి. తీవ్ర ఒడిదుడుకుల మధ్య సోమవారం బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ సెన్సెక్స్ 141.33 పాయింట్లు కోల్పోయి 37,531.98 వద్ద ముగియగా, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ 48.35 పాయింట్లు పడిపోయి 11,126.40 వద్ద నిలిచింది. ట్రేడింగ్ సెషన్ ఆఖరి గంటలో ఐటీ, ఔషధ, ఎఫ్ఎంసీజీ, ఆర్థిక, చమురు రంగాల షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనైయ్యాయి. మదుపరులు లాభాల స్వీకరణకు దిగడం.. మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసిందని ట్రేడింగ్ సరళిని నిపుణులు విశ్లేషిస్తున్నారు. క్యాపిటల్ గూడ్స్, మెటల్, రియల్టీ, పవర్, ఎనర్జీ, ఆటో రంగాల షేర్లూ నష్టాలకే పరిమితమైయ్యాయి. 2.43 శాతం వరకు ఈ రంగాల షేర్లన్నీ క్షీణించాయి. కన్జ్యూమర్ డ్యూరబుల్స్, టెలికం, బ్యాంకింగ్ రంగాల షేర్లు 1.06 శాతం పెరిగినా ఫలితం లేకపోయింది. బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ షేర్లు 0.75 శాతం వరకు దిగజారాయి. ఓఎన్జీసీ, ఐటీసీ, టాటా స్టీల్, మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా మోటర్స్, ఎల్అండ్‌టీ, టీసీఎస్, సన్ ఫార్మా, ఎన్టీపీసీ, ఇండస్ఇండ్ బ్యాంక్, టెక్ మహీంద్రా షేర్లు 2.97 శాతం మేర నష్టపోయాయి. గ్లెన్‌మార్క్ షేర్ విలువ ఏకంగా 9 శాతానికిపైగా పతనమైంది. హిమాచల్‌ప్రదేశ్‌లోని తయారీ కేంద్రానికి అమెరికా హెల్త్ రెగ్యులేటర్ (యూఎస్ఎఫ్‌డీఏ) హెచ్చరికలు రావడంతో షేర్ విలువ ప్రభావితమైంది. యూఎస్ఎఫ్‌డీఏ పరిశీలన నోటీసులతో అరబిందో ఫార్మా షేర్ కూడా 19 శాతానికిపైగా పడిపోయింది. ఈ క్రమంలో లుపిన్ (2.69 శాతం), సిప్లా (2.35 శాతం), సన్ ఫార్మా (1.57 శాతం) చొప్పున నష్టపోయాయి. ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ సంస్థ బీపీసీఎల్ షేర్ విలువ 4 శాతానికిపైగా పడిపోగా, మార్కెట్ విలువ రూ.5,300 కోట్లకుపైగా ఆవిరైపోయింది. ఇక అంతర్జాతీయంగా ఆసియా, ఐరోపా మార్కెట్లూ నష్టాలకే పరిమితమయ్యాయి.

### మెరిసిన బ్యాంకింగ్ షేర్లు

బ్యాంకింగ్ షేర్లకు మదుపరులు బ్రహ్మరథం పట్టారు. యెస్ బ్యాంక్ షేర్ విలువ 8 శాతానికిపైగా పుంజుకున్నది. రూ.45.60 వద్దకు చేరింది. బ్యాంక్‌లోకి కొత్త పెట్టుబడులు రానున్నాయన్న అంచనాలు మదుపరులను మెప్పించాయి. యాక్సిస్ బ్యాంక్, బజాజ్ ఆటో, భారతీ ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ బ్యాంక్, హీరో మోటోకార్ప్, బజాజ్ ఫైనాన్స్ షేర్ల విలువ కూడా 2.53 శాతం పెరిగింది. అయితే డిపాజిటరీ సీడీఎస్ఎల్ దెబ్బకు డీహెచ్ఎఫ్ఎల్ షేర్ విలువ 7.52 శాతం దిగజారింది. ఆర్థిక ఫలితాల ప్రకటన ఆలస్యం కావడంతో ప్రమోటర్ల వాటాలను స్తంభింపజేసింది.

### రీట్‌లపై విదేశీ మదుపరుల ఆసక్తి

రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్స్ (ఆర్ఈఐటీ లేదా రీట్), ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్స్‌లపై విదేశీ మదుపరులు ఆసక్తిని చూపిస్తున్నారని మార్కెట్ రెగ్యులేటర్ సెబీ చైర్మన్ అజయ్ త్యాగి తెలిపారు. అమెరికాలో గత వారం చాలామంది విదేశీ మదుపరులను కలిశామని, సెబీ నిర్ణయాలను వారు స్వాగతించారని చెప్పారు. గత నెల 30 నుంచి ఈ నెల 4 వరకు న్యూయార్క్, బోస్టన్, వాషింగ్టన్ డీసీల్లో అక్కడి పరిశ్రమ, పెట్టుబడిదారులతో సమావేశాలు నిర్వహించినట్లు ఓ ప్రకటనలో త్యాగి తెలియజేశారు. రీట్, ఇన్‌ఫ్రా ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్స్‌ల్లో 10 బిలియన్ డాలర్లకుపైగా ఆస్తులున్నాయి.

### 6 రోజుల్లో రూ.6.21 లక్షల కోట్లు మటాష్



**భారతీయ** స్టాక్ మార్కెట్లు వరుస నష్టాల్లో కొట్టుమిట్టాడుతుండటంతో మదుపరుల సంపద లక్షల కోట్ల రూపాయల్లో ఆవిరైపోతున్నది. గడిచిన ఆరు సెషన్లలో సూచీలు నష్టాలకే పరిమితమవగా, బీఎస్ఈలోని మదుపరుల సంపద ఈ ఆరు రోజుల్లో రూ.6.21 లక్షల కోట్లు హరించుకుపోయింది. సెప్టెంబర్ 26న రూ.1,48,45,854.70 కోట్లుగా ఉన్న బీఎస్ఈలోని సంస్థల విలువ.. అక్టోబర్ 7 (సోమవారం)న రూ.1,42,24,897.46 కోట్లకు తగ్గింది. అంతర్జాతీయ ఆర్థిక ప్రతికూల సంకేతాలు, దేశీయ ఆర్థిక మందగమనం ప్రభావం స్టాక్ మార్కెట్లపై స్పష్టంగా కనిపిస్తున్నదని నిపుణులు అంటున్నారు.

## జీఎమ్మార్ థర్మల్ పవర్‌పై జేఎస్‌డబ్ల్యూ కన్ను

- ఒడిషా ప్లాంట్ కొనుగోలుకు చర్చలు

**న్యూఢిల్లీ, అక్టోబర్ 7:** ఒడిషాలోని జీఎమ్మార్ థర్మల్ పవర్ ప్లాంట్‌ను దక్కించుకునేందుకు జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ గట్టిగా ప్రయత్నిస్తున్నది. జీఎమ్మార్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌తో చర్చలనూ జరుపుతున్నది. ఈ విషయాన్ని స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు ఇరు సంస్థలూ తెలియజేశాయి. 'ఒడిషాలో జీఎమ్మార్ ఎనర్జీ లిమిటెడ్ అనుబంధ సంస్థ జీఎమ్మార్ కమలంగ ఎనర్జీ లిమిటెడ్ 1,050 మెగావాట్ల థర్మల్ పవర్ ప్లాంట్‌ను నిర్వహిస్తున్నది. దీన్ని కొనుగోలు చేసేందుకు జీఎమ్మార్ ఎనర్జీ లిమిటెడ్‌తో చర్చలు జరుపుతున్నాం' అని జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ బీఎస్ఈకి తెలిపింది. అయితే ఈ డీల్ విలువ ఎంతన్నది మాత్రం తెలియరాలేదు. మరోవైపు ఈ నేపథ్యంలో బీఎస్ఈలో జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ షేర్ విలువ 2.02 శాతం పెరిగితే, జీఎమ్మార్ ఇన్‌ఫ్రా షేర్ విలువ 0.91 శాతం పడిపోయింది.

## మనీ లాండరింగ్ అడ్డుకట్టకు ఉన్నతస్థాయి కమిటీ

**రెవిన్యూ కార్యదర్శి నేతృత్వంలో ఏర్పాటు చేసిన కేంద్రం**

**న్యూఢిల్లీ, అక్టోబర్ 7:** మనీ లాండరింగ్ కార్యాకలాపాల అడ్డుకట్టకు ఓ ఉన్నతస్థాయి కమిటీని సోమవారం కేంద్ర ప్రభుత్వం నియమించింది. 19 మంది సభ్యుల ఈ ఇంటర్-మినిస్టీరియల్ కో-ఆర్డినేషన్ కమిటీకి రెవిన్యూ కార్యదర్శి అజయ్ భూషణ్ పాండే చైర్మన్‌గా వ్యవహరిస్తారు. ఈ ప్యానెల్‌కు ఐదుగురు కార్యదర్శులుండగా, వారిలో ఆర్థిక సేవలు, ఆర్థిక వ్యవహారాలు, కార్పొరేట్ వ్యవహారాలు, విదేశీ వ్యవహారాల శాఖల కార్యదర్శులుంటారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఇంటెలిజెన్స్ బ్యూరో డైరెక్టర్‌తోపాటు సెబీ, ఐఆర్‌డీఏఐ, సీబీఐసీ, సీబీడీటీ చైర్మన్లు, ఆర్బీఐ డిప్యూటీ గవర్నర్ తదితరులు సభ్యులుగా ఉండనున్నారు. తీవ్రవాదానికి ఆర్థిక సాయం వంటి పలు చట్ట వ్యతిరేక కార్యకలాపాల నియంత్రణకూ ఈ కమిటీ పనిచేయనున్నది.



## ఈసారికింతే..!

**ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వాణిజ్య వాహనాల అమ్మకాలు స్వల్పం: ఇక్రా**

**న్యూఢిల్లీ, అక్టోబర్ 7:** దేశీయ మార్కెట్‌లో వాణిజ్య వాహనాల పరిశ్రమ ముఖచిత్రం ఆశాజనకంగా లేదని రేటింగ్ ఏజెన్సీ ఇక్రా అభిప్రాయపడింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2019-20) మొత్తంగా కూడా ఆశించిన స్థాయిలో వాణిజ్య వాహనాల అమ్మకాలు ఉండకపోవచ్చని సోమవారం అంచనా వేసింది. బీఎస్-6 కర్బన ఉద్గారాల నిబంధనలు వంటివి ప్రతికూలం కావచ్చన్న ఇక్రా.. రిటైల్ అమ్మకాలు లేక డిలర్‌షిప్‌లలో పేరుకుపోయిన వాహనాలపై ఒకింత ఆందోళన వ్యక్తం చేసింది. హోల్‌సేల్ అమ్మకాలు కూడా ప్రభావితమవుతాయని ఇక్రా రేటింగ్స్ ఉపాధ్యక్షుడు శంషేర్ దీవాన్ ఓ ప్రకటనలో తెలిపారు. గతంతో పోల్చితే ఈసారి దేశీయ వాణిజ్య వాహన పరిశ్రమ వృద్ధిరేటు 10-12 శాతం పడిపోగలదన్నారు. మధ్య శ్రేణి, భారీ వాణిజ్య వాహనాల అమ్మకాలు బాగా తగ్గే వీలుందని అంచనా వేశారు. దేశీయ ఆటో పరిశ్రమ ప్రస్తుతం తీవ్ర ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. ప్యాసింజర్ వాహనాల అమ్మకాలు కూడా దారుణంగా పతనమైన సంగతీ విదితమే. ఆర్థిక మందగమనం ప్రభావం స్పష్టంగా కనిపిస్తుండగా, కేంద్ర ప్రభుత్వం ఉద్దీపనల్నీ ప్రకటించింది. అయినప్పటికీ ఆటో పరిశ్రమ కోలుకున్న సంకేతాలు మాత్రం కానరావడం లేదు. చివరకు ఆటో మొబైల్ రంగంలో వేలాది ఉద్యోగాలూ పోతున్నాయి. ఈ క్రమంలో వాణిజ్య వాహన పరిశ్రమ కూడా అంతంతేనని ఇక్రా తేల్చేసింది.

## ఇక ఫేస్‌లెస్ ఈ-అసెస్‌మెంట్

**ట్యాక్స్‌పేయర్ల కోసం ప్రారంభించిన ఐటీ శాఖ**

**న్యూఢిల్లీ, అక్టోబర్ 7:** ఆదాయం పన్ను (ఐటీ) శాఖ సోమవారం ఫేస్‌లెస్ ఈ-అసెస్‌మెంట్ స్కీంను ప్రారంభించింది. రెవిన్యూ కార్యదర్శి అజయ్ భూషణ్ పాండే దీన్ని ఇక్కడ అధికారికంగా ఆవిష్కరించారు. నిజానికి కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ దీన్ని ప్రారంభించాల్సి ఉన్నది. అయితే ప్రధాన మంత్రితో భేటీ, మరికొన్ని కీలక సమావేశాల కారణంగా ఆమె ఈ కార్యక్రమానికి హాజరు కాలేకపోయారు. కాగా, మదింపు అధికారులకు, ట్యాక్స్‌పేయర్‌కు మధ్య సమన్వయానికి ఈ నూతన విధానం దోహదపడగలదని ఐటీ శాఖ భావిస్తున్నది. ఈ కొత్త పథకం కోసం 58,322 ఐటీ కేసులను పరిశీలనార్థం అధికారులు ఎంపిక చేశారు. పన్ను చెల్లింపుదారుల సౌకర్యార్థమే దీన్ని అందుబాటులోకి తెచ్చామని పాండే ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్నారు.

## మార్కెట్లోకి సరికొత్త బీఎండబ్ల్యూ ఎం5 కాంపిటీషన్

**న్యూఢిల్లీ, అక్టోబర్ 7:** జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల తయారీ సంస్థ బీఎండబ్ల్యూ.. భారతీయ మార్కెట్లోకి సోమవారం తమ ప్రీమియం సెడాన్ ఎం5 కాంపిటీషన్ అప్‌డేట్ వెర్షన్‌ను తీసుకొచ్చింది. దీని విలువ రూ.1.55 కోట్లు (ఎక్స్‌షోరూం). 8-సిలిండర్ పెట్రోల్ పవర్‌ట్రైన్‌తో వస్తున్న ఈ కారు.. కేవలం 3.3 సెకండ్లలో 0 నుంచి 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకోగలదు. 625 హెచ్‌పీ ఇంజిన్, 8-స్పీడ్ ట్రాన్స్‌మిషన్ దీని సొంతమని ఈ సందర్భంగా బీఎండబ్ల్యూ గ్రూప్ ఇండియా అధ్యక్షుడు, సీఈవో రుద్రతేజ్ సింగ్ తెలిపారు. అన్ని బీఎండబ్ల్యూ డీలర్‌షిప్‌లలో ఈ కారు అందుబాటులో ఉంటుందన్నారు.




ధర రూ.1.55 కోట్లు


**తెలంగాణ ప్రభుత్వం**
**అటవీ శాఖ**

**ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన**

లేఖ నెం. 1138/2019/N5, తేది: 05.10.2019

నిర్మల్ జిల్లా, ఖానాపూర్ రేంజి పరిధిలోని ఖానాపూర్ హరిత వనం (మస్కాపూర్ రిజర్వు ఫారెస్ట్) చుట్టూ ఇనుప కంచె వేయుటకై నమోదిత కాంట్రాక్టర్లు, / పని అనుభవము గల సంస్థల నుండి విడి విడిగా సీల్డ్ టెండర్లు కోరబడుచున్నవి. పనుల వివరాలు 1) కంపార్ట్‌మెంట్ నెం. 894 పరిధిలో దాదాపుగా 2000 మీటర్లు ECV- రు. 74,75,234=00, పైన తెలిపిన పనికి టెండర్లు కోరబడుచున్నవి. బిడ్ దాఖలు డౌన్‌లోడ్ ప్రారంభం తేది: 14-10-2019, 10:30 నుండి 29-10-2019 మ. 2.00 గం.ల వరకు. సాంకేతిక బిడ్ తెరచు తేది: 29-10-2019, సా|| 3.30 గం.లకు, వాణిజ్య బిడ్ తెరచు తేది: 31-10-2019, మ|| 3.00 గం.లకు. తదుపరి వివరములకై www.eprocurement.gov.in దర్శించగలరు. ఫోన్ నం. 9493314794

సం/- జిల్లా అటవీ అధికారి, నిర్మల్

DIPR RO. No.1349-DP/CL/Advt/1/2019-20. Dt: 7/10/2019

**తెలంగాణ ప్రభుత్వం**
**ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ శాఖ**

**టెండరు ప్రకటన**

2019-2021 కాలవ్యవధి కొరకు లాట్ల యొక్క డ్రా ద్వారా ప్రభుత్వం మద్యం రిటైల్ (A4) షాపుల కేటాయింపుని ప్రకటించడం జరిగింది. లాట్ల యొక్క ఏర్పాటు నుండి డ్రా తీయుట వరకు దిగువ సంతకందారునికి మార్గదర్శకాలు మరియు దరఖాస్తుదారులకు సూచనలు మరియు వర్తించబడు రిటైల్ షాప్ ఎక్సైజ్ ట్యాక్స్‌తో పాటుగా జిల్లా నందు లభ్యత గల షాపుల సంఖ్యకు సంబంధించి దిగువ సంతకందారు ఈ నోటిఫికేషన్‌ను జారీ చెయ్యడం జరిగింది. నోటిఫికేషన్ యొక్క జారీ: 09-10-2019. దరఖాస్తు స్వీకరణ : సంబంధిత ఎక్సైజ్ జిల్లా కార్యాలయాలు/ DC కార్యాలయాలు/ CPE కార్యాలయం. దరఖాస్తు(ల) స్వీకరణ తేది : 09-10-2019 నుండి 16-10-2019 (ఆదివారం 13-10-2019 మినహాయించి) దరఖాస్తు(ల) దాఖలుకు చివరి తేది : 16-10-2019 https://www.tsbcl.nic.in, https:www.tsbcl.telangana.gov.in పై సమాచారం లభిస్తుంది. దరఖాస్తు(ల) స్వీకరణ సమయం: ఉ|| 10.00 గం|| నుండి సా. 4.00 గం||, లాట్‌ను డ్రా తీయుట : తేది : 18-10-2019 సమయం : ఉ|| 11.00 గం|| (సూర్యాపేట రెవిన్యూ జిల్లా కొరకు ఎలక్షన్ కోడ్ కారణం చేత లాట్ డ్రా తీయు తేది తర్వాత ప్రకటించబడును). 1వ వాయిదా యొక్క చెల్లింపు తేది : 18-10-2019న లేదా తదుపరి పనిరోజున.

సం/- సోమేష్ కుమార్, కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ & ఎక్సైజ్

DIPR RO No. 1341-DP/CL/Advt/1/2019-20, Dt: 07/10/2019

## అబుదాబిలో వరల్డ్ రోడ్ కాంగ్రెస్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ రాజధాని అబుదాబిలో 26వ వరల్డ్‌రోడ్ కాంగ్రెస్ ప్రారంభమైంది. ఈ నెల 6 నుంచి 10 వరకు జరుగుతున్న ఈ కార్యక్రమాన్ని క్రౌన్‌ప్రిన్స్ కోర్ట్ చైర్మన్ హెచ్‌హెచ్ షేక్ హమీద్ బిన్ జయిద్ అల్ నాయాన్ ప్రారంభించారు.




## గ్రీన్‌చాలెంజ్‌ను స్వీకరించిన మహేశ్ బిగాల



అమెరికాలో మొక్క నాటుతున్న టీఆర్ఎస్ ఎన్ఆర్ఐ కోఆర్డినేటర్ మహేశ్ బిగాల

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాజ్యసభసభ్యుడు సంతోష్‌కుమార్ విసిరిన గ్రీన్‌చాలెంజ్‌ను టీఆర్ఎస్ ఎన్నారై కోఆర్డినేటర్ మహేశ్ బిగాల స్వీకరించి అమెరికాలో మూడు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హరితహారంలో భాగంగా ఎంపీ సంతోష్‌కుమార్ ప్రారంభించిన గ్రీన్‌చాలెంజ్ ఉద్యమంలా విస్తరిస్తున్నదని చెప్పారు. టీఆర్ఎస్ అమెరికా విభాగం నాయకుడు మహేశ్ తన్నీరు, యూకే టీఆర్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్యామ్ బాబు, బహ్రయిన్ టీఆర్ఎస్‌శాఖ అధ్యక్షుడు రాధారపు సతీశ్, సౌత్ ఆఫ్రికాశాఖ అధ్యక్షుడు నాగరాజు గుర్రాలకు ఆయన గ్రీన్ చాలెంజ్ విసిరారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ ఎన్నారై నాయకులు శ్రీనివాస్ గనగోని, దేవేందర్ నల్లమాడ, శ్రీనివాస్ మల్లై, వెంకట్ పాల్గొన్నారు.

# వాహన కొనుగోళ్లలో రికార్డు

- పెరిగిన వ్యవసాయం, నిర్మాణరంగం యంత్ర పరికరాల కొనుగోళ్లు
- అపూర్వ అభివృద్ధిని సాధించిన రాష్ట్రం
- గణాంకాలతో సహా సీఎస్ ఎస్కే జోషి ట్వీట్

**ప్రత్యేకప్రతినిధి, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో వ్యవసాయం, నిర్మాణరంగ యంత్రపరికరాల కొనుగోళ్లు అనూహ్యంగా పెరిగిపోతున్నాయి. మోటరు వాహనాల కొనుగోళ్లూ గణనీయంగా పెరిగాయి. తెలంగాణ ఆవిర్భావం తర్వాత ప్రభుత్వం తీసుకున్న ప్రత్యేక అభివృద్ధి కార్యక్రమాల ఫలితంగా రాష్ట్రం అన్ని రకాలుగా అభివృద్ధి చెందుతున్నది. ఆర్థికంగా గణనీయ వృద్ధి రేటును సాధించింది. ఫలితంగా ప్రజల కొనుగోలు శక్తి పెరిగింది. వ్యవసాయరంగంలో విప్లవాత్మక మార్పుల వల్ల ట్రాక్టర్లు, ట్రాలీలు, పంట కోత యంత్రాల కొనుగోళ్లు దాదాపు 90శాతం పెరిగాయి. తెలంగాణలో సాగునీటి పథకాలతో సాగు విస్తీర్ణం కోటి ఎకరాలు దాటింది. రాష్ట్రవ్యాప్తంగా 1.10 కోట్ల ఎకరాల్లో పంట సాగవుతున్నది. రాష్ట్ర సంపదతోపాటు ప్రజల తలసరి ఆదాయం రెట్టింపుకావడం వల్ల వివిధ రకాల వాహనాల కొనుగోళ్లు ఊహించని రీతిలో పెరిగాయి. రాష్ట్రంలో వ్యవసాయ, నిర్మాణరంగాల్లో యంత్రపరికరాలు, రవాణారంగంలో వాహనాల కొనుగోళ్లు రికార్డుస్థాయిలో పెరిగాయని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి వెల్లడించారు. గణాంకాలతో సహా ఆయన ట్వీట్‌చేశారు. 2014నుంచి 2019వరకు ట్రాక్టర్ల కొనుగోళ్లు 90.39శాతం, ట్రాలీల కొనుగోళ్లు 68.36 శాతం, పంటకోత యంత్రాలు 99.9శాతం, నిర్మాణరంగ పరికరాలు 92.48 శాతం, వివిధ రకాల వాహనాల కొనుగోళ్లు 71.4శాతం పెరిగినట్టు వెల్లడించారు. దీనిని ఒక అపూర్వ అభి'వృద్ధి'గా ఆయన అభివర్ణించారు.

### 2014 తర్వాత కొనుగోళ్ల శాతం పెరిగిన తీరు ఇలా..

| వాహనాలు/ యంత్రపరికరాలు | 2014వరకు కొనుగోళ్లు | మొత్తం వాహనాలు | పెరిగిన వాహనాలు | వృద్ధిరేటు(%) |
|---|---|---|---|---|
| ట్రాక్టర్లు | 1,50,843 | 2,87,199 | 1,36,356 | 90.39 |
| పంటకోత యంత్రాలు | 6,431 | 12,856 | 6,425 | 99.9 |
| ట్రాలీలు | 1,18,468 | 1,99,457 | 80,989 | 68.36 |
| నిర్మాణరంగం యంత్రపరికరాలు | 13,772 | 26,508 | 12,736 | 92.48 |
| వివిధ రకాల మొత్తం వాహనాలు | 71,52,000 | 1,22,58,433 | 51,06,433 | 71.4 |












నమస్తే తెలంగాణ
జిందగీ
మంగళవారం 8 అక్టోబర్ 2019 WWW. NTNEWS.COM /nt.zindagi



# విశ్వజననికి విజయ వందనం!

**యావత్ ప్రపంచంలో భగవంతుని అభివ్యక్తీకరణను అర్థం చేసుకున్నవారిలో ఏకత్వం భాసిస్తుంది. వ్యక్తిగత జీవితం, సామాజిక జీవితం అనే భిన్న భావమే వారిలో ఉండదు. అత్యున్నతం, అతిసుందర భావజనితం, ఆనందప్రదాయకం అయిన 'అమ్మ' భావన విశ్వమానవ సౌభ్రాతృత్వానికి ఆస్కారమిస్తుంది. సృష్టిలోని జీవరాశినంతటినీ ఒక్క తాటి పైకి తీసుకొచ్చి అమ్మలగన్న అమ్మగా నిత్యరక్షణ చేస్తుంది. సకల లోకాలనూ ఏలే దేవతలకు పాలనాశక్తినీ, పోషణాశక్తినీ అందించే కరుణాకలిత జగన్మాత. నిఖిల తారాగణం, సూర్యాదిగ్రహగణం, సమస్తదేవతా గణం, సకల జీవకోటిగణం 'అమ్మ'గా కొలిచేందుకు సిద్ధపడే శుభతరుణం విజయదశమి పర్వదినం.**

**అఖిలాండకోటి** బ్రహ్మాండనాయకి, ఆదిపరాశక్తి శ్రీ చక్రంలో ఆసీనురాలై దుష్టశిక్షణ, శిష్ట రక్షణ చేస్తుంది. వివిధ అవతారాలలో అనేక లీలలను ప్రదర్శిస్తూ.. సృష్టి, స్థితి.. సంహారకర్తగా విరాజిల్లుతుంది. ప్రపంచంలోని బలహీనతలన్నింటినీ పారదోలే మహాశక్తి 'అమ్మ'. ఆత్మశక్తినీ, సంయమన శక్తినీ, శారీరక శక్తినీ, మానసిక శక్తినీ, దివ్యశక్తినీ, వాక్శక్తినీ, ధైర్య శక్తినీ, సహనశక్తినీ ప్రసాదించే ఆది పరాశక్తి విశ్వచైతన్య శక్తిగా పరిఢవిల్లింది. సర్వదశలలోనూ.. దిశలలోనూ శక్తిరూపమై జగత్తును పులకితం చేస్తుంది.

**అంతా శక్తిమయం:** ప్రపంచమంతా శక్తికి ప్రతిరూపమే. 'శక్తి' అన్న పదం ప్రపంచంలోని అన్ని శక్తులనూ జాగృతపరుస్తుంది. 'సర్వం శక్తిమయం' అన్న విశ్వసత్యానికి ప్రాణప్రతిష్ఠ చేస్తుంది. జీవించడానికి ఊతమందించే బలమైన ఇచ్ఛాశక్తి, జీవితాన్ని అర్థపరిచే జ్ఞానశక్తి, జీవితానికి కర్తవ్య ప్రబోధం చేసే క్రియాశక్తి ముఖ్యభూమికలై నిత్యసత్య చైతన్య శక్తికి ప్రతీకలై జగన్మాత ఆశీర్వాద ఫలంగా విశ్వవైభవాన్ని ఇనుమడింపజేస్తున్నాయి. ప్రతీ మాతృస్థానంలోనూ, ప్రతీ ప్రకృతి శక్తిలోనూ, ప్రతీ శక్తికార్యంగానూ ఉన్న, ఉంటున్న, ఉండబోతున్న ఆత్మశక్తి జగన్మాతే. అటువంటి శక్తి ఆరాధనా ప్రతీకయైన విజయదశమి లోకంలోని చెడును రూపుమాపే మంచిని ప్రేరేపించే శక్తి ప్రతిష్ఠా వేదికలా అలరారుతుంది. విశ్వశక్తి విలాసాన్ని తెలియపరుస్తుంది. విశ్వ వికాసానికీ, ప్రాణికోటి ప్రచలనానికీ ఆదిపరాశక్తి అనుగ్రహమే మూలం.

**అపరాజిత 'దుర్గ':** 'దుర్గం గమయతీతి దుర్గ'– దుర్గమమైన స్థితిని దాటించగల జగజ్జనని దుర్గ. ధర్మహాని, లోకకంటకాలనే విఘాతాలను కలిగించే అసురశక్తులను కాలరాసే సకల దేవతా సమూహశక్తియే దుర్గగా ఆవిర్భవించిందని పురాణోక్తం. జ్ఞాన, ఐశ్వర్య, శక్తి స్వరూపాలను ఏకరూపంగా భావించి 'దుర్గ'గా ఆరాధించడం అనాదిగా వస్తున్న సదాచారం. దుర్గాదేవి నామాన్ని ఒక మహామంత్రంగా వ్యక్తీకరించింది వేదవాఙ్మయం. 'దుర్గ' అనే పదానికి అర్థశక్తితోపాటు శబ్ద శక్తి కూడా ఉండడం విశేషం. 'దుర్గా' అంటూ నోరారా పిలిచినంతనే జీవన్ముక్తిని ప్రసాదిస్తుందని వ్యాసప్రోక్తం.

'తామగ్నివర్ణాం తపసా జ్వలంతీం
వైరోచనీం కర్మఫలేషు జుష్టామ్।
దుర్గాం దేవిగం శరణమహం ప్రపదేన
సుతరసి తరసే నమః ।।'

**అగ్నిలా స్వచ్ఛమైంది:** నిత్య తపఃశక్తితో ప్రకాశించేదీ. విభిన్న లోకరక్షణ శక్తులుగా దేవతలను వ్యక్తపరిచిందీ, సకలలోక శక్తిగా నెలకొన్నదీ అయిన దుర్గాదేవిని శరణుకోరితే దుఃఖసాగరం నుంచి తీరానికి చేర్చే విరాజితగా అలరారుతుంది. సహించలేని కష్టాలనూ, సాధించలేని క్రియలనూ దుఃఖంగా, దుర్మార్గంగా, దుస్సాధ్యంగా, దుష్టత్వంగా, దురాచారంగా, దుర్గతిగా 'దుః' శబ్దంతో నిర్వచిస్తారు. వీటన్నింటినీ నశింపజేసే అపరాజితే దుర్గ. విశ్వంలోని దుఃఖాలను పోగొట్టే సమర్థురాలు. అపార సంసార సాగరాన్నీ తరింపజేసే రక్షకురాలు అయినటువంటి 'దుర్గ'ను ఎంతటి క్లిష్టపరిస్థితులలోనైనా, ఎటువంటి దైన్యహైన్య స్థితులలోనైనా సంయమనంతో ఆరాధిస్తే, వారి వారి బాధలన్నింటినీ తానే స్వయంగా పోగొడతానని అమ్మవారే వరప్రదానం చేసిందని చెబుతుంది దేవీభాగవతం. దేనిని మించిన తత్త్వం మరొకటి లేదు. ఆ దివ్యత్వమే 'దుర్గ' అని శ్రుతి వాక్యం. మాటకీ, మనసుకీ అందని అంతర్యామిత్వం అనిర్వచనీయమై 'దుర్గ'గా భాసిల్లింది.

**శక్తి నాట్యమే ఈ ప్రపంచం :** ఎక్కడెక్కడ జీవకోటి వల్ల అసాధారణ శక్తి ప్రకటితమవుతుందో అక్కడక్కడ నెలవై ఉంటుంది ఆదిశక్తి. విశ్వజనీనమైన సమస్త ఆదర్శాలనూ తనలో ఇముడ్చుకొనగలిగినంత ఉదారం, విశాలం శాక్తేయం.

'అహమేవ దాత ఇవ ప్రవమ్యారభమాణా భువనాని విశ్వా ।
పరోదివా పర ఏనా పృథివ్యై తాతతీ మహినా సంభభూవ ।।

ఆకాశం కంటే ఉన్నతమై, భూమికంటే ఉన్నతమై అంతటా, అన్నింటా నేనే అయి సమస్తలోకాలనూ సృజిస్తుంటాను. అన్నింటిలోనూ విరాజిల్లుతానని జగన్మాతే స్వయంగా ప్రకటించుకుందని ఋగ్వేదం చెబుతున్నది. భక్తి కోసమే భక్తి. ధర్మం కోసమే ధర్మం. కర్మ కోసమే కర్మ అనే ఉత్కృష్ట ఆదర్శాన్ని అనుసరించి దేవీ ఆరాధన కొనసాగుతుంది. అణువణువులోనూ తానే అయి భాసిల్లే ఆదిశక్తి ఆరాధన మనలోని అరిషడ్వర్గాలు. కామ, క్రోధ, లోభ, మద, మోహ, మాత్సర్యాలను తొలిగించి ప్రేమ, ఆప్యాయత, అనురాగం, మమత, మానవత, అభిమానం అనే షడ్గుణ సంపత్తిని కలిగించేందుకే ఆ అమ్మ ఉంది. ప్రపంచంలోని సమస్తం ప్రకృతిలో లీనమయ్యేందుకు ప్రళయాన్ని ఆశ్రయించక తప్పదు. కానీ ఆదిశక్తి మాత్రం మూలరూపమై ప్రళయంలోనూ చెక్కు చెదరక ఉంటుంది.

**భారతీయ దృక్పథం దసరా:** ప్రపంచాన్ని ఏలే ఆదిశక్తిని భారతీయులంతా ఆరాధించుకునే ప్రత్యేకత విజయ దశమికే సొంతం. భిన్నత్వంలో ఏకత్వాన్ని ఆపాదించుకున్న భారతీయత శక్తి ఆరాధనతో మమేకమై విశ్వకల్యాణాన్ని కాంక్షిస్తుంది. విజయదశమి అంటే కేవలం పండుగే ఆదు అనాదిగా వస్తున్న విశిష్ఠ సంప్రదాయం. విజయదశమి అంటే విజయాల వెలుగనే కాదు, విలువలను తెలియజెప్పే విశేష పండుగ. అనుబంధాలనూ, అభివృద్ధినీ కాంక్షించే పండుగ. సహజ ప్రవృత్తికి దగ్గరగా మనుషులనూ, మనసులనూ మళ్ళించే పండుగ. జీవశక్తిని ప్రపంచ శక్తిగా, విశ్వశక్తిని జీవశక్తిగా పరిణమింపజేసే ఆనందాల, ఆకాంక్షల దసరా పండుగ. ఆదిశక్తి ప్రాధాన్యమైన ఆరాధనోత్సవాలు, విజయదశమి సంబరాలు మానవీయతను చాటే ఉన్నత శిఖరాలుగా వర్ధిల్లాలనీ, అమ్మ ఆరాధన విశ్వారాధనై పరిఢవిల్లాలనీ కోరుకునే శుభ సంకల్పం దసరా ఇచ్చే సదవకాశంగా భావించాలి.

"సర్వమంగళ మాంగళ్యే శివే సర్వార్థసాధికే,
శరణ్యే త్ర్యయంబకే గౌరి నారాయణి నమోస్తుతే"

'అమ్మ దయ ఉంటే అన్నీ ఉన్నట్లే' అని విశ్వసిస్తూ జీవితతత్త్వాన్ని తెలుసుకునే ప్రయత్నం విజయదశమి శుభారంభాన ప్రారంభిద్దాం.

**ఇట్టేడు అర్కనందనాదేవి**






## ఇంటర్వెన్షనల్ పల్మనాలజీ చికిత్సలతో

# కొత్త ఊపిరి



**ఛాతీలోని ఊపిరితిత్తులను ఎంత స్పష్టంగా చూడగలిగితే వాటిలోని సమస్యలను అంత బాగా అర్థం చేసుకోవచ్చు. చికిత్స కూడా సులభతరం అవుతుంది. సరిగ్గా ఇలాంటి వెసులు బాటును కలిగించింది ఇంటర్వెన్షనల్ పల్మనాలజీ. ప్రాణాంతకంగా పరిణమించే ఊపిరితిత్తుల వ్యాధులు, ఇబ్బందులను కచ్చితంగా కనిపెట్టడమే కాకుండా వాటికి సరైన చికిత్సలు అందించడం దీని ద్వారా సులువైంది. ప్రాణాంతకంగా పరిణమించే స్వైన్ ఫ్లూ మొదలుకుని మందులకు లొంగని ఉబ్బసం, శ్వాసనాళాల్లో ఇరుక్కున్న వస్తువులు, పదార్థాలు, ఊపిరితిత్తులకు సంబంధించిన రుగ్మతలు, ఇబ్బందులను సత్వరమే కనిపెట్టి, పరిష్కారం చూపే అత్యాధునిక చికిత్సలు ఇప్పుడు అందుబాటులోకి వచ్చాయి.**

## మేలైన చికిత్స.. బ్రాంకోస్కోపీ

**ఆమె ఏడాది కాలంగా న్యుమోనియాతో బాధపడుతున్నది.. మందులు వాడినప్పుడు తగ్గుతూ, తిరగబెడుతూ పదే పదే పీడించే ఆ వ్యాధితో ఆమె దైనందిన జీవితం నరకంగా మారింది. శ్వాసకోశాలు సమర్థంగా పనిచేయకపోవడం వల్ల శరీరం నీలం రంగులోకి మారిపోవడం మొదలు పెట్టింది. చివరకు సమస్య ప్రాణాంతకమైంది. అప్పుడు లోతైన పరీక్షలు చేసి వైద్యులు చెప్పిన కారణం విని ఆమె షాకయ్యింది..ఆమె ఇబ్బందికి అసలు కారణం.. ఏడాది క్రితం భోజనం చేస్తుండగా పొరపాటున శ్వాసనాళంలోకి చేరిన కందిపప్పు బద్ద ఊపిరితిత్తుల్లోకి చేరుకోవడమే. ఇది చిన్న సమస్యగానే అనిపించినా అదే చివరికి ప్రాణాల మీదకు తెచ్చింది.**

**ఇలా** ఆమెకే కాదు.. ఎంతో మందికి జరుగుతుంటుంది. కానీ నిర్లక్ష్యం చేస్తుంటారు. పసిపిల్లలు ఆటల్లో భాగంగా పిన్నీసులు మింగేస్తూ ఉంటారు. అవి కాస్తా శ్వాసనాళాల్లో ఇరుక్కుంటాయి. ఇంకొందరికి భోజనం చేస్తుండగా నవ్వినప్పుడు, పొలమారి అన్నవాహికలోకి వెళ్లాల్సిన ఆహార పదార్థాలు శ్వాసనాళాల్లోకి చేరిపోతూ ఉంటాయి. ఇవన్నీ అప్పటికప్పుడు తీవ్రమైన ఇబ్బంది కలిగించకపోయినా దీర్ఘ కాలంలో ఊపిరితిత్తులను దెబ్బతీస్తాయి. లక్షణాలు కూడా సాధారణ దగ్గును పోలి ఉండడంతో చికిత్స కూడా పక్కదారి పడుతూంటుంది. అయితే ఈ సమస్యను కచ్చితంగా కనిపెట్టగలిగే పరీక్ష ఒక్కటే.. అదే బ్రాంకోస్కోపీ.

### పరీక్ష, చికిత్స ఒకేసారి

ఊపిరితిత్తులకు గాలి చేరవేసే శ్వాసనాళాలను బ్రాంకోస్కోపీ ద్వారా పరీక్షించవచ్చు. బ్రాంకోస్కోపీ ద్వారా ఊపిరితిత్తుల్లోకి వెళ్లే గాలి గొట్టాలను స్పష్టంగా పరీక్షించవచ్చు. ఈ భాగాల్లో ఇరుక్కుపోయిన ఆహార పదార్థం లేదా వస్తువును కనిపెట్టి, వెంటనే బయటికి తీసుకురాగల టూ ఇన్ వన్ టెక్నిక్ ఇది. ఈ చికిత్సను రిజిడ్ బ్రాంకోస్కోపిక్ ఫారిన్ బాడీ రిమూవల్ అంటారు. ఇలా ఇరుక్కునే వాటిలో ఆహార పదార్థాలకు సంబంధించిన పల్లీలు, కూరగాయ, మాంసం ముక్కల వంటి వాటిని ఆర్గానిక్ అనీ, లోహపు ముక్కలు, పిన్నీసులు, చెక్కముక్కల లాంటి వాటిని నాన్ ఆర్గానిక్ ఫారిన్ బాడీస్ అనీ అంటారు. ఆర్గానిక్ రకమైన పదార్థాలు ఎక్కువ ప్రమాదకరమైనవి. ఇవి సాధారణ వాతావరణంలో లాగానే శ్వాసనాళాల్లో ఇరుక్కున్నప్పుడు కూడా కుళ్లిపోతాయి. వాటి సైజు పెరుగుతుంది. వాటి నుంచి రసాయనాలు విడుదలై కెమికల్ న్యూమొనైటిస్ అనే తీవ్రమైన సమస్య మొదలవుతుంది. నాన్ ఆర్గానిక్ బాడీస్ ఇలా కుళ్లిపోవు. కాని చికిత్స ఆలస్యమయ్యే కొద్దీ ఊపిరితిత్తుల్లో కొంత భాగానికి గాలి చేరక న్యుమోనియా సమస్య వస్తుంది. అయితే వీటిని ఎక్స్‌రేలో కనిపెట్టవచ్చు. కానీ ఆర్గానిక్ పదార్థాలు ఎక్స్‌రేలో కనిపించవు. కానీ ఆ పదార్థం పక్కనున్న ఊపిరితిత్తిలోని కొంత భాగం ఎక్స్‌రేలో నల్లగా కనిపిస్తుంది. దాన్నిబట్టి ఆ భాగాన్ని బ్రాంకోస్కోపీ ద్వారా తొలగించవచ్చు.




### క్యాన్సర్ గడ్డనూ తొలగించొచ్చు

కొన్నిసార్లు క్యాన్సర్ గడ్డలు ఊపిరితిత్తుల్లోని స్పాంజ్‌లోపల ఏర్పడుతాయి. వీటిని కీమో, రేడియేషన్ లేదా సర్జరీ ద్వారా తొలగిస్తారు. కొన్ని క్యాన్సర్లు ఊపిరి తీసుకునే గొట్టాల లోపల పుడతాయి. ఇలా ఊపిరి తీసుకోవడానికి అడ్డం పడే ఈ గడ్డలను సర్జరీ అవసరం లేకుండానే రిజిడ్ బ్రాంకోస్కోపీ ద్వారా సమూలంగా తొలగించవచ్చు.

### రెండు రకాల బ్రాంకోస్కోపీ

బ్రాంకోస్కోపీ రెండు రకాలు. వయసు, ఇరుక్కున్న పదార్థం సైజులను బట్టి మత్తు ఇచ్చి లేదా మత్తు లేకుండా చేస్తారు. మత్తు ఇచ్చి చేసేది రిజిడ్ బ్రాంకోస్కోపీ. మత్తు లేకుండా ఎండోస్కోపీ పద్ధతిలో చేసేది ఫ్లెక్సిబుల్ బ్రాంకోస్కోపీ. రిజిడ్ విధానంలో లోహపు ట్యూబ్‌ను లోపలికి పంపించి, అడ్డుపడిన పదార్థం లేదా వస్తువును బయటకు లాగేస్తారు. ఐదేళ్లలోపు చిన్నపిల్లల్లో గాలి గొట్టాలు చిన్నవిగా ఉండడమే కాకుండా వాళ్లు చికిత్సకు సహకరించరు. కాబట్టి వాళ్లకు మత్తు ఇస్తారు. సాధారణంగా పెద్దవాళ్లకు మత్తు ఇవ్వకుండా చేస్తారు. కొన్ని సందర్భాల్లో మాత్రం మత్తు ఇచ్చి రిజిడ్ బ్రాంకోస్కోపీ చేయాల్సి రావొచ్చు.

### ఏం చేస్తారు?

బ్రాంకోస్కోపీకి 30 నుంచి 45 నిమిషాల సమయం పడుతుంది. ఫారిన్ బాడీ సైజు, మింగిన తర్వాత వైద్యులను కలిసిన సమయాన్ని బట్టి నష్టం ఉంటుంది. కాబట్టి దగ్గు, న్యుమోనియా పదే పదే తిరగబెడుతూ ఉన్నా, మందులకు లొంగక ఇబ్బంది పెడుతూ ఉన్నా ఆలస్యం చేయకుండా వైద్యులను కలవాలి. వైద్యులు బ్రాంకోస్కోపీ ద్వారా గాలి గొట్టాలను పరీక్షించి, అడ్డంకిని కనిపెట్టడంతో పాటు అదే సమయంలో ఆ అడ్డంకినీ తొలగిస్తారు. ఇలాంటి టూ ఇన్ వన్ చికిత్సా విధానం బ్రాంకోస్కోపీలోనే సాధ్యం. పూర్వం ఊపిరితిత్తుల దీర్ఘకాల సమస్యలకు పరిష్కారంగా సర్జరీతో ఛాతీని తెరిచే శస్త్రచికిత్సలను ఎంచుకునేవాళ్లు. కానీ ఇప్పుడు బ్రాంకోస్కోపీ అందుబాటులోకి వచ్చిన తర్వాత సర్జరీతో పని లేకుండానే సమస్యను కనిపెట్టడం, సరిదిద్దడం రెండూ తేలికయ్యాయి.

**డాక్టర్**
**హరికిషన్ గోనుగుంట్ల**
సీనియర్ పల్మనాలజిస్ట్
యశోద హాస్పిటల్స్
సికింద్రాబాద్
8121022333



## స్వైన్ ఫ్లూ మరణాలకు చెక్ పెట్టే ఎక్మో ట్రీట్మెంట్

**స్వైన్ ఫ్లూ పేరు వినగానే వరుస మరణాలు గుర్తుకొస్తాయి. కొన్నిసార్లు ముఖ్యంగా ఇమ్యూనిటీ తక్కువగా ఉన్నవాళ్లలో స్వైన్ ఫ్లూ ప్రాణాంతకం అవుతుంది. ఇలాంటప్పుడు ప్రాణాపాయం నుంచి కాపాడే ఆపద్బాంధవ చికిత్స ఎక్మో ట్రీట్‌మెంట్.**



**ప్రస్తుతం** వర్షాకాలం. తర్వాత రాబోయేది చలికాలం. రెండూ స్వైన్ ఫ్లూ వ్యాప్తికి అనుకూలమైన వాతావరణాలే. తేలిగ్గా ఒకరి నుంచి మరొకరికి సోకే ఈ ఇన్ఫెక్షన్ నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకంగా మారవచ్చు. జలుబు, ముక్కు దురద, దగ్గు, జ్వరం, ఒళ్లు నొప్పులతో మొదలయ్యే స్వైన్ ఫ్లూ లక్షణాలు కొందరిలో ఎక్కువ కాలం పాటు సాగుతాయి. ఐదేండ్ల లోపు పిల్లలు, గర్భిణులు, వృద్ధులు, బాలింతలు, ఉబ్బసం, మధుమేహ రోగులు, ప్రాణాంతక వ్యాధులైన క్యాన్సర్, హెచ్ఐవి కలిగివున్నవాళ్లు.. ఇలా వ్యాధినిరోధక శక్తి తక్కువగా ఉన్నవాళ్లకు ఇది తేలిగ్గా సోకడంతో పాటు మందులకు లొంగక ప్రాణాంతకం అవుతుంది.

### కాంప్లికేషన్లు

వీరిలో స్వైన్ ఫ్లూ లక్షణాలు తగ్గకుండా మరింత పెరిగి, మొదట న్యూమోనియాకు దారితీస్తాయి. ఈ దశలో మందులతో అదుపు చేయవచ్చు. కొందరిలో ఈ దశ కూడా దాటి ఒక ఊపిరితిత్తి నుంచి మరో ఊపిరితిత్తికి న్యుమోనియా సోకడం, ఊపిరితిత్తుల్లోని ప్రతి భాగం వ్యాధిగ్రస్తం కావడం జరుగుతుంది. మరికొందరిలో సమస్య ముదిరి అక్యూట్ రెస్పిరేటరీ డిస్ట్రెస్డ్ సిండ్రోమ్‌గా మారుతుంది. ఈ దశకు చేరిన రోగి ఊపిరితిత్తులు పనిచేయడం మానేస్తాయి. వెంటిలేటర్ అవసరం అవుతుంది. అంతర్గత అవయవాలు దెబ్బతిని మల్టిపుల్ ఆర్గాన్ డిస్‌ఫంక్షన్ సిండ్రోమ్‌కు దారితీస్తుంది.

### చికిత్స

ఇలాంటప్పుడు ఓ పక్క వెంటిలేటర్ సపోర్ట్ ఇస్తూ, స్వైన్ ఫ్లూను అదుపు చేయడం కోసం యాంటీ వైరల్ డ్రగ్స్ ఇవ్వాలి. అదే సమయంలో న్యుమోనియాను తగ్గించడం కోసం యాంటీబ్యాక్టీరియల్ మందులు కూడా ఇవ్వాలి. వీటన్నిటితో పాటు ఇతరత్రా అంతర్గత అవయవాలు ఫెయిల్ అయినప్పుడు వాటిని కాపాడే సపోర్టివ్ కేర్ అత్యవసరం. ఇన్ని రకాల చికిత్సలు ఏకకాలంలో ఇవ్వాలంటే అన్ని రంగాలకు చెందిన వైద్యులు అందుబాటులో ఉండాలి. అత్యాధునిక సదుపాయాలుండాలి. ఇన్ఫెక్షన్లు సోకడానికి వీలు లేని సురక్షిత వాతావరణంలో చికిత్స చేయాలి. సాధారణంగా ఇన్ని సౌలభ్యాలు సాధారణ హాస్పిటల్‌లో ఉండవు. అలా ఉండే హాస్పిటల్‌ను ఎంచుకోవడం అవసరం.

### ఎక్మో.. ఒక వరం

రెండురోజుల్లో దగ్గు, జలుబు తగ్గకపోతే స్వైన్ ఫ్లూగా అనుమానించాలి. ఆర్‌టిపిసిఆర్ అనే పరీక్షలో గొంతు పై భాగం లేదా ముక్కు వెనుక భాగంలోని తెమడను సేకరించి స్వైన్ ఫ్లూను కచ్చితంగా నిర్ధారించుకోవచ్చు. ఈ పరీక్షలో పాజిటివ్ వస్తే వాళ్లకు స్వైన్ ఫ్లూ ఉన్నట్టు. చికిత్సలో భాగంగా మందులు వాడితే స్వైన్ ఫ్లూ తగ్గిపోతుంది. మందులతో తగ్గకుండా మరింత ఇబ్బందులను కలిగిస్తుంటే ఆలస్యం చేయకుండా అత్యాధునిక వసతులున్న హాస్పిటల్‌కి తీసుకెళ్లాలి. అలాంటిచోటే ప్రాణాలు కాపాడే ఎక్మో (ఎక్స్‌ట్రా కార్పోరియల్ మెంబ్రేన్ ఆక్సిజన్ సపోర్ట్) ట్రీట్‌మెంట్ అందుబాటులో ఉంటుంది.

### ఊపిరితిత్తులకు ప్రత్యామ్నాయం..

స్వైన్ ఫ్లూ కారణంగా ఊపిరితిత్తులు పూర్తిగా పాడైపోయినప్పుడు బయటి నుంచి ఆక్సిజన్ అందిస్తారు. ఆక్సిజన్ పెట్టినా కొందరు రోగుల పరిస్థితి మెరుగుపడదు. అప్పుడు ఊపిరితిత్తులకు పూర్తిగా విశ్రాంతి నిచ్చి, వాటిలోకి చేరుకోవాల్సిన రక్తాన్ని బయట యంత్రంలోకి రప్పించి ఆక్సిజన్‌ను కలిపి తిరిగి గుండెకు పంపించే ప్రక్రియ చేపట్టాలి. ఈ సదుపాయంతో ఊపిరితిత్తులు చేయాల్సిన పని యంత్రం చేస్తుంది. కాబట్టి ప్రాణాపాయం తప్పుతుంది. ఇదే ఎక్మో ట్రీట్‌మెంట్.

**డాక్టర్ ఎమ్. గంగాధర్ రెడ్డి**
సీనియర్ పల్మనాలజిస్ట్
యశోద హాస్పిటల్స్
సికింద్రాబాద్
8121022333



## బ్రాంకియల్ థర్మోప్లాస్టీతో ఉబ్బసానికి గుడ్‌బై

**ఉబ్బసం లేదా ఆస్తమావ్యాధి నుంచి పూర్తిగా బయటపడేసే కొత్త చికిత్స ఇప్పుడు అందుబాటులోకి వచ్చింది. పదే పదే వేధించే ఉబ్బస వ్యాధితో జీవితం మీద విరక్తి కలుగుతుంది ఒక్కోసారి. ఇలాంటి వాళ్లు ఉబ్బసానికి శాశ్వతంగా గుడ్‌బై చెప్పేసి గుండెల నిండా ఊపిరి తీసుకోవచ్చు. ఇందుకు ఉపయోగపడే చికిత్సే బ్రాంకియల్ థర్మోప్లాస్టీ.**




**దగ్గు,** ఆయాసం, పిల్లి కూతలు, తుమ్ములు, తెమడ.. ఈ లక్షణాలు సాధారణ దగ్గులోనూ కనిపిస్తాయి. అయితే అది ఉబ్బసం అవునా కాదా అని నిర్ధారించుకోవడానికి లంగ్ ఫంక్షన్ టెస్ట్ చేయాల్సి ఉంటుంది. దీంతోపాటు ఐజిఇ అనే మరో పరీక్ష కూడా ఉంటుంది. దీని ద్వారా మన శరీరంలో ఉండే ఇమ్యునోగ్లోబ్యులిన్ అనే ప్రొటీన్ తీరును కనిపెట్టవచ్చు. అలర్జీ ఏ స్థాయిలో ఉంది.., ఇన్‌హేలర్లు కాకుండా ఇతర మందులు అవసరమా అనేది ఈ పరీక్షతో కనిపెట్టవచ్చు. ఒకసారి వ్యాధి నిర్ధారణ జరిగితే మొదట తీసుకోవాల్సిన చికిత్స ఇన్‌హేలర్లు. వీటికి అలవాటు పడతామనీ, ఆరోగ్యానికి అంత మంచిది కాదనీ అనుకుంటారు కానీ ఇది అపోహే. నోటిమాత్రల కన్నా వెంటనే ప్రభావం చూపించే మంచి చికిత్స ఇన్‌హేలర్లు. వీటిలో ఉండే స్టెరాయిడ్స్ కూడా రక్తంలో కలవకుండా నేరుగా ఊపిరితిత్తుల్లోకే వెళ్తాయి కాబట్టి హాని లేకుండా సమస్యను పరిష్కరిస్తాయి.

### ఇన్‌హేలర్ పనిచేయకపోతే..

కొంతమందికి ఇన్‌హేలర్లు కూడా అదుపు చేయలేనంతగా ఉబ్బసం పెరిగిపోతూ ఉంటుంది. ఆ దశ దాటి తరచుగా ఊపిరి అందక హాస్పిటల్ పాలవుతుంటారు. ఇలాంటి వాళ్లకు రెండు రకాల చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. ఇమ్యునోగ్లోబ్యులిన్ జి ని బ్లాక్ చేసే ఇంజెక్షన్లను నెలకు ఒకటి లేదా రెండింటిని ఏడాది పాటు తీసుకోవచ్చు. దీన్ని ఇమ్యునోగ్లోబ్యులిన్ థెరపీ అంటారు. ఇది కూడా పనిచేయని దశలో అందుబాటులోకి వచ్చిన అత్యాధునిక చికిత్సా విధానం బ్రాంకియల్ థర్మోప్లాస్టీ.

### బ్రాంకియల్ థర్మోప్లాస్టీ అంటే..?

ఉబ్బసం పదే పదే తిరగబెట్టడం వల్ల గాలి గొట్టాల చుట్టూ ఉండే కండరాలు గట్టిగా మారిపోతాయి. దాంతో ఊపిరి తీసుకోవడానికి అనువుగా సంకోచ వ్యాకోచాలు చెందలేవు. గాలి తేలిగ్గా ఊపిరితిత్తుల్లోకి వెళ్లలేదు. ఫలితంగా ఎన్ని మందులు వాడినా, ఇన్‌హేలర్లు వాడినా ఉబ్బసం అదుపులోకి రాక, ఆస్తమా అటాక్స్ పెరుగుతూ ఉంటాయి. పైగా హాస్పిటల్‌లో చేరి వెంటిలేటర్ మీద ఉండాల్సిన దుస్థితీ వస్తుంది.

ఇలాంటప్పుడు గట్టిపడిన ఆ కండరాలను కాల్చి, గాలి గొట్టాలకు స్వేచ్ఛ కలిగించడం ఒక్కటే మార్గం. ఆ పని బ్రాంకియల్ థర్మోప్లాస్టీ ద్వారా చేయవచ్చు. ఈ చికిత్సలో ఎండోస్కోపీ పద్ధతిని పోలిన విధంగానే ఊపిరితిత్తుల్లోకి బ్రాంకోస్కోప్‌ను పంపి, వేడి ద్వారా గాలి గొట్టాలను కుంచించేలా చేస్తున్న కండరాలను బలహీనపరుస్తారు. ఈ చికిత్సను మూడు దఫాలుగా, మూడు వారాల వ్యవధితో చేస్తారు. మొదటి వారం కుడి పక్క కింది భాగం, రెండవసారి ఎడమ పక్క కింది భాగం, మూడవసారి రెండు వైపుల పై భాగాలకూ చికిత్స చేస్తారు. అయితే ఇలా కండరాలను బలహీనపరచడం వల్ల ప్రత్యేకంగా ఎలాంటి ఆరోగ్య సమస్యలూ రావు. పైగా బ్రాంకియల్ థర్మోప్లాస్టీ చేయించుకోవడం వల్ల ఆస్తమా అటాక్స్ తగ్గుతాయి. ఇన్‌హేలర్లు వాడాల్సిన అవసరం ఉండదు. అన్నింటికంటే ముఖ్యంగా ఆస్తమా అటాక్స్‌తో హాస్పిటల్ పాలయ్యే బాధ తప్పుతుంది. జీవన నాణ్యత పెరుగుతుంది. ఈ చికిత్స ఒక్క రోజులోనే అయిపోతుంది. సాయంత్రానికి ఇంటికి వెళ్లిపోవచ్చు. చికిత్స తర్వాత వైద్యులు చెప్పిన సూచనలు పాటిస్తూ, అలర్జీ కారకాలకు దూరంగా ఉంటే చాలు. ఉబ్బసం నుంచి శాశ్వతంగా బయటపడవచ్చు.



**డాక్టర్ గోపీకృష్ణ ఎడ్లపాటి**
సీనియర్ పల్మనాలజిస్ట్
యశోద హాస్పిటల్స్
సికింద్రాబాద్
8121022333

## నిపుణ — విద్య ఉద్యోగ సమాచారం

### ఐఐటీలో నాన్‌టీచింగ్ స్టాఫ్

**చెన్నైలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ)లో నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- **మొత్తం ఖాళీలు:** 13. సూపరింటెండింగ్ ఇంజినీర్–1, డిప్యూటీ రిజిస్ట్రార్–4, సీనియర్ టెక్నికల్ ఆఫీసర్–4, ఫైర్ ఆఫీసర్–1, సెక్యూరిటీ ఆఫీసర్–1, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (టెలిఫోన్)–1, స్పోర్ట్స్ ఆఫీసర్–1 ఉన్నాయి.
- **అర్హతలు:** సంబంధిత సబ్జెక్టుల్లో డిగ్రీ బీఈ/ బీటెక్, ఎంఈ/ ఎంటెక్/ ఎంఎస్సీ/ ఎంసీఏ, మాస్టర్స్ డిగ్రీతోపాటు నిర్దేశిత అనుభవం
- **ఎంపిక విధానం:** రాత పరీక్ష/ ఇంటర్వ్యూ
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** నవంబర్ 4
- **వెబ్‌సైట్:** https://recruit.iitm.ac.in

IIIT BASARA



**బాసరలోని రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ఆర్‌జీయూకేటీ)లో తాత్కాలిక ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.**

### 'బాసర'లో గెస్ట్ ఫ్యాకల్టీ

- **పోస్టులు:** గెస్ట్ ఫ్యాకల్టీ (ఇంజినీరింగ్, నాన్–ఇంజినీరింగ్), గెస్ట్ టెక్నికల్ అసిస్టెంట్–11, స్టెనోగ్రాఫర్–2 పోస్టులు ఉన్నాయి.
- **విభాగాలు:** సివిల్, సీఎస్ఈ, ఈఈఈ, మెకానికల్ ఇంజినీరింగ్, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, ఇంగ్లిష్, మేనేజ్‌మెంట్, తెలుగు.
- **అర్హతలు:** డిగ్రీ, ఎంసీఏ, సంబంధిత సబ్జెక్టుల్లో బీటెక్/ బీఈ, ఎంటెక్/ ఎంఈ ఉత్తీర్ణత. నెట్/ స్లెట్/ సెట్/ పీహెచ్‌డీ.
- **ఎంపిక:** రాతపరీక్ష, ట్రేడ్ టెస్ట్, ఇంటర్వ్యూ ద్వారా
- **జీతం:** గెస్ట్ ఫ్యాకల్టీలకు నెలకు రూ.30,000/–, మిగిలిన పోస్టులకు నెలకు రూ.20,000/–
- **దరఖాస్తు:** ఆన్‌లైన్/ ఆఫ్‌లైన్‌లో
- **చివరితేదీ:** అక్టోబర్ 21
- **హార్డ్ కాపీలకు చివరితేదీ:** అక్టోబర్ 24
- **వెబ్‌సైట్:** http://careers.rgukt.ac.in

### వార్డెన్లు

**ఆర్‌జీకేయూటీ-బాసరలో అసోసియేట్ వార్డెన్, వార్డెన్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- **పోస్టులు:** అసోసియేట్ వార్డెన్–12 (పురుషులు–6, మహిళలు–6), వార్డెన్ అసిస్టెంట్ (పురుషులు–7, మహిళలు–9)–16 ఖాళీలు ఉన్నాయి.
- **జీతం:** అసోసియేట్ వార్డెన్లకు నెలకు రూ.15 వేలతోపాటు భోజనం, బ్యాచిలర్ వసతి సౌకర్యం కల్పిస్తారు.
- వార్డెన్ అసిస్టెంట్లకు నెలకు రూ.10 వేలు ఇస్తారు.
- **ఎంపిక:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** అక్టోబర్ 13

### ఈసీఐఎల్‌లో 200 జేటీవోలు

**ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఈసీఐఎల్)లో జూనియర్ టెక్నికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- **పోస్టు:** జూనియర్ టెక్నికల్ ఆఫీసర్
- **మొత్తం ఖాళీలు:** 200
- **వయస్సు:** 1989, సెప్టెంబర్ 30 తర్వాత జన్మించి ఉండాలి.
- **జీతం:** నెలకు రూ.20,072/–
- **నోట్:** ఈ పోస్టులను కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీ చేస్తారు.
- **అర్హత:** ప్రథమశ్రేణిలో ఇంజినీరింగ్ డిగ్రీ (ఈసీఈ/ఈఈఈ/ఈఐ/సీఎస్ఈ లేదా ఐటీ/మెకానికల్ లేదా తత్సమాన) ఉత్తీర్ణత.
- **ఎంపిక:** బీఈ/బీటెక్‌లో వచ్చిన మార్కుల ఆధారంగా
- **డాక్యుమెంట్ వెరిఫికేషన్:** ఈసీఐఎల్, న్యూఢిల్లీలో
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** అక్టోబర్ 11
- **వెబ్‌సైట్:** http://careers.ecil.co.in

epaper.ntnews.com

## రిజిస్ట్రేషన్‌శాఖలో డిజిటల్ టెండర్లు

పత్రాల డిజిటలైజేషన్‌కు రంగం సిద్ధం ■ టెండర్లు ఖరారుచేసిన టీఎస్‌టీఎస్

**ప్రత్యేకప్రతినిధి, నమస్తే తెలంగాణ:** ఏండ్లుగా పెండింగ్‌లో ఉన్న స్థిరాస్తులకు సంబంధించిన పురాతన పత్రాల డిజిటలైజేషన్ ప్రక్రియను స్టాంపులు, రిజిస్ట్రేషన్లశాఖ ఈ నెలాఖరు నుంచే ప్రారంభించనున్నది. ఇందు కోసం టెండర్లు వేసిన కంపెనీల్లో అర్హతపొందిన నాలుగింటిలో రెండు కంపెనీలను తెలంగాణ స్టేట్ టెక్నాలజీ సర్వీసెస్ (టీఎస్‌టీఎస్) ఖరారు చేసినట్టు తెలిసింది. దుమ్ము పట్టి చిరిగిపోతున్న స్థిరాస్తులకు సంబంధించిన వందేండ్లనాటి పత్రాలకు కొత్త రూపమివ్వడానికి డిజిటలైజేషన్‌ను చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. 1860నుంచి 1999వరకు ఉన్న మ్యానువల్‌గా ఉన్న స్థిరాస్తుల పత్రాలను డిజిటలైజ్‌చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.20కోట్లు మంజూరుచేసింది. స్టాంపులు, రిజిస్ట్రేషన్‌శాఖ రికార్డుల డిజిటలైజేషన్ బాధ్యతను టీఎస్‌టీఎస్‌కు అప్పగించింది.

## యాసంగికి విత్తన ప్రణాళిక సిద్ధం

**హైదరాబాద్, నమస్తేతెలంగాణ:** యాసంగిలో రైతులకు విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా రాష్ట్ర వ్యవసాయశాఖ ప్రణాళిక సిద్ధంచేసింది. 5 లక్షల క్వింటాళ్ల వివిధ రకాల విత్తనాలను సబ్సిడీపై పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు జిల్లాలవారీగా కేటాయింపులు చేసి.. రూ.87.09 కోట్ల విలువైన విత్తనాలను పంపిణీకి సిద్ధంచేసింది. యాసంగిలో ప్రధానంగా సాగుచేసే శనగ, వేరుశనగ విత్తనాలను ఇప్పటికే ఆయా జిల్లాలకు పంపించింది. జిల్లాల్లో 22,767 క్వింటాళ్ల విత్తనాలు పొజిషన్‌చేయగా, 20,136 క్వింటాళ్లు పంపిణీ జరిగింది. విత్తనాల విక్రయాలను ఆన్‌లైన్ సబ్సిడీ సీడ్ పంపిణీద్వారా మాత్రమే చేయాలని వ్యవసాయశాఖ స్పష్టంచేసింది. రాష్ట్రానికి యాసంగికి కూడా ఎరువుల కేటాయింపు పెంచాలని కేంద్రానికి విజ్ఞప్తిచేసింది. 7 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమని.. ఆ మేరకు సరఫరా చేయాలని వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారధి కేంద్రానికి ఇటీవల లేఖరాశారు.




## హెల్త్ వాచ్

### ఆరోగ్యంపై చంద్రుడి ప్రభావం ఉంటుందా?



చంద్రుడి గమనం మనుషుల ఆరోగ్యంపైనా ప్రభావం చూపిస్తుందంటున్నారు సైంటిస్టులు. గ్రహగమనాల ప్రభావం రోజువారీ జీవితం మీద, ఆరోగ్యం మీద ఉంటుందని ఎప్పటినుంచో భారతీయుల నమ్మకం. అదేమీ వాస్తవదూరం కాదంటున్నారు పరిశోధకులు. విశ్వంలో అన్నింటికంటే భూమికి దగ్గరగా ఉండేది చంద్రుడే. భూమి ఉపగ్రహమైన చంద్రుడి ప్రభావం భూమిపైన ఉండే జీవజాలమంతటి మీదా ఉంటుంది. పౌర్ణమి రోజుల్లో పగడపు జీవులు అండాలను విడుదలచేస్తాయి. అంటే వాటి ప్రత్యుత్పత్తి పైన చంద్రుడి ప్రభావం ఉంటుందన్నమాట. భూమి, చంద్రుడి మధ్య గల గురుత్వాకర్షణ శక్తి వల్ల సముద్రంలో అలలు ఎగిసిపడతాయి. అదేవిధంగా మనుషుల జీవప్రక్రియలపై కూడా చంద్రుడి ప్రభావం ఉంటుందంటున్నారు శాస్త్రవేత్తలు. మహిళల్లో నెలసరి చక్రం, చంద్రుడి స్థాయిల మధ్య సంబంధం ఉన్నట్టు అధ్యయనాల్లో తేలింది. నెలసరి చక్రం సగటున 28 రోజులు ఉంటుంది. చంద్రుడు భూమి చుట్టూ తిరగటానికి పట్టే కాలం 27 రోజుల 7 గంటల 43 నిమిషాలు. మహిళల్లో నెలసరి, అండోత్పత్తి ప్రక్రియలకు చంద్రుడి పౌర్ణమి, అమావాస్యలకు సంబంధం ఉందని చెప్తున్నాయి అధ్యయనాలు. ఇకపోతే పౌర్ణమి సమయం నిద్రను డిస్టర్బ్ చేస్తుందని కూడా తేలింది. 319 మందిపై చేసిన అధ్యయనం ఈ విషయాన్ని నిర్ధారిస్తున్నది. మానసిక ఆరోగ్యం పైనా చంద్రుడి ప్రభావం ఉంటుంది. సాధారణంగా రాత్రి సమయంలో, అదీగాక పౌర్ణమి రోజున హింసాయుత ప్రవర్తన ఎక్కువవుతుందంటున్నారు. ఈ విషయంలో మరిన్ని పరిశోధనలు జరుగాల్సి ఉన్నది.

### పురుషులూ.. జర భద్రం!



ఇంటిపనులు చేయడానికి వెనుకాడే పురుషులూ జాగ్రత్త.. అంటున్నారు పరిశోధకులు. ఇంటిపనుల్లో సాయంచేసే పురుషుల కన్నా, సాయం చేయనివాళ్ల ఆరోగ్యం త్వరగా దెబ్బతింటున్నట్టు ఇటీవలి పరిశోధనల్లో తేలింది. ఇంట్లో పనులు చేసుకోవడం ఆడవాళ్ల డ్యూటీ అన్న భావనలో చాలా మంది ఉంటుంటారు. కొందరైతే ఆ పనులు అసలు మగవాళ్లకు సంబంధించినవే కావన్నట్టుగా ప్రవర్తిస్తుంటారు. కొందరు ఆడవాళ్లు కూడా పురుషులను ఇంటి పనులు చేయనివ్వరు. ఇద్దరం ఉద్యోగాలు చేసి సంపాదిస్తున్నాం కాబట్టి ఇంటిపనులు కూడా ఇద్దరం కలిసిచేసుకుందా అనుకునేవాళ్లూ ఉన్నారు. ఇవెలా ఉన్నా.. వంటావార్పులో పాలుపంచుకోకపోతే అనేక మానసిక, శారీరక రుగ్మతలు తప్పవంటున్నారు సైంటిస్టులు. లండన్ యూనివర్సిటీ కాలేజ్ ఆధ్వర్యంలో చేపట్టిన అధ్యయనంలో ఈ విషయం వెల్లడైంది. 20 వేల మంది మహిళలు, పురుషులను పరిశీలించగా ఈ అంశాలు వెలుగు చూశాయి. వీరిలో ఇంటిపనులు, తోటపని లాంటి శారీరక శ్రమచేసేవారు ఆరోగ్యంగా ఉంటున్నట్టు వెల్లడైంది. ఇలాంటి పనులంటే ఇష్టపడనివారు హృద్రోగాలు, క్యాన్సర్లతోపాటు మానసిక ఒత్తిడి వల్ల వచ్చే గ్లూకోజ్ ఇన్‌టాలరెన్స్, ఇన్‌ఫ్లమేషన్ లాంటి రుగ్మతలకు గురవుతారని గుర్తించారు.

### వేడివేడి కాఫీతో క్యాన్సర్?!



వేడివేడి కాఫీ లేదా టీ కడుపులో పడితేగానీ చాలామంది రిలాక్స్ అవ్వరు. లిమిట్‌గా తీసుకుంటే కాఫీ, టీ మంచివే కానీ.. అంత వేడిగా తీసుకుంటే మాత్రం ప్రమాదమే అంటున్నాయి ప్రపంచ ఆరోగ్య సంస్థ, ఇతర అధ్యయనాలు. చైనాలో జరిగిన పరిశోధన ప్రకారం స్మోకింగ్, ఆల్కహాల్‌కుతోడు టీ, కాఫీలను అతి వేడిగా తాగితే అవి క్యాన్సర్‌కు కాక్‌టెయిల్ అవుతాయంటున్నారు. ఇలాంటివాళ్లలో అన్నవాహిక క్యాన్సర్ రిస్కు ఐదొంతులు ఎక్కువగా ఉంటుంది. 30 నుంచి 79 ఏండ్ల మధ్య వయసున్న దాదాపు 4.50 లక్షల మందితో తొమ్మిదేండ్లపాటు ఈ అధ్యయనం చేశారు. పొగతాగడం, ఆల్కహాల్ అలవాట్లతో పాటు రెగ్యులర్‌గా రోజూ వేడివేడి టీ గానీ కాఫీ గానీ తీసుకునేవాళ్లలో క్యాన్సర్ అవకాశాలు పెరిగినట్టు గమనించారు. వేడిగా ఉండే బేవరేజెస్ వల్ల అన్నవాహిక కణాలు డ్యామేజ్ అయి క్యాన్సర్ కణాలు ఏర్పడటానికి దారితీస్తున్నాయని సౌత్ కాలిఫోర్నియా యూనివర్సిటీకి చెందిన పరిశోధకులు కూడా అంటున్నారు. నిజానికి గోరువెచ్చని కప్పు కాఫీ వల్ల ప్రమాదం లేకపోగా లాభాలు కూడా ఉన్నాయి. దీనివల్ల లివర్ క్యాన్సర్ వచ్చే ప్రమాదం 15% తగ్గుతుందని ఇంతకు ముందే లాన్సెట్ ఆంకాలజీ పత్రికలో ప్రచురితమైంది. 50 వేల మందిపై పదేండ్లపాటు చేసిన మరో అధ్యయనంలో అతి వేడిగా ఉన్న కాఫీ, టీలు తాగేవాళ్లలో 317 మందికి అన్నవాహిక క్యాన్సర్ వచ్చినట్టు తేలింది. రోజుకి 700 మి.లీ. 60 డిగ్రీల ఉష్ణోగ్రతలో అంటే 140 డిగ్రీల ఫారన్‌హిట్ ఉన్న టీ తాగితే అన్నవాహిక క్యాన్సర్ వచ్చే అవకాశం 90% వరకు ఉంటుందని ఈ రిసెర్చ్ పేర్కొంటున్నది. ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా ఇదే విషయాన్ని చెప్తూ, గోరువెచ్చని డ్రింక్స్ తాగాలని సూచిస్తున్నది.

# మా విమానం మాకిచ్చేయ్!

- పాక్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌కు తెగేసి చెప్పిన సౌదీ యువరాజు మహ్మద్ బిన్ సల్మాన్
- సంచలన కథనం ప్రచురించిన పాక్ పత్రిక



పాకిస్థాన్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ ఇటీవల అమెరికా పర్యటనకు వినియోగించిన సౌదీ విమానం

**ఇస్లామాబాద్, అక్టోబర్ 7:** పాకిస్థాన్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌కు భంగపాట్లు, అవమానాలు తప్పడం లేదు. గత నెల ఐక్యరాజ్యసమితి(ఐరాస) సమావేశాల్లో ఇమ్రాన్ ప్రవర్తించిన తీరుతో అసంతృప్తికి లోనైన సౌదీ యువరాజు మహ్మద్ బిన్ సల్మాన్.. తాను ఇచ్చిన విమానాన్ని తిరిగిచ్చేయాలంటూ ఇమ్రాన్‌కు తెగేసి చెప్పారు. అందుకే అమెరికా నుంచి తిరుగు ప్రయాణంలో ఇమ్రాన్ కమర్షియల్ విమానంలో ఇస్లామాబాద్ చేరుకున్నారని పాకిస్థాన్‌కు చెందిన ఓ ప్రముఖ పత్రిక 'ఫ్రైడే టైమ్స్' ఓ కథనం ద్వారా వెల్లడించింది. ఐరాస సమావేశాల్లో ఇమ్రాన్ ప్రదర్శించిన దౌత్య నీతితో సల్మాన్ విసుగు చెందారని, అందువల్లే తన విమానాన్ని ఇచ్చి పంపిన సల్మాన్.. తిరిగి విమానాన్ని తనకు అప్పగించాలని పాక్ బృందానికి తెగేసి చెప్పారని సదరు పత్రిక పేర్కొంది. అయితే, ఫ్రైడే టైమ్స్ కథనాన్ని పాక్ ప్రభుత్వ ప్రతినిధి ఒకరు ఖండించారు. సదరు వార్త నిరాధారమని, అవాస్తవమని పేర్కొన్నారు. ఐరాస సమావేశాలకు వెళ్లడానికి ముందు.. ఇమ్రాన్‌ఖాన్ సౌదీలో పర్యటించారు. అక్కడి నుంచి అమెరికాకు వెళ్తున్న ఇమ్రాన్ కోసం సౌదీ యువరాజు సల్మాన్ తన ప్రైవేట్ జెట్‌ను ఇచ్చారు. దీంతో ఇమ్రాన్‌తో పాటు ఆయన ప్రతినిధి బృందం ఆ విమానంలో అమెరికా పర్యటనకు వెళ్లారు. పర్యటన ముగించుకొని వస్తుండగా.. విమానంలో సాంకేతిక లోపం తలెత్తి తిరిగి ఇమ్రాన్ న్యూయార్క్ వెళ్లారు. తర్వాతి రోజు కమర్షియల్ విమానంలో ఆయన ఇస్లామాబాద్ చేరుకొన్నారు. అయితే తాజా 'ఫ్రైడే టైమ్స్' కథనం మాత్రం ఈ వాదన తప్పని పేర్కొంది. విమానంలో సాంకేతికలోపం వంటి కారణాలు అన్నీ బూటకమేనని, అమెరికాలో ఇమ్రాన్ ప్రవర్తనతో విసుగు చెందిన సల్మాన్ తన విమానాన్ని తిరిగి ఇచ్చేయమనడంతో గత్యంతరం లేకనే ఇమ్రాన్ కమర్షియల్ విమానంలో సొంత దేశానికి తిరిగి వచ్చారని కుండబద్దలు కొట్టింది. సౌదీ రాజు సల్మాన్‌కి ఇమ్రాన్ మీద కోపం రావడానికి గల కారణాల్ని కూడా పత్రిక వెల్లడించింది. టర్కీ, మలేషియాతో కలిసి ఇస్లామిక్ దేశాల వాదనను వినిపించాలనుకోవడానికి ఓ ఇంగ్లీషు చానెల్‌ను ప్రారంభించాలనుకుంటున్నట్టు ఇమ్రాన్ చెప్పడం సౌదీ యువరాజుకు నచ్చలేదని, పైగా తన అనుమతి లేకుండా ఇరాన్‌తో చర్చలు జరపడంపై కూడా సల్మాన్ కోపంగా ఉన్నారని సదరు పత్రిక పేర్కొంది. ఈ నేపథ్యంలోనే ఆయన తన విమానాన్ని వెనక్కి తెచ్చుకున్నారని వెల్లడించింది.



ఏపీ తొలి సీజేగా ప్రమాణం చేసిన జస్టిస్ జీకే మహేశ్వరిని అభినందిస్తున్న ఏపీ సీఎం జగన్

### ఏపీ సీజేగా జీకే మహేశ్వరి ప్రమాణస్వీకారం

**అమరావతి:** ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తొలి చీఫ్ జస్టిస్‌గా జస్టిస్ జితేంద్రకుమార్ మహేశ్వరి సోమవారం ప్రమాణం చేశారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆ రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ ఆయనతో ప్రమాణం చేయించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డితోపాటు హైకోర్టు తాత్కాలిక సీజేగా వ్యవహరిస్తున్న జస్టిస్ ప్రవీణ్‌కుమార్, ఏపీ సీఎస్ ఎల్వీ సుబ్రహ్మణ్యం, న్యాయమూర్తులు, నూతన సీజే కుటుంబసభ్యులు పాల్గొన్నారు. అనంతరం అక్కడే ఏర్పాటుచేసిన తేనీటి విందులో వారు పాల్గొన్నారు.

# 64వ రోజూ అదే పరిస్థితి

- కశ్మీర్‌లో స్తంభించిన జన జీవనం

**శ్రీనగర్/ జమ్ము, అక్టోబర్ 7:** కశ్మీర్‌లో సోమవారం వరుసగా 64వ రోజు జన జీవనం స్తంభించింది. కశ్మీర్ పరిధిలోని ప్రధాన మార్కెట్లన్నీ మూసివేశారు. ప్రజా రవాణా వాహనాలు రోడ్డెక్కలేదని అధికారులు తెలిపారు. కశ్మీర్ లోయలోని శ్రీనగర్‌తోపాటు ఇతర జిల్లాల్లో ప్రైవేట్ వాహనాలు మాత్రం తిరిగాయి. శ్రీనగర్ నగర పరిధిలో ఆటోరిక్షాలు, అంతర్‌జిల్లా క్యాబ్ సర్వీసులు నడిచాయి. శ్రీనగర్‌లో ఉదయం దుకాణాలు తెరిచినా మధ్యాహ్నం 11 గంటలకే మూతపడ్డాయి. టీఆర్సీ చౌక్-లాల్‌చౌక్ పరిధిలో కొందరు వ్యాపారులు స్టాళ్లు ఏర్పాటు చేశారు. కశ్మీర్‌లోయలో ఆంక్షలు అమలులో లేకున్నా, సున్నిత ప్రదేశాల్లో శాంతిభద్రతలను పరిరక్షించేందుకు భారీగా భద్రతాబలగాలను మోహరించినట్లు అధికారులు తెలిపారు. ల్యాండ్‌లైన్ ఫోన్ సర్వీసులు క్రమంగా పునరుద్ధరిస్తున్నారు. హంద్వారా, కుప్వారా ప్రాంతాల్లో మినహా కశ్మీర్ లోయలో మొబైల్ ఫోన్ సర్వీసులను సస్పెండ్ చేశారు. ఇంటర్నెట్ సర్వీసులు పూర్తిగా నిలిపివేశారు.



శ్రీనగర్‌లో ప్రయాణికులను తనిఖీ చేస్తున్న భద్రతా సిబ్బంది

**సాంబలో ఫిరంగి గుండ్లు లభ్యం**

జమ్ముకశ్మీర్‌లోని సాంబ జిల్లాలోని ఘగ్వాల్ ప్రాంతం సంగ్వాలీ మోర్హ్ గ్రామంలో సోమవారం ఉదయం 81 మి.మీ. ఫిరంగి గుండ్లను కనుకొన్నారు. ఈ సమాచారం తెలిసిన వెంటనే ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్న సైన్యం, పోలీసు బాంబు డిస్పోజబుల్ స్క్వాడ్ వాటిని నిర్వీర్యం చేశారు. జమ్ము-పఠాన్‌కోట్ జాతీయ రహదారిపై ఉదయం 6.30 గంటలకు ఫిరంగి గుండ్లు కనిపించడంతో ఓ గ్రామస్థుడు పోలీసులకు సమాచారం ఇచ్చాడు. స్క్రాప్ డీలర్ వాటిని ఇక్కడ వదిలేసి ఉంటారని తమ ప్రాథమిక దర్యాప్తులో తేలినట్టు అధికారులు తెలిపారు.



కోల్‌కతాలోని దుర్గా మండపం వద్ద భర్త నిఖిల్‌తో కలిసి పూజలో పాల్గొన్న ఎంపీ నుస్రత్ జహాన్

## ఎంపీ నుస్రత్‌పై మత పెద్దల ఆగ్రహం

- పేరు, మతం మార్చుకొంటే ఇబ్బందిలేదన్న ముఫ్తీ అసద్ ఖాస్మీ
- భర్త నిఖిల్‌జైన్‌తో కలిసి దుర్గామాత పూజల్లో పాల్గొనడంపై మండిపాటు

**కోల్‌కతా:** ప్రముఖ బెంగాలీ నటి, తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ నుస్రత్ జహాన్ దుర్గాపూజలో పాల్గొనడంపై ముస్లిం మతపెద్దలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. నుస్రత్ తీరును దారుల్ ఉలూం దేవబంద్‌కు చెందిన మతపెద్దలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. 'ముస్లిం మహిళ బొట్టు, మంగళసూత్రం ధరించి హిందూ దేవతలకు పూజలు చేయడం ముస్లిం మతాచారం కాదు. ఇస్లాం తన అనుచరులు అల్లాహ్‌ను మాత్రమే ప్రార్థించాలని ఆదేశిస్తున్నది. ఒకవేళ ఎంపీ జహాన్ పూజలు చేయాలనుకొంటే పేరు, మతం మార్చుకొంటే మాకెలాంటి అభ్యంతరం లేదు' అని దారుల్ ఉలూం దేవబంద్‌కు చెందిన ముఫ్తీ అసద్ ఖాస్మీ చెప్పారు. మరోవైపు నుస్రత్ జహాన్ పూజలు చేయడంలో తప్పేమీ కనిపించడం లేదని ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన షియా వక్ఫ్ బోర్డ్ చైర్మన్ వాసీం రిజ్వీ సమర్థించారు. హిందువును పెండ్లి చేసుకొన్న జహాన్‌కు తన ఇష్టానుసారం హిందూ మతానికి చెందిన బొట్టు, మంగళసూత్రం ధరించే హక్కు ఉన్నదన్నారు. నుదుట సింధూరం, చీర ధరించి జూన్ 25న ఎంపీగా నుస్రత్ జహాన్ లోక్‌సభలో ప్రమాణం చేయడంపై కూడా ముస్లిం మతపెద్దలు ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. ఎంపీ అయిన తర్వాత తొలిసారి జరుపుకొంటున్న దసరా శరన్నవరాత్రి సందర్భంగా కోల్‌కతాలో భర్త నిఖిల్‌జైన్‌తో కలిసి సురుచి సంఘ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన దుర్గా పూజలో పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. చేతులు జోడించి ప్రార్థన చేసిన నుస్రత్.. దుర్గాష్టమి వేడుకల్లో సంగీత వాయిద్యమైన ధాక్ వాయించి అందరినీ ఆకట్టుకొన్నారు. నుస్రత్ జహాన్‌కు ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో విపరీతంగా షేర్ అవుతున్నాయి.

## తెలంగాణ పథకాలపై ప్రొబేషనరీ ఐఎఫ్‌ఎస్‌ల ఆసక్తి

క్షేత్రస్థాయిలో పర్యటన..

అరణ్యభవన్‌లో ప్రత్యేక సమావేశం



అరణ్యభవన్‌లో సోమవారం జరిగిన సమావేశంలో ప్రొబేషనరీ ఐఎఫ్‌ఎస్‌లకు పథకాల తీరును వివరిస్తున్న అటవీశాఖ ఉన్నతాధికారులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** డెహ్రాడూన్ ఇందిరాగాంధీ నేషనల్ ఫారెస్ట్ అకాడమీలో శిక్షణ పూర్తిచేసుకున్న 2018 బ్యాచ్‌కు చెందిన 74 మంది ప్రొబేషనరీ ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ అధికారులు రాష్ట్రంలో పర్యటిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అటవీ అభివృద్ధికి చేపడుతున్న పథకాలపై అధ్యయనం చేస్తున్నారు. సిద్దిపేట, గజ్వేల్ రేంజ్‌లలో పర్యటించి క్షీణించిన అడవుల పునరుజ్జీవనం, తెలంగాణకు హరితహారం కార్యక్రమాల అమలుతీరును క్షేత్రస్థాయిలో ఆసక్తిగా తెలుసుకున్నారు. కోమటిబండలో మిషన్ భగీరథ పథకాన్ని, కండ్లకోయలో ఆక్సిజన్ పార్క్‌ను పరిశీలించారు. అనంతరం సోమవారం అరణ్యభవన్‌లో రాష్ట్ర అటవీశాఖ ఉన్నతాధికారులతో వారు సమావేశమయ్యారు. ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆర్ శోభతోపాటు ఉన్నతాధికారులు రాష్ట్రంలో అడవుల పునరుద్ధరణ, అటవీ విస్తీర్ణం పెంపు, హరితహారం, వన్యప్రాణుల సంరక్షణకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. రాజేంద్రనగర్‌లోని నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్ (నార్మ్), సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జాతీయ పోలీస్ అకాడమీలో కొన్ని రోజులపాటు శిక్షణ పొందనున్నారు.

## ఎంబీసీ యువతకు ఉపాధి కల్పన

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో బాగా వెనుకబడిన కులాలకు ఉపాధి కల్పన కోసం ఎంబీసీ కార్పొరేషన్ ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. సంచారజాతులకు చెందిన యువతకు ఉపాధి శిక్షణ, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేకశిక్షణ కార్యక్రమాలను చేపట్టాలని నిర్ణయించింది. ఈ మేరకు తెలంగాణలోని పర్యాటకప్రాంతాలు, పుణ్యక్షేత్రాల వద్ద వీరికి ఈ- ఆటోలు ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించనున్నది. ఎంబీసీ కులాలకు చెందిన 10వ తరగతి పాసై, 21-45 ఏండ్ల మధ్యవారు, డ్రైవింగ్ లైసెన్స్ ఉన్నవారికి ఈ ఆటోలు ఇవ్వనున్నారు. దీంతోపాటు 8వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదివి ఏదైనా పనిలో స్థిరపడేందుకు పలు అంశాల్లో నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇవ్వనున్నారు. గ్రామీణ ప్రాంతాలకు చెందినవారే కాకుండా హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా పరిధిలోని సంచార జాతుల యువతకు ఉపాధి కల్పనలో భాగంగా మెట్రోస్టేషన్లలో టీ స్టాళ్లను ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం కల్పించనున్నారు. ఎంబీసీకి చెందిన అన్ని కులాలవారు దరఖాస్తు చేసుకోవాలని ఎంబీసీ కార్పొరేషన్ ఎండీ అలోక్‌కుమార్ సూచించారు.

## నామినేషన్ తిరస్కారం.. పార్టీ సస్పెన్షన్

- హుజూర్‌నగర్ సీపీఎం అభ్యర్థి శేఖర్‌రావుపై వేటు
- జిల్లా కార్యదర్శి రాములు తొలగింపు

**హైదరాబాద్, నమస్తేతెలంగాణ:** హుజూర్‌నగర్ ఉప ఎన్నికల్లో నామినేషన్ పత్రాలు దాఖలు చేయడంలో నిర్లక్ష్యం వహించిన సీపీఎం అభ్యర్థి పారేపల్లి శేఖర్‌రావుపై సస్పెన్షన్ వేటు పడింది. సోమవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర కార్యాలయంలో సీపీఎం పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా హుజూర్‌నగర్ ఉప ఎన్నికల్లో తెలంగాణ ప్రజా పార్టీ (టీపీపీ) అభ్యర్థి సాంబశివగౌడ్‌కు మద్దతు ఇవ్వాలని పార్టీ నాయకులు నిర్ణయం తీసుకున్నారు. సాంకేతిక కారణాలతో శేఖర్‌రావు నామినేషన్ తిరస్కరణకు గురైంది. రిటర్నింగ్ అధికారి లిఖితపూర్వకంగా ఇచ్చినా నామినేషన్ గడువులోపు సరైన పత్రాలు అందించకపోవడంతో పార్టీ ప్రతిష్ఠ దెబ్బతిన్నదని గుర్తించిన సీపీఎం రాష్ట్ర కమిటీ నామినేషన్ పత్రాలు దాఖలు చేయడంలో నిర్లక్ష్యం వహించిన అభ్యర్థి పారేపల్లి శేఖర్‌రావును సస్పెండ్ చేసింది. నిర్లక్ష్యానికి కారణమైన సీపీఎం సూర్యాపేట జిల్లా కార్యదర్శి ముల్కలపల్లి రాములును జిల్లా కార్యదర్శి, రాష్ట్ర కమిటీ బాధ్యతల నుంచి తొలగించింది. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, పార్టీ నాయకులు జీ నాగయ్య, వెంకట్, డీజీ నరసింహారావుతో కలిసి మాట్లాడుతూ హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని సాంబశివగౌడ్‌ను గెలిపించాలని ఆయన కోరారు. ఆర్టీసీ సమస్యలను పరిష్కరించాలని, ఈ నెల 9న ఆర్టీసీ డిపోల ముందు నిరసన ప్రదర్శనలు చేపట్టనున్నట్టు తెలిపారు.




గ్రేటర్ హైదరాబాద్‌లోని చందానగర్ పరిసర ప్రాంతాలను సోమవారం తెల్లవారుజామున పొంగమంచు కమ్మేసింది. దట్టమైన పొగమంచు ఆవరించడంతో స్థానిక పీజేఆర్ స్టేడియం ఆవరణ, పరిసరాలు ఊటీని తలపించాయి. స్టేడియానికి వచ్చిన వాకర్స్, క్రీడాకారులు ఆ సుందర దృశ్యాలను తమ సెల్‌ఫోన్లలో బంధించారు. - చందానగర్, నమస్తే తెలంగాణ

## వ్యవసాయ ఉత్పత్తులకు అనుగుణంగా ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్లు

- వ్యవసాయ, ఉద్యానశాఖల కసరత్తు
- వచ్చే ఏడాది చివరి నాటికి స్పైస్ ప్రాసెసింగ్ యూనిట్



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో వ్యవసాయ ఉత్పత్తులకు అనుగుణంగా ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటుచేసేందుకు వ్యవసాయ, ఉద్యానశాఖలు కసరత్తును వేగవంతం చేశాయి. మహిళా సంఘాల సహకారంతో ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా కూరగాయలు, ఇతర ఉత్పత్తులు పంపిణీచేస్తామని సీఎం కేసీఆర్ ఇటీవల అసెంబ్లీలో ప్రకటించిన నేపథ్యంలో ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు పలు కంపెనీలు ముందుకొస్తున్నాయి. ఈ విషయమై ఐటీసీ కంపెనీ ఇప్పటికే వ్యవసాయశాఖకు పలు ప్రతిపాదనలు పంపినట్టు సమాచారం. మరోవైపు ఉద్యానశాఖ కూడా స్పైస్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటును వేగవంతంచేసింది. వచ్చే ఏడాది చివరినాటికి దీన్ని అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా నిర్ణయించారు.

**ఏటా 6.34 లక్షల టన్నుల కూరగాయల కొరత**

రాష్ట్రంలో కూరగాయల ఉత్పత్తి అవసరాలకు తగినట్టుగా లేదు. ఉద్యానశాఖ నివేదిక ప్రకారం రాష్ట్రానికి ఏటా 22.28 లక్షల టన్నుల కూరగాయలు అవసరంకాగా 15.94 లక్షల టన్నులు మాత్రమే సాగవుతున్నాయి. ఈ లెక్కన 6.34 లక్షల టన్నుల కొరత వేధిస్తున్నది. ముఖ్యంగా పచ్చిమిర్చి, కాకరకాయ, బీరకాయ, సొరకాయ, దోసకాయ, బీన్స్, క్యాప్సికం, ఆలుగడ్డ, చామగడ్డ, క్యారట్, కందగడ్డ, ఆకుకూరలు, ఉల్లిగడ్డ సహా 14 రకాల కూరగాయలు అవసరాలకు సరిపడా ఉత్పత్తి కావడంలేదు.

**మహిళా సంఘాలకు చిన్న యూనిట్లు**

రాష్ట్రంలో ఏర్పాటుచేయనున్న ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్లలో మహిళా సంఘాలకు చిన్న యూనిట్లు ఇవ్వనున్నారు. టమాటా సాగయ్యే ప్రాంతాల్లో పచ్చడి తయారీతో పాటు, సాస్, కెచప్ లాంటి ఉత్పత్తులు తీసుకొస్తే రైతులకు, మహిళలకు లాభదాయకంగా ఉంటుందని ప్రభుత్వం భావిస్తున్నది. పసుపు అధికంగా పండే ఐదు జిల్లాల్లో పసుపు పౌడర్, ఓలియోరిసిస్, కుర్కుమిన్ లాంటి ఉత్పత్తులు తయారుచేసే యూనిట్లను, వరంగల్ రూరల్, మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట జిల్లాల్లో మిర్చిపంటకు సంబంధించిన విలువ ఆధారిత పరిశ్రమలను ఏర్పాటుచేయాలని యోచిస్తున్నారు.


HAAPPY MOVIES
G.RAAM MUNISH
Presents
CK CINEMAS
RDX Love
C.KALYAN SHANKAR BHANU
RADHAN CHINNA C.VENKATESWAR RAO C.RAMPRASAD PRAWIN PUDI
విజయదశమి
శుభాకాంక్షలు
అక్టోబర్
11
విడుదల
ADITYA


KRISHI CREATIONS
Love Lover X Life
మళ్ళీ మళ్ళీ చూశా
విజయదశమి
శుభాకాంక్షలు
Koteswar Rao Konidena Hemanth Karthik
అక్టోబర్
18
విడుదల
ADITYA


Maa Aai PRODUCTIONS
FINAL SCHEDULE IN PROGRESS
HAPPY
DUSSEHRA
STARRING
RUPESH KUMAR CHOUDHARY
SALONI MISRA
22
PRODUCER
Mrs. SUSHEELA DEVI
STORY - SCREENPLAY - DIRECTION
SHIVA KUMAR . B
MUSIC SAI KARTHEEK DOP B.V RAVI KIRAN ACTION STUNT JASHUVA
ART PEDDIRAJU ADDALA CHOREOGRAPHY ANEE LAMA EDITOR SYAM VADAVALLI
CHIEF CODIRECTOR PULLARAO KOPPINEEDI PRO B A RAJU
@MaaAaiOfficial
YouTube
#MaaAaiProductions
maaaaiproductions


HISTORIC
BLOCKBUSTER
దసరా శుభాకాంక్షలు
KONIDELA PRODUCTION COMPANY
SMT. SUREKHA KONIDELA PRESENTS
MEGASTAR'S
సైరా
నరసింహా రెడ్డి
A SURENDER REDDY FILM PRODUCED BY RAM CHARAN
DOP RATNAVELU ISC MUSIC AMIT TRIVEDI EDITING SREEKAR PRASAD PRODUCTION DESIGN RAJEEVAN
VFX SUPERVISOR R C KAMALAKANNAN WRITTEN BY PARUCHURI BROTHERS DIALOGUES SAI MADHAV BURRA
STUNTS GREG POWELL LEE WHITTAKER RAM-LAXMAN A VIJAY
/KonidelaPro
U/A
BOOK YOUR TICKETS ON
book my show